
జూలై 68 -




తప్పక చూడండి!
దర్శకత్వం.. కె.వి.రెడ్డి. (B.Sc..HONS)
నిర్మాత. పి.యస్.రెడ్డి. BAR-AT-LAW
VIJAYA




జనరంజని ఫిలింస్ వారి
చల్లని నీడ
నిర్మాణం:
దర్శకత్వం
డా. కె.వి. సుబ్బయ్య-చలపతిరావు తాతినేని రామారావు
సంగీతం: చలపతిరావు మాటలు: రావికొండలరావు
పాటలు: దాశరథి,నారాయణరెడ్డి ఛాయ ఎం.కె.రాజు
కళ: గోఖలే కూర్పు: కృష్ణస్వామి, నృత్యాలు: చిన్ని-సంపత్
మేకప్ తన్ కుమార్ సహదర్శకుడు కె.వి.రావు
స్టిల్స్: భూషణ్ పబ్లిసిటీ డిజైన్స్ స్టూడియో కేతా
ప్రెస్ పబ్లిసిటీ: కల్పన ఎంటర్ ప్రైజస్
ప్రొడక్షన్ కంట్రోలర్ కోటేశ్వరరావు
స్టూడియో: వాహిని
విడుదల
: ఆంధ్ర: రాయల
రాయలసీమ జయలక్ష్మి
తెలంగాణా ఉషా



తప్పక చూడండి!
శ్రీకాంత్ ప్రొడక్షన్స్
మనసంసారం
దర్శకత్వం: C.S.రావు B.A.,[Litt] నిర్మాతలు: S.L.సహా, వ.సౌందప్పన్
మాటలు: పినిసెట్టి
ఈస్ట్మన్ ఇండియా రిలీజ్
MOULI







తొలిమాట

జగపోయిన పొరపాటును దిద్దుకొనడానికి మరో పొరపాటు చేయడం తగునా? (38)

★

రచయితగా రాణించడానికి షార్టు కట్ (45)

★

ఇలు శుభ్రంగా వుండాలంటే ఒక చెత్త కాగితాల బుట్ట అవసరం. కొందరి జీవితాలు వేస్టు పేపర్ బ్యాస్కెట్ లాటివే. (49)

★

అటూ ఇటూ కాని మధ్యతరగతి సంసారాల స్థితిగతులపై ప్రముఖ యువ రచయిత శ్రీ సుభా కొత్త సీరియల్ 'రేపటి మనుష్యులు' (17)

★

ఉబుసుపోకకు కొన్ని విశేషాలు (3)

★

'ప్రతి జీవితం ప్రత్యేక జీవితం. ఒకరికి ఒకరికి సంబంధంలేదు. ఆశకు అంతులేదు. అంతానికి ఆశ కారణం. ఇది ప్రపంచం, ఇది జీవితం—' స్వర్గీయ తిలక్ రచన (59)



సచిత్ర మాసపత్రిక

మాచవరం

విజయవాడ-4

విడిప్రతి వెల

80 పైసలు

ఏడాది చందా

9.50 రూపాయలు

సంపుటి 6

జూలై 1968

సంచిక 7

మేనేజింగ్ ఎడిటర్

వి. వి. రాఘవయ్య

ముఖచిత్రం :
న్ వి ఆర్ ఫిలిమ్స్‌వారి "బాంధవ్యాలు"లో దృశ్యాలు

రాజకీయాలు

అధికార భాషకాదు, అయోమయ భాష

ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన పదేళ్ళకి తెలుగు అధికార భాష అయింది. అంటే ప్రభుత్వ వ్యవహారాలన్నీ తెలుగులో జరగాలని నిర్ణయం జరిగింది.

ఇంతవరకు శాసనాలు, ప్రభుత్వం ఉత్తర్వులు, న్యాయస్థాన వ్యవహారాలు అన్నీ ఇంగ్లీషులో జరుగుతున్నాయి. ఇంగ్లీషు రాష్ట్ర ప్రజల భాష కాదు. తెలుగే ప్రజలభాష. ప్రభుత్వంతో, పరిపాలనతో ప్రజలకి సన్నిహిత సంబంధం ఏర్పడాలంటే తెలుగులోనే పరిపాలనా వ్యవహారాలు జరగాలి

· ఇందుకు పూర్వాంగంగా ఇంగ్లీషులోవున్న చట్టాలు, ఉత్తర్వులు మొదలైనవన్నీ తెలుగులోకి రావాలి రాష్ట్రానికి, కేంద్రానికి సంబంధించిన శాసనాలు వందలాదిగా వున్నాయి. వీటిని అనువదించడం నెమ్మది నెమ్మదిగా జరగవలసిన పని. అయినా, జరగవలసిందే. ఇది ప్రభుత్వం చేయవలసిన పని.

చట్టాల అనువాదం చాలా కష్టంతో కూడినపని. కొన్ని వందల ఏళ్ళుగా అధికార కార్యకలాపాలకు తెలుగును ఉపయోగించడం లేదు. అది ఇంతవరకు సాహిత్య భాషగానే వుంది. పరిపాలనకు సంబంధించిన అనేక ఆంగ్ల పదాలకు సరైన మాటలు తెలుగులో దొరకవు. పాతమాటలనే కొత్త అర్థాలలో వాడుకోవాలి. వాడుకలో వున్న అన్య దేశ్యాలని కొనసాగించాలి. తప్పనిసరి అయినచోట్ల కొత్తమాటలను సృష్టించుకోవాలి.

ఈ బృహత్ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. న్యాయ శాఖలో ఒక అనువాద విభాగాన్ని నెలకొల్పింది. ఒక అనువాద సంఘాన్ని నియమించింది. ఈ సంఘంలో సభ్యులు కొన్ని కొన్ని

చట్టాలను తెలుగులోకి తీసుకు రావడం మొదలు పెట్టారు.

వారి అనువాదాల పద్ధతి చూస్తుంటే తెలుగును అధికార భాషగా చేయకపోయినా ఫరవా లేదు, తెలుగును అభివృద్ధి చేయక పోయినా ఫరవాలేదు, దాన్ని వున్న దాన్ని వున్నట్టు ప్రభుత్వం బ్రతక నిస్తేచాలు అనిపిస్తున్నది. ఈ విష యమై ఈ మధ్య రాష్ట్ర శాసన సభలో ప్రభుత్వం శ్వేత పత్రాన్ని ప్రకటించింది. తర్వాత పత్రికలలోను, ప్రజలలోను పెద్దగా గాలిదుమారం లేచింది. ఇంగ్లిషు మాటలకు అను వాద సంఘం సృష్టించిన తెలుగు మాటలు, హిందీనుంచి తీసుకువచ్చిన మాటలు ఘోరంగా వున్నాయని, అర్థంకావడం లేదని, వినడానికి, అన డానికి కూడా అసహ్యంగా వున్నా యని గగ్గోలు పుట్టింది.

అయినా, రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా అధికార భాషా వ్యవ హారాలను చూడడానికి నియమింప బడిన ఆరోగ్యశాఖా మంత్రి శ్రీ పి. వి. నరసింహారావు ఈ అనువాద ధోరణి చాలా శ్రేష్ఠంగా వుందని మురిసిపోతున్నారు. ఇంగ్లిషులో ప్రతిమాటకి భాషా, వ్యాకరణ సూత్రరీత్యా సరియైన మాటను సృష్టించగలిగామని వారు సంతృప్తి పడుతున్నారు. అంతేకాని, అది సామాన్య పాఠకుడికి అర్థం అవు తుందా లేదా అనేది చూడడంలేదు.

నిజానికి చాలా ఇంగ్లిషు మాటలు తెలుగు ప్రజల వాడుకద్వారా తెలుగు భాషలో కలిసిపోయాయి. వాటిని యథాతథంగా అంగీకరించ కుండా కొత్త మాటలని సృష్టించ డానికి ప్రభుత్వం యత్నించడం చాలా తెలివితక్కువగా కనిపిస్తుంది. దీనివల్ల అతిసులభ శబ్దాలకూడా కఠినమైన అనువాదాలు వచ్చాయి. ఉదాహరణకు ల్యాండ్ రెవిన్యూ అనే మాటకు వాడుకలో వున్న 'భూమిశిస్తు'ను ప్రభుత్వ అను వాద సంఘం 'భూరాజస్వం' అని కల్పించింది.

అదనపు భూమిశిస్తు చట్టంక్రింద రైతుల కివ్వబడిన నోటీసు అను వాదాన్ని ఆ మధ్య దినపత్రికలు ప్రకటించాయి. దాన్ని చదివిన రైతులమాట అటుంచి తెలుగు, సంస్కృతాలలో ఎంత విద్యాధికు డైనా సరియైనవిధంగా అర్థంచేసుకో లేడు. దాని నిండా కృతక సమా సాలు, కృత్రిమ పదాలే.

ఇదే విధంగా గ్రామ పంచాయి తీల చట్టం, మోటారుబండ్ల చట్టం మొదలైన వాటిని ప్రయోగాత్మ కంగా అనువాద సంఘం అనువదిం చింది. ఇవన్నీ ఎంత చదువుకున్న వాడినైనా అయోమయంలో పడ వేసేటట్లున్నాయి.

ప్రభుత్వం మరొక వింత అభి ప్రాయాన్ని కూడా వెల్లడిస్తున్నది. చట్టాలు మొదలైనవి సామాన్య ప్రజలకు అర్థం కానక్కరలేదట. న్యాయవాదులకు, న్యాయవేత్తలకు అర్థమైతే చాలునట. చట్టాలు వారి కోసమే అయితే, వాటిని తెలుగు లోకి అనువదించడం దేనికి? ఇంగ్లి షులోనే వుంచవచ్చుకదా? అలా కాక ప్రజాబాహుళ్యంకోసం ఉద్దే శించి నట్టయితే సుబోధకమైన భాష వుండక్కరలేదా?

శ్వేతపత్రంలో ఇంకో విచిత్రాభి ప్రాయాన్ని ప్రభుత్వం వ్యక్తంచేసింది. ఒక ఇంగ్లిషు చట్టం అనువాదాన్ని ఇంగ్లిషు, తెలుగు రెండూ తెలిసిన వాడు, తెలుగు మాత్రమే చదువు కున్నవాడు చదివితే మొదటి వాడికి అది అర్థంకాదట. రెండవ వాడికి బాగా అర్థం అవుతుందట. ఇంగ్లిషు తెలిసినవాడు ఇంగ్లిషు పాఠానికి అనుగుణంగా తన అవ గాహనా శక్తిని మలచుకొని వుంటా డట. అందుచేత అతనికి తెలుగులో ఏ పదం ఏ ఇంగ్లిషు పదానికి అను వాదమో స్ఫురించదట. కాని, తెలుగు మాత్రమే తెలిసినవాడికి చటుక్కున ఆ అనువాదం అర్థమై పోతుందట.

ఏ ప్రమాణాన్ని బట్టి మంత్రి శ్రీ పి. వి. నరసింహారావుగారు ఈ నిర్ధారణకు వచ్చారో తెలియదు. బాగా వాడుకలో వున్న కొన్ని ఇంగ్లిషుమాటలకు అనువాద సంఘం కొన్ని తెలుగు పదాలను నిర్ణయిం చింది. కారును శకటం అని, [illegible] బండి అని అది అనువదించింది. తెలుగు మాత్రమే తెలిసిన వాడి దగ్గరికి వెళ్ళి "నువ్వు శకటంమీద వచ్చావా? బండిమీద వచ్చావా?" అని అడిగితే వాడు మనకి మతి పోయిందనుకుంటాడు. మతిపో యింది మనకు కాదు, ఇలాంటి అను వాదాలను మనమీద రుద్దడానికి యత్నిస్తున్నవారికి.

శాసనసభ చేసే 'యాక్ట్'లను మనం చట్టాలని, శాసనాలని వ్యవహరిస్తున్నాము. ఈ రెండు మాటలను ప్రభుత్వానువాదకులు తిరస్కరించి "అధినియమము" అనే మాటను సృష్టించారు. ఈ విధంగా చేయడంవల్ల యాక్ట్ అనే మాట నుంచి వచ్చే పదరూపాలన్నిటిని — అంటే ఎనాక్ట్, ఎనాక్టెడ్, ఎనాక్ట్ మెంట్ మొదలైన వాటన్నిటిని తెలుగు చేయడం (అధినియమించు, అధినియమితము, అధినియమితి) సులభమట. అనువాదకుల పని దీని వల్ల సులభం కావచ్చుగాని అర్థం చేసుకోవలసినవారి పని మాత్రం కష్టమవుతుంది.

ఇంగ్లిషు మాటలన్నిటిని ఈ సూత్రాన్ని అనుసరించి తెలుగు చేయడానికి పూనుకోవడంవల్లనే అనువాద సంఘంనుంచి ఎవరికీ అర్థంకాని భాష వస్తోంది. ఈ భాషను అతికట్టాలి దాన్ని సామాన్య ప్రజలు ఎలాగూ ఉపయోగించరు. వారు తిరస్కరిస్తారు. తాము వాడే మాటలు తామువాడుతూ వుంటారు. దీనివల్ల అధికార భాషకు, ప్రజల భాషకు పెద్ద అగాధం ఏర్పడుతుంది. ఇంగ్లిషులో కూడా లెజిస్లేటివ్, లీగల్, అడ్మినిస్ట్రేటివ్ పరిభాషలకు, మామూలు భాషకు కొంత వ్యత్యాసం వున్నా, ఇంతగా లేదు. దీనికి కారణం వాడుకలోనుంచే వారు ఎక్కువగా పరిభాషను సృష్టించుకున్నారు. అత్యవసరమైన చోట్లనే వారు కొత్త మాటలను కల్పించుకున్నారు. ఉదాహరణకు 'యాక్టు' అనేది చాలా సామాన్యమైనది. దానికి సందర్భాన్నిబట్టి అనేక అర్థాలు వస్తాయి. శాసనసభ చేసే చట్టాన్ని వారు యాక్టు అంటారు. నాటకంలో అంకాన్ని యాక్టు అంటారు. నటించడాన్ని యాక్టు అంటారు. ఒక పనిని, చర్యను యాక్టు అంటారు. రోమన్ కాథలిక్ చర్చిలో ఒక ప్రార్థనను యాక్టు అంటారు.

మన అనువాద సంఘంమాత్రం తెలుగునుంచే కావలసిన మాటలను తీసుకోవడానికి బదులు, ఇంగ్లిషులో వున్న ప్రతిమాటకు కొత్తమాటను సృష్టించాలనే తప్పుడు సూత్రాన్ని అవలంబించి ఈ అయోమయ భాషను సృష్టిస్తోంది దాన్ని ప్రజలు తిరస్కరించక మానరు.

□□□

— కొత్త సీరియల్ —



రేపటి మనుష్యులు

శ్రీసుధా

పరిచయస్థుల్ని అంత దూరంలో చూసి నవ్వుతూ వచ్చి కౌగలించుకోబోతున్న మనిషిలా ఉత్సాహంగా వస్తోంది రైలు. ఆధారం కోసం వెదుకుతూ, పడిపోతామేమో అనే భయంతో, భావనతో అందర్నీ కంటివాతమంచి చూడ్డం జరుగుతుంది. సభ్యత తలపే లేకుండా పళ్ళు తగుల్చుకుంటూ ఖాళీమర చెంబుల్నీ, హోల్డాల్ పట్టాల్నీ వెదుక్కోవడం. కళ్ళముందు అప్పర్ బెర్తుమీద పంచీ కోసం లేచిన బంగారు మిరియం గాజుల చెయ్యి... భుజంనుంచి తెర చాపలా పడిపోతున్న పమిటనుంచి తప్పిస్తున్న గుండెలరూపం. మెడ చుట్టూ తిప్పుతున్న రిబ్బన్‌లేని జడ. ముక్కుపొడుం వాసన. సెంటు గుభాళింపు. అవగాహనకాని కేకలు. అదీ తిరునాళ్ళలో మాదిరి. ఆత్మీయతతో పరిగిపోవడం. ఆత్రుతకూడిన కుస్తీ.

చుట్టూ జనాన్ని పరీక్షగా చూస్తున్నాడు శేషు. రైళ్ళలో ప్రయాణం చేసే జనానికీ, పూర్వపు సమష్టి కుటుంబాలకీ పెద్దతేడా లేదేమో అన్పించింది. రైలు పిఠాపురం స్టేషనులో ఆగడంతో శేషు దిగాడు. అతను దిగీ దిగడంతోనే

'ఏరా సెలవులన్నీ విశాఖపట్నంలోనే హరించేశావు' అంటూ శేషు చేతులు పుచ్చుకున్నారు స్నేహితులు గోవిందరావు, చలపతి.

'ఏంచేయను, బాబయ్య రానివ్వలేదు. అది సరేగాని వూళ్ళో విశేషాలేమిటి?'

'ఓరేయ్ శేషూ, నువ్వెళ్ళిన తర్వాత జరిగిన మార్పుల్లో ముఖ్యమైనది, మా చెల్లాయికి పెళ్ళి కుదరడం, రెండు, ముకుందరావుగారు కొత్తనాటకం షేకప్ చేశారు. ఆఖరిది కాకినాడలో రాజశేఖరంగారు పీకోసం ఒకటే వలపరిస్తున్నారుట...'

"వూహూ" అని ఆ పైన అన్నాడు శేషు...

"నేను సాయంకాలానికే కాకినాడ వెడదామనుకుంటున్నాను. మరి మీరు రారా?"

"మేమూ వస్తాం. వెళ్ళేటప్పుడు కొంచెం కనపడి పో" అన్నాడు గోవిందరావు.

"వస్తాన్రా" అని శేషు యింటివైపు నడవడం మొదలుపెట్టాడు. పదిగజాలు వెళ్ళేలోపునే అతని నడక వేగం తగ్గి ఆలోచనల వేగం హెచ్చింది.

వారంనాడు తండ్రి వెళ్ళమంటే అతను విశాఖపట్నం వెళ్ళాడు. వెళ్ళినవెంటనే జగన్నాథం బాబయ్యను కలుసుకున్నాడు. వారం రోజులు వాళ్ళింటిదగ్గరే వున్నాడు. తను వచ్చిన కారణం 'ఇదీ' అని చెప్పడానికి రెండు రోజులవరకూ వీలు చిక్కలేదు. ఓ మధ్యాహ్నం అంతా చెప్పేశాడు.

ఆయన 'చూద్దాం' అనడంతో తిరిగి ఆ ప్రస్తావన ఎలా తీసుకురావాలో తెలిసిందికాదు. బాబయ్యకు ఒకటికి పదిసార్లు జ్ఞాపకంచేస్తే ఆయనజ్ఞాపకశక్తిని పరీక్షించినట్టుగా వుంటుందని వూరుకునేవాడు. ఆయన కూడా ఎప్పుడూ పరధ్యాన్నంగానే ప్రవర్తిస్తూ కన్పించేవాడు. మరీ తీరికమూలంగా వచ్చిన మార్పేమో అది. కానీ తన మనసులో యింటిని గురించి ఆత్రుత రెట్టింపు అయితే ఆయన మసిలేచోటు తిరిగేవాడు.

మొహమాటస్తులు ప్రయత్నించి శక్తికొద్దీ నోరు కట్టేసుకున్నా, ఇంద్రియాల ప్రేరణమాత్రం ఆగదు. అందుకే తను ఇలా ప్రవర్తించి వుంటానని శేషుకూ తెలియదు.

అటు జగన్నాథంగారు, శేషు వక్కనున్నా, వుద్దేశాన్ని తెలుసున్నట్టుగా కాగితాలు చూసుకుంటూ, చదువుకుంటూ వుండిపోయేవాడు. మరీ దగ్గరగా వస్తున్నాడనిపించినప్పుడు... "యేం తోచడంలేదా, ఫలానా పుస్తకం మనింట్లో వుంది. చదివావా" అనీ

తను చదవలేదంటే "బావుంటుంది, చదువు, మంచి కాలక్షేపం" అంటూ సంభాషణల్నీ, మనిషినీ కూడా దూరంగా నెట్టేసేవాడు...

ఇది కావాలని ఆయన చేస్తున్న పనో లేక ఆయన నైజమో శేషుకి అంతుపట్టలేదు.

నిజానికి తను వచ్చిన పని బాబయ్యకన్నా ముందు పిన్నితో చెప్పాడు... అంతా విని...

"బాబయ్యతో నే చెప్తాలేరా" అంది.

భర్తతో చెప్పిందీ లేనిదీ తను తిరుగు ప్రయాణం పెట్టుకున్న రోజు కూడా చెప్పలేదు.

శేషు అల్లుకుంటున్న ఆలోచనల నుంచి తప్పుకుంటూ తనలో తనుగా అనుకున్నాడు...

"నే వెళ్ళినపని పూర్తికాకపోవడానికి కొంతలోపం నాదీవుందేమో" నని.

"అవును... అవసరం మనదయి



నప్పుడు నాలుగుసార్లు హెచ్చరించాలి... పదిసార్లు ప్రార్థించాలి. ఏమిటో నా ఆలోచనలకూ చేతలకూ ఎప్పుడూ పొత్తు కుదరకుండానే పోతోంది" అనుకుంటూ గుమ్మాలు ఎక్కాడు శేషు.

అతను లోపలికి వెళ్ళేసరికి వాకిట్లో తండ్రి భుజంగరావుగారు కన్పించాడు—భాగవతం చదువుకుంటూ... జోళ్ళ చప్పుడువిని—

"ఇదేనేమిటిరా, రావడం" అన్నాడు

"అవును..."

"అంతా కులాసాగా వున్నారా? అక్కడ!"

"ఆ"

ఆయన మరేదో అడగాలనుకునే లోపునే లోపలినుంచి "నాన్నా, కాఫీ తీసుకోండి" అంటూ రెండోకూతురు తులసి రావడంతో భుజంగరావుగారు ఏం మాట్లాడకుండా కాఫీగ్లాసు అందుకున్నాడు. శేషు లోపలికి వెళ్ళాడు.

కాఫీతాగి ఖాళీగ్లాసు తులసికి తిరిగి యిచ్చేస్తూ—

"శేషుకి కాలేజీ రేపు తెరుస్తారేమిటి" ప్రశ్నించాడు

"అవును" అని తులసి టేబిల్ మీద వ్రాస్తూ నెమ్మదిగా అడిగింది.

'నాన్నా నేను ఉద్యోగం చేయద్దా?' అని.

ఇంతకుముందే తులసి ఆ మాటల్ని చెవినేసినప్పుడు పెద్దగా పట్టించుకోలేదు భుజంగరావుగారు. కానీ యీ రోజు కూతురు అడుగుతున్న ధోరణివెనక కారణాన్ని వెదకాలనిపించలేదు. కొంతవరకూ తనకూ అర్థమవుతోంది—చుట్టూతా చూసుకుంటే.

'ఫ్యాక్టరీలో ఖాళీలు వున్నాయట. కావేరి కూడా అప్లయి చేస్తోంది'

'అంతకంటే మీ యిద్దరికీ పనేముంది కనక' అంది వాకిట్లోకి వస్తూనే తండ్రీ కూతుళ్ళ మాటలు విన్న లలితమ్మగారు.

'ఏదో అడిగితే దానిమీద విరుచుకుపడతావు దేనికి?'

'ఎందుకు విరుచుకుపడ్డం... కొండలు విరిగి మీద కూలుతున్నా ఏం పట్టనట్టు వుండడం నాకు చేతకాదు. మీకే చెల్లింది...'

తులసి తన ప్రమేయం లేదన్నట్టుగా లోపలికి వెళ్ళిపోయింది.

'శేషు వెళ్ళినపని యేమయిందిట' అని తండ్రి వేసిన ప్రశ్నవిని తలుపువెనకే ఆగిపోయింది తులసి. శేషు విశాఖపట్నం ఎందుకువెళ్ళిందీ దాని పూర్వాపరాలతో తనకున్న సంబంధం తెలుసుకాబట్టి ఆమె ఆత్రుతగా వినసాగింది.

'అయినా వాణ్ని పంపించడం, మిమ్మల్ని చెప్పుకోవాలి. అంతకంటే గంగిరెద్దు మెడలో వుత్తరంవ్రాసి పంపితే ఇంతకన్నా మంచి జవాబొచ్చేది' అంది లలితమ్మగారు

కొడుకు చెప్పిన అక్కడి సంగతులన్నీ విప్పి చెబుతూ, చిరాకుపడిపోతూను.

తులసి భారంగా నిట్టూర్చి తన గదిలోకి వెళ్ళిపోయింది.

'ఊరుకో వాడికి విన్పిస్తుంది'

అంతవరకూ ఎవరిమీదో తెలియని ఆవేశంతో అరిచిన లలితమ్మగారు టక్కున చల్లారిపోయింది. ఆవిడ స్వభావమే అంత. ఏ రకమయిన తాకిడికీ తట్టుకోలేదు.

శేషు అనుకునేటట్టు ఆవిడ ఆవేశపరురాలు కాదు ... తులసి అప్పుడప్పుడు అనుకునే వెర్రితనం ఆవిడలో లేదు. భావన అనేది ఆవిడ మనస్తత్వంమీద యాసిడిటీ టెస్ట్‌లో రంగులు మారే లిట్మస్ పేపర్‌లా పని చేస్తుంది.

ఎవరైనా మంచిచేస్తే వాళ్ళు కన్పించినా కన్పించకపోయినా 'మా తల్లే, మా తండ్రే, నువ్వెంత మంచివాడివి కాకపోతే యిలా చేస్తావు. ఒకళ్ళకు చేయాలని నీకు రాసిపెట్టి వుందేమిటి? భగవంతుణ్ణి చంపి పుట్టావు' అంటుంది.

తత్ వ్యతిరేకంగా జరిగితే,

'మనుష్యులు కారా? పైగా చుట్టాలాయే. అంత పరాయి వాళ్ళలా మాట్లాడారా?' అంటూ రోజులుగా వాపోతుంది. పైపై పొగడ్తలతో ఎదటి వాళ్ళను వుబ్బెయ్యడం గానీ, చీదరించుకున్నా, అందులో న్యూనతదృష్టిగానీ వుండదు.

దూరదృష్టి వున్నవారికి లలితమ్మగారు "మంచి మనిషి", అనుకోబుద్ధి వేస్తే, అందుకు వ్యతిరేకస్తులు అమాయకురాలని పిలుస్తారు.

అటువంటి లలితమ్మగారితో భర్తగా భుజంగరావుగారికి ముప్పై యేళ్ళ అనుభవం వుంది. ముగ్గురు బిడ్డలకు బాధ్యులయిన తల్లిదండ్రుల సంబంధం వుంది ఇద్దరికీ.

వయసులో, రక్తపు వేగంలో తను చేసిన పొరబాట్లకూ, మంచికీ కూడా ఒకే విధంగా ప్రతిధ్వనించే ప్రతిఫలించే ఆమెగారి నైజంలో ఆయన, రోగిష్టివాడి శరీరంలో మందులా మసిలేవాడు ప్రవర్తించేవాడు. ఎప్పుడు ఎంతవరకూ ప్రశ్నించాలో, ఎంతటితో ఆవిడ మాటలకు పులిస్టాపులూ, కామాలూ యివ్వాలో నేర్చుకున్నాడాయన.

కానీ ఆయన తన నిజ దృష్టిలో, ఆచరణలో లలితమ్మగారిని అమాయకురాలిగానే లెక్క కట్టాడు. మరింత వెర్రిదాన్నిచేసి ఆడించనూ ఆడించాడు.

వయసులో వున్నప్పుడు భుజంగరావుగారికి కొంత మాటపట్టింపు, తన మగతనం పట్ల అధికృత, వాటి మీద ప్రేమా వుండేవి. అలావున్న ప్రతివారూ చెరువులో చేపల్లా, పుట్టల్లో పాముల్లా ప్రవర్తించలేరు. ఏ మాత్రం తెలివి తేటలు లేకపోయినా ఎవరికో ఒకరికి చిక్కి 'ఫలానా ఆయన ఈ చెడుని ప్రేమిస్తాడు. భార్యమాట ఎప్పుడూ ఎద్దేవా చేస్తూ ఆవిడ వెనకనిల్చుకట్టుకుని పోరినా పట్టించుకోడు' అనుకునేటట్టుగా బయట పడిపోతాడు.

ఐదెకరాల భూస్వామిగా ఆయన వుద్యోగంలో చేరాడు. ముగ్గురి బిడ్డలకు తండ్రి అయ్యాడు. ఓ కూతురి పెళ్ళిచేశాడు. అయిన వాళ్ళనీ, కాని వాళ్ళనీ, ఆఖరికి వారాలు చేసుకునే వాళ్ళనీ కూడా ఏం అనేవాడు కాదు. ఆ కాపోతే అన్నగారి కొడుకులు, పిన్నత్తగారి తమ్ముళ్ళు ఇంట్లోవుండి చదువుకుంటూంటే కన్నబిడ్డల్లాగే చూశాడు.

ఆదరించిన మనుష్యుల్ని, మనస్ఫూర్తిగా ప్రేమించే దుర్గుణం ఒకటి ఆయనలో వుంది. వాళ్ళు 'హానికరం' అని ఎవరైనా చెవి కొరికినా నమ్మేవాడు కాదు. పైగా చెప్పే వాళ్ళని అసహ్యంగా చూసేవాడు. ఈ రకమైన మనస్తత్వం లలితమ్మగారికిగాని, ఆవిడ పుట్టింటి వాళ్ళకుగానీ కిట్టేదికాదు.

'వద్దు, మనం పట్నం వెళ్ళద్దు. ఆ వుద్యోగం వద్దు' అంది ఆ రోజుల్లోనే లలిత.

'నీ తెలివి తెల్లవారినట్టే వుంది. తిని కూర్చుంటే కొండలు, హారతి కర్పూరపు వుండలవుతాయి. మనం ఎప్పుడూ ఇద్దరంగానే వుంటాం అనుకోకు. ఈ వెధవ వూళ్ళో పాలడబ్బా దొరక్క, సమయానికి మంత్రసానిలేకా ఇబ్బంది పడతానంటావో, పదు' అన్నాడు.

ఇలా భార్యకి మాతృ హృదయంలో ఆరాటాన్ని మూడో మాసంలోనే ప్రతిబింబింప చేసి మెత్తపరిచాడు.

'ఇల్లు కట్టుకుంటే అద్దె కలిసొస్తుంది రేపు రిటైరయ్యాక తెలుస్తుంది. మనింట్లో గంజి తాగినా ప్రజలకు తెలియదు. నీకూ పిల్లలకూ ఈ నౌకరీ నుంచి ఏం మిగులుస్తానో నాకే తెలియదు' అన్నాడు ఓరోజు పట్నం మకాం మారుస్తూ వ్యవసాయం మాని వుద్యోగం చేయాలనే అభిలాష తీరి, గృహస్థు కోరిక తీరక.

లలిత తన్ను అద్దం చూసుకుంటే భర్త మాటల్లో మమత కళ్ళల్లో తేలి కన్పించేవి. కళ్ళు చెమ్మగిల్లేవి. ఆ చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకునేలోపునే, పిఠాపురంలో ఇల్లు కట్టడం పూర్తి అయి, ఆ పూర్తి అవడం వెనక పిత్రార్జితమైన భూమిని భర్త అమ్ముతూంటే, తిరిగి చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకోవాలని మర్చిపోయింది, ఆవిడ. మిగిలిన ఎకరం కూడా అరుంధతి పెళ్ళికి తండ్రిగా అమ్ముతానని ముందుకు వెడుతున్న భర్తని ఎలా కాదనాలో తెలిసింది కాదు. భర్త హెడ్‌మాస్టర్‌గిరీ, సంపాదనా ముగ్గురు పిల్లలతో సంసారం, పదేళ్ళలో శుభకార్యాల నిమిత్తం ఇంటిమీద తెచ్చిన అప్పుల మొత్తం తల్చుకుని ఆవిడ విచలితే అయ్యేది. ఒంటిగా తర్కించుకుని యేడ్చేది. భర్త వెనకేయ్యడం లేదనీ - అలా అనుకోడానికి నోరుకట్టుకోవాల్సి వచ్చేది. తులసిని చదివించారు. శేషు చదువుకుంటున్నాడు. రిటైర్ అయిన తర్వాత రాబడి తగ్గిపోయింది. అన్నిటికీ ఇంటిమీద అప్పే ఆధారమవుతోంది. పైగా భర్తలో ఏమీ పట్టించుకోని నైజం. ఆయన అలవాట్లు బాధ కల్గించి ఒక్కొక్కసారి అనేది.

'మీరు రోజూ క్లబ్‌కు వెళ్ళి పేకాటలో డబ్బు పాడుచేస్తున్నారుట. ఇంట్లో నేనేమో, కాణీ, కాణీ అదా చెయ్యడం — మీరేమో ఈవిధం. ఇన్నేళ్ళు వచ్చిన తర్వాత కూడా పాడు అలవాట్లు మానుకోకపోతే'...

భుజంగరావు గుంభనగా నవ్వి అనేవాడు.

'చూడు లలితా. ఏదో ఓ వయసులో చేసే పనులతో మనుష్యుల ప్రవర్తన ఏనాడూ ముడివేసుకుని వుండదు. పదేళ్ళప్పుడు అమ్మకొంగు; పదిహేనేళ్ళకు పుస్తకాల పురుగు. ఇరవై యేళ్ళముందు ఆడపిల్లలు అందించిన మధుర భావనల రంగు. చదువుపట్ల గాలిపటాల హోరంగు. ముప్ఫై ఏళ్ళలో సంపాదన, వివాహం, పిల్లలూ, ఇవన్నీ ఇంద్రధనుస్సుల రంగులు. తరువాత వయసులో అందుకోబోయే నిద్రపట్టుని జీవితానికి మధ్య అందివచ్చే విశ్రాంతి ఓ విధంగా ఈ విశ్రాంతి అంటే జావకారిన వుద్దేశాల్ని నమ్మలేకా, నిభాయించుకోలేకా ఇలా ముచ్చటలు ఖర్చు చేసుకోవడం. అందుకే చూడు, నలభైఏళ్ళపైబడ్డవాడికి మరో

స్వీట్ హోమ్ క్లబ్ అవుతుంది అంతకుమించి ఏం చేయలేడు కాబట్టి, చేసేశక్తి వుండదు కనుక. జీవితంలో రసికత్వం చావలేదని తన్ను తాను సెల్ఫ్ డిసీవ్ చేసుకోవడం కోసం వార్ధక్యంలో మనుషులిలా ప్రవర్తిస్తారు. ఇక పేకాట అంటావు. కాలక్షేపం కోసం అంతే. ఇన్ని రోజులుగా నీ కొంగు రంగులు తప్ప ఎరగని నాకు ఈ రోజు వేరే వెర్రెందుకు పుడుతుంది? ఈ వయసులో నన్ను అనుమానిస్తున్నావంటే నీకే నష్టం నలుగురూ నిన్నాడిపోసుకుంటారు నీ గుండెలమీద చేయిచేసుకుని చెప్పు, 'భుజంగరావు, నీతి చంపుకున్న మనిషా?' - అంతే లలితమ్మగారికి భర్తలో దైవం కన్పించేవాడు.

భుజంగరావుగారు అలా మెట్లవారిగా భార్య మనస్తత్వాన్ని తనకు అనువుగా లొంగదీసుకుని కళ్ళేలు తొడిగాడు. అలాగని భుజంగరావులో వినాశకరమైన చెడు అలవాట్లు లేవు. ఉన్నది దూబరాఖర్చు. ఆయన అనే కాలక్షేపంకోసం అలవాటు చేసుకున్న రమ్మీ మాత్రం ప్రాణాంతకం అయికూర్చుంది.

నిజానికి ఆయన ఏరోజూ ఎక్కువగా ఖర్చుచేయడంలేదు. చదువుకునే కొడుకు, ఆ ఏడాదే చదువు మానేసిన రెండో కూతురు, తులసికి పెళ్ళిచేయాలన్న ఆలోచన్లు, ఇవ్వవల్సినకట్నం, దానికి కన్పించని మార్గాలు, అన్నీ ఆలోచనల్లోకి

> భర్త: 'నువ్వు వట్టి తెలివితక్కువ దద్దమ్మలా మాట్లాడుతున్నావ్.'
>
> భార్య: 'ఏం చెయ్యను? అలా మాట్లాడితేగాని మీకు అర్థంకాదు మరి!'

వస్తాయి. ఏది ముందు, ఏది వెనకో తేల్చుకోలేకపోతూంటే గతంలో పొరబాట్లు వెక్కిరించేవి ముందుకు వచ్చి - అప్పుడే అనుకునేవాడు. ఇప్పుడు అనుకుంటున్నాడు కూడా. 'ఆ రోజుల్లో లలితమాట విన్నాను కాదని' కొంచెంచిరాకు కల్గినప్పుడు 'దానిమాట వినకపోవడానికి కొంత దాని మెతకతనమే కారణం' అని కూడా అన్పిస్తూ వుండేది.

ప్రతి మనిషిని గర్వం, అతిశయం, అన్నవి లొంగదీసుకుని కొన్ని అనవసరపు పనులు చేయిస్తూ వుంటాయి. వయసు మీరిన తర్వాత, గర్వం తలొంచినప్పుడు, వివేకం తలెత్తినా స్వగతానికి ఒట్టి ఓదార్పే మిగులుతుంది సహజంగా.

◆ ◆

క్లబ్‌కు వెడుతూంటే దారిపొడుగునా ఆయన్ని సంసారం గురించిన ఆలోచన్లేతికమక చేస్తున్నాయి జీవితం పట్ల తన దృక్పథం, అలవాట్లో మంచితనం మరొకప్పుడు గర్వ కారణం అయినా, ఈ రోజు, వెనక కాలుజారిన గుర్తులు, దాన్ని అసరా

చేసుకుని భవిష్యత్ కంటక ప్రాయ మవుతుందేమోననే అనుమానం కలిగిస్తోంది

శేషుని తోడల్లుడు, జగన్నాథం దగ్గరకు పుత్తరం ఇచ్చి పంపించాడు. 'శీలుచూసుకుని ఏదో విధంగా అబ్బాయిద్వారా వెయ్యిరూపాయలు పంపాల్సింది. ప్రోనోటు కూడా వ్రాసి పంపుతున్నాను. ఇప్పటికే ఇంటిమీద అప్పు తల మునకలుగా వుంది. అది అమ్మితే వచ్చేది చిన్న మొత్తం అయినా మీ వదినకు ఇల్లు అమ్మడం యిష్టంలేదు. తులసి పెళ్ళి ఇప్పటికే ఆలస్యం చేశానని అపవాదు భరిస్తున్నాను తండ్రిగా నా బాధ్యత మర్చిపోలేదని నేను అనుకున్నా, కొన్నిరోజులు పోయే సరికి ఎవరూ నా మాట నమ్మరు. ఈ సంబంధం అన్నివిధాల బాగుంది. డబ్బుకుదిరితే శ్రావణంలో తులసిని ఓ ఇంటిదాన్ని చేసెయ్యాలని.'

కానీ శేషు తిరిగివచ్చి అక్కడి సంగతులన్నీ చెప్పి అన్నాడు.

'నాకేం నమ్మకం లేదు నాన్నా, బాబయ్య సహాయం చేస్తాడని.'

'మళ్ళీ కదపలేక పోయావురా. మన అవసరమా, వాళ్ళదా, అతనసలే పరధ్యాన్నపు మనిషి' అంది లలితమ్మగారు.

'జగన్నాథం బాబయ్యకు పరధ్యాన్నం యేమీ లేదమ్మా, నేనెందుకు వచ్చానో మర్చిపోయేటంత రద్దీవన్లూ ఆయనకు లేవు. రోజూ కళ్ళముందు ఓ కొత్తమనిషి తిరుగుతూవుంటే ఎవరికైనా గుర్తుకొస్తుంది....'

'ఒకవేళ ఇష్టంలేకపోతే చెప్పచ్చుగా' అన్నాడు భుజంగరావు.

'పోనీ మరోసారి వెళ్ళిరాకూడదూ' అంది లలితమ్మ.

తను వెళ్ళడంలో తప్పేంలేదు. వెళ్ళచ్చుకానీఆమనిషిపోకడఏమిటో తెలియకుండా వెళ్ళి ప్రయోజనం? అసలు, లలిత మూలంగానే తను జగన్నాథాన్ని డబ్బుకోసం కదిపింది. ఏ సమాధానం యివ్వకుండా మెత్తని కత్తిలా ప్రవర్తిస్తే? తిరిగి వెళ్ళి అభాసుపాలవడం అవుతుందేమో – అని వూరుకున్నాడు.

'రండి భుజంగరావుగారూ, ఈ రోజు ఆలస్యంచేశారేమిటి' అన్నాడు క్లబ్ బయటే కుర్చీ వేయించుకుని కూర్చున్న డాక్టరు సుబ్బారావుగారు.

'రండి మేష్టారూ – ఈ రోజు స్టేకెంత పెడదాం చెప్పండి' అన్నాడు తహసిల్దారు.

'రోజులాగే కొత్తేముంది' అన్నాడు షో చూపిస్తూ గురునాథం.

'నేను త్రీ రౌండ్సకన్నా ఆడలేను– మరి' అన్నాడు భుజంగరావు.

'భా భా ఇవాళ హేండ్ బాగా లేదండీ. త్రీ జోకర్స్ డెల్టా. లేకపోతే వితవుట్ జోకర్ మీరు షో చెయ్యడమేమిటి అన్నాడు భగవాన్లు.

'నా హేండ్ మరీ బేడ్. టూ



జోకర్స్‌తో ఆల్ కౌంట్ అయ్యింది, పేక. నేను బయలు దేరేటప్పుడు మా పక్కింటి నీరజమ్మగారుతుమ్మింది అప్పుడే అనుకున్నాను' అన్నాడు శ్రీరాం నవ్వుతూ.

భుజంగరావుగారు పేపరు తీసుకుని లోపలి హాల్లోకి వెళ్ళాడు. అక్కడే కుర్చీలో కూర్చుని సిగరెట్ కాలుస్తూ దీర్ఘంగా ఆలోచిస్తున్న ప్లీడరు దక్షిణామూర్తి కన్పించాడు. పలకరించే లోపునే – ఆయనచూసి.

'రండి మేష్టారూ, అలా నిలబడ్డారేమిటి, యీవాళ ప్లే లేదా'

'మనసేం బాగా లేదు'

దక్షిణామూర్తి వొకానొకప్పుడు కాకినాడలో పేరుమోసిన ప్లీడరు. చెయ్యగల్గినన్ని రోజులు ప్రాక్టీసు చేసి, రెండుచేతులా గడించగల దారుఢ్యంవుండికూడా, అక్కడినుంచి వచ్చేసి – నాలుగు సంవత్సరాలుగా పిఠాపురంలోనే వుంటున్నాడు. భుజంగరావుగారికి జవాబుగా అన్నాడు.

'యాభయ్యోపడి, జీవిక – వేసవిలో చలివేంద్రంలాంటి దంటారు. అలాంటిది మనకు వయసుతోపాటే కష్టాలు పాకాన పడుతున్నాయి. మా ఆవిడసంగతి మీకు తెల్సిందే

కదా. శ్యామల సరేసరి. ఎటొచ్చి కావేరీ, నేనే దురదృష్టవంతులం."

"మీరు తిరిగి కాకినాడలో ప్రాక్టీసు చెయ్యగల్గితే బాగుండేది" అన్నాడు-ఆయన సంసారాన్ని గుర్తు చేసుకుని. తనకైశ్వర్యం, డబ్బు, డబ్బులేమి వొక్కటే మానసిక సంక్షోభానికి కారణం అని తను ఎన్నోసార్లు అనుకున్నా— దక్షిణామూర్తిగారినీ ఆయన జీవితాన్నీ చూడగానే ఆ వూహ చటుక్కున నేల కరుచుకుంటుంది.

డబ్బున్న యెంతోమంది ధనవంతులు, రోడ్డుపక్క పాకల్లోకి అమితాశ్చర్యంగా ఆనందంగా చూడ్డం తనకి తెలుసు. దక్షిణామూర్తిగారే వోసారి అన్నాడు...

"భుజంగరావుగారూ-ఆ పాకలో ఆ ముసలాడిపక్కన కూర్చుని ఎండు రొయ్యల పులుసును తాగాలనిపిస్తుందండీ. మంచిబట్టలేసుకుని వెడుతూంటే, చింపిరిజుట్టుతో చిన్నారి కళ్ళతో వున్న ముష్టిపిల్లను యెత్తుకుని ముద్దాడగల్గితే? ఈ పరువూ మర్యాదా అనే బుర్ఖాలు కొంచెం వదులుచేసుకున్నప్పుడే బ్రతుకులో శాంతీ, విశ్రాంతీ లభిస్తాయేమో!!

"అలా మనం ప్రవర్తించలేం. ప్రవర్తించాలనుకుని, అందుకు గట్టిగా ప్రయత్నించాలేం. మనిషి బ్రతుకు మొత్తంలో - బయటకు కన్పించేదానికి రెట్టింపు లోలోపలే మిగిలిపోయి మాసిపోతుంది."

తనెవరితో చెప్పుకోలేక పోతున్నాడుగానీ, తన కోరికలూ సరిగ్గా అలాంటివే. ఇన్ని బంధాలమధ్య సుఖపడలేకపోతున్నామని రోజూ రుజువు అయిపోతున్నా మమకారం మనిషికి సంకెళ్ళు వేస్తుంది. సంఘం కళ్ళతో బెదిరించి, జీవితం అనే ఖైదులో బంధించడానికి వెనక్కి నశిపి చుకుపోతుంది. తన సంసారం చూసుకుంటే ఈ రోజు తనకి భయం. పెద్దకూతురు అరుంధతి, భర్తతో పిల్లలతో సంసారంలో - కాళ్లూ చేతులూ విరిగి మాసిపోయిన చందనపు బొమ్మలా అయిపోయింది. ఇంటర్ ప్యాసయి, పై చదువుకు స్తోమతలేక వివాహానికి వుద్యోగానికి మధ్య కూడలిస్థలంలో దారితెలియని బాటసారిలా నిలబడింది, తులసి. జీవితం మీదుగా, కలల కోణాల నుంచి బంగారుచిత్రాల్ని చిత్రించుకుంటున్న శేషు. వీళ్లుముగ్గురూ తన వారసులు. వాళ్ళ భవిష్యత్‌ను కొంతవరకూ, తండ్రిగా తను తీర్చిదిద్ది లోకంలో వదలాలి. ఆ పైన వాళ్ళే ఆ బ్రతుక్కి జలతారు లద్దుకుంటే తను మురిసిపోవాలి.

దూరంగా డీసెల్ వస్తున్న మోత, దానివెనకే చెట్లలో కిచకిచలాడుతున్న పక్షుల గుసగుసలతో తేరుకుని—

"వెళ్ళిపోదామా మాస్టారూ" అన్నాడు దక్షిణామూర్తి.

"పదండి"

హాల్లోంచి వీళ్ళు వెళ్ళిపోతూంటే యెవరూ గమనించనేలేదు. గమ

నించి, వూరుకున్నారో తెలియదు. మొత్తంమీద... అలిసి, వూరంతా అలసట తీర్చుకుంటున్న సమయంలో యిక్కడ ఈ రకం మనుష్యులు అలసట తీర్చుకోవడంకోసం అలిసిపోతున్నారనిపించింది— చటుక్కున భుజంగరావుగారికి.

◆

2

"శేషూ, నువ్వు మాకు పార్టీ చెయ్యా"లన్నాడు మిత్రుడు చలపతి.

"యెందుకో."

"స్కాలర్‌షిప్ డబ్బుతో గవర్నమెంటు నీకు ఘనసన్మానం చేసినందుకు" అన్నాడు శర్మ.

"అంటే వాడు కాఫీనీళ్ళతో మన ఆత్మలకు అభిషేకం చెయ్యాలంటావు."

"యస్"

అందరూ బజారులో పడ్డారు. మసీదుదగ్గరా, నూర్జహాన్ కిళ్ళీషాపులో సిగరెట్ల పెకెట్లూ, కిళ్ళీలూ పుచ్చుకుని మిత్రమండలి వసంత విహార్‌లో ప్రవేశించారు. "కాఫీలు మాత్రం" అని అన్నవాళ్ళు - టిఫిన్ కూడా అరగించారు. అన్నీ పూర్తయ్యాయి. సిగరెట్లు తగులబడ్డాయి.

"హొరేయ్ చిచీరోయ్" అన్నాడు చలపతి.

"యే చిచీ"

"ఫస్ట్ మెడిసిన్ ప్రభావతి. తెర పేరులోకి అనువదించుకుంటే చిన్నారి చిలక"

"సీ కవిత్వం, ఛీ" అన్నాడు కామేశ్వరరావు.

"పక్కనే యాభై మెగాటన్నుల అటంబాంబు" అన్నాడు రామారావు.

"అనగా కుమారి రాజలక్ష్మి. కేరాఫ్, శేషు. శావవశాత కాలేజీలో చదువు ముగించుకుంటున్న అప్సరస" అన్నాడు గోవిందరావు.

"నోరు మూసుకుంటావా" అన్నాడు మందలింపుగా శేషు.

"బాదంహల్వా అవుతుంది"

"నేను గోల్డుఫ్లేక్ సిగరెట్‌కు మూసేస్తాను"

"బర్కిలీ సిగరెట్‌కు యిక్కడ వుచితంగా నోరు మూయబడును. ఆ విధంగా నోరు మూసుకోతేనని నిరూపించినవారికి, తినగల్గినన్ని కోటయ్య పకోడీలు తినిపించగలము" అన్నాడు గోవిందరావు.

నవ్వులతో హోటలు నిండిపోయింది. అందరూ బయటపడ్డారు. శేషు అందరితో చెప్పి రూమ్‌కు బయలుదేరాడు. కొంతమంది సైన్యంలా సినిమావీధుల్ని, మరికొందరు అలయాల్ని, యింకొందరు పార్కుల్ని ముట్టడించడానికి విడిపోయారు.

కాకినాడ పట్టణం వైజ్ఞానికంగా కూడా ఉన్నతస్థాయిలోకి వస్తోంది.

ఎవో కొన్ని కోర్సులు తప్ప, ఆ వూళ్లో చదువుకునేవాళ్ళకు ఇబ్బంది లేదు. అందుకే యెక్కడచూసినా విద్యార్థులు, బాధ్యతారహితంగా నవ్వుతూ, కేరింతాలు కొడుతూ కన్పిస్తారు.

దేశాభ్యుదయానికి వో భుజం సహాయం చెయ్యడానికన్నట్టు ఆడవాళ్ళు కూడా ముందుకు వస్తున్నారు. వీళ్ళందరికోసమే యిళ్ళు లేస్తున్నాయి... హోటల్స్ పెరుగుతున్నాయి. ధరలు పైకి యెగబ్రాకుతున్నాయి. సినిమాలు, సరదాలు, ఆటలూ, పాటలూ సైడ్‌ట్రాక్‌లో వచ్చేవి అయినా పదిమందికీ కన్పించేవి యివే అవడం మూలంగా విద్యార్థి జీవితాన్ని అన్ని రకాల వాళ్ళూ కోరుకుని గుర్తు చేసుకుంటారు. విజ్ఞాన సముపార్జనకోసం పాటుపడే మనిషి ఆనందం ముందుగా కోరతాడేమో అన్పిస్తుంది, విద్యార్థి జీవితాన్ని చూడగానే.

శేషు రూమ్ తెరిచి కుర్చీలో కూర్చుని కూనిరాగాలు తీస్తూంటే "మా నాన్నగారు పిలుస్తున్నారు" అంటూ కుమారి వచ్చింది. కుమారి శేషు వుంటున్న యింటివారి అమ్మాయి. ఎనిమిది యేళ్ళుంటాయి. అతని దగ్గర చనువు. శేషు లేచి వెళ్లాడు.

శేషుని చూస్తూనే "రావోయ్, శేషూ" అన్నాడు రాజశేఖరం.

"రమ్మనమన్నారుటగా."

"అవును. నేను రేపు ఆదివారం పిఠాపురం వెడుతున్నాను. నువ్వూ వస్తావా"

"లేదండీ, యెగ్జామినేషన్స్ వున్నాయి. ఈ లోపునే యెక్స్‌కర్షన్ వొకటి వుంది."

"మీ నాన్నగారికి కబురేమన్నా చెప్పమంటావా"

"అల్లరి చేస్తున్నాడనీ, నన్ను కొడుతున్నాడనీ చెప్పు నాన్నా" అంది కుమారి ముద్దుగా.

లోపలి నుంచి "వాసే, దెయ్యం" అంటూ పిలుస్తూ వచ్చిన రాజలక్ష్మి వాకిట్లో శేషుని చూసి ఆగిపోయింది.

"మా వాళ్ళని అడిగానని చెప్పండి, అంతే" అన్నాడు లేస్తూ.

"ఏమని అడిగారో చెప్పకుండానే వెళ్ళిపోతారేం" అంది రాజలక్ష్మి నవ్వుతూ.

"బలే, బలే" చప్పట్లు కొట్టింది కుమారి.

శేషు ఆ మాటలో హాస్యానికి నవ్వుకుని తలూంచుకుని వెళ్ళిపోయాడు. కాలేజీలో తనకు స్కాలర్‌షిప్‌ద్వారా వచ్చిన డబ్బు తండ్రి కిమ్మనమని చెప్పి, రాజశేఖరంగారికి యివ్వాలనుకున్నాడు మొదట. కానీ యీ విషయం ఆయనకు తెలియజెప్పడంలో చిన్నతనం వుందేమో అన్పించింది.

నిజానికి రాజశేఖరంగారి మనస్తత్వం పూర్తిగా శేషుకు తెలుసు.

ఆయన దగ్గర తను దాచుకోవాల్సినవీ, దాగేవీ లేవు... ...

ఏడాదిక్రితం, సంక్రాంతిపండుక్కి అరుంధతిని పిఠాపురం తీసుకు వెడుతున్నాడు తను. విశాఖపట్టణంలో అక్కా పిల్లలతో రాత్రి ట్రెయిన్‌కు బయలుదేరా డారోజు. ఆ బండి తెల్లవారేసరికి పిఠాపురం చేరుకుంటుంది. రాత్రేమో చాలామంది కునికిపాట్లు పడుతూ, నిద్రా మెలుకువా కాని స్థితిలో వున్నారు. తను గాల్స్‌వర్దీ "ఫోర్‌సైట్ సేగా" చదువుకుంటున్నాడు. రైలు అనకాపల్లి దాటింది. ఎదర బెంచీమీద వొకాయన చలితో వణికిపోతున్నాడు. దగ్గు వుధృతంగా వస్తూ మనిషిని యెత్తికుదేస్తోంది చుట్టూ జనంలో కావల్సినవాళ్ళు లేక ఆయన్ని యెవరూ పట్టించుకోలేదు. అఖరికి తనే అడిగాడు.

"జ్వరంగా వుందాండీ" అని.

"అవును బాబూ" అన్నా డాయన ప్రయాసతో. ఆయన దగ్గర చేతి సంచీ తప్ప మరేంలేవు. వెంటనే తన రగ్గుతీసి ఆయనకు కప్పాడు. ఆయన సంచీ చూపించి అందులో వున్న మందు కలిపిమ్మని సంజ్ఞ చేశాడు.

శేషు అలాగే చేశాడు.

ఆయనకు ఆస్తమా సీజనల్‌గా వస్తుందిట. స్నేహితుడి కొడుక్కి పెళ్ళంటే విశాఖపట్టణం వెళ్ళి వస్తున్నాడుట. కాకినాడ వెళ్లాలిట. అప్పటికే అరుంధతీ పిల్లలూ లేచి భయంగా చూస్తున్నారు.

"ఈ పరిస్థితిలో కాకినాడ వరకూ యెలా కూర్చోగలరు? తుని స్టేషన్‌లో దిగిపోతే యెవరైనా డాక్టర్ని చూడచ్చు. నేను మీకు తోడుగా వుంటాను" అన్నాడు శేషు.

"వద్దు బాబూ, పండుగపూటా నాతో నువ్వేం వేగుతావు. పైగా ఆడవాళ్ళని వదిలి" అన్నాడు నెమ్మదిగా, అయిష్టంగా తలతిప్పుతూ.

ఇదంతా చూస్తున్న అరుంధతి "మాకేం ఫర్వాలేదండీ. నేను వొక్కతనే పిఠాపురంలో దిగగల్ను. అప్పటి కెలాగూ తెల్లవారుతుంది" అంది.

కొంచెంసేపటికి తుని స్టేషన్‌లో రైలు ఆగింది. అరుంధతితో చెప్పి శేషు ఆయన వద్దంటూన్నా వినకుండా రైలు దింపాడు. అప్పటికి తెల్లవారిపోతూండడం మూలంగా బండివాళ్ళు స్టేషన్ బయట కాచుకుని వున్నారు.

శేషు బండివాడితో మాట్లాడుతూంటే, రాజశేఖరంగారే అన్నాడు.

"ఈ వూళ్లో మా మేనత్తగారబ్బాయి సోమేశ్వరరావనివుండాలి. రాజావీధిలో వుంటున్నాడు. ముందు అక్కడికి వెడదాం."

శేషు సరేనని బండి కుదిర్చి ఆయన్ని యెక్కించాడు. ఇల్లు వెదకనవసరం లేకుండానే బండివాడు తీసుకువెళ్ళి సోమేశ్వర్రావు యింటి దగ్గర ఆపాడు.

శేషు వెళ్ళి తలుపు తట్టేసరికి వో పెద్దావిడ వచ్చి తలుపు తెరిచింది.

శేషు ఆవిడతో రాజశేఖరంగారి గురించి చెప్పగానే ఆవిడ ఆశ్చర్య పడి "అబ్బాయీ, శేఖరం బావొచ్చాడు, లే" అని కేకవేసి గబగబా బండి దగ్గరకు వెళ్ళి కుశల ప్రశ్నలు వెయ్య సాగింది. సోమేశ్వరరావు కూడా బయటకు వచ్చాడు. నలభై యేళ్ళ వాడు. రాజశేఖరం కన్నా చిన్నవాడు. ఆయాస పడుతూ నడుస్తున్న రాజశేఖరాన్ని చూసి—

"ఇదేమిటి బావా" అని తిరిగి తల్లితో "అమ్మా, నువ్వెళ్ళి పక్క వెయ్యి" అన్నాడు.

"రాజశేఖరంగారు "ఏం ఫర్వా లేదు. ఆయాసం, అంతే మరేం లేదు" అని శేషు సహాయంతో మంచంమీద కూర్చున్నాడు. వెంటనే సోమేశ్వరరావు డాక్టరు కోసం, రాజశేఖరం వద్దంటున్నా వినకుండా వెళ్ళి తీసుకువచ్చి యింజక్షన్ చేయించాడు.

మధ్యాహ్నానికి రాజశేఖరంగారికి కొంచెం సర్దుకుంది.

శేషు "నే వెడతానండీ" అన్నాడు.

"ఇవాళ వుండు నాయనా, మా బావతో వచ్చిన వాడివి. బంధువు కాకపోయినా, అంతకు మించి సహాయం చేశావు" అన్నాడు సోమేశ్వరరావు.

అతనికేం చెప్పాలో తెలియ లేదు. రాజశేఖరంగారు కూడా బావ గారి మాటనే సమర్థించాడు. మరునాడు యిద్దరూ కలిసి కాకినాడ తిరిగి వచ్చారు. దారిలోనే ఆయన, శేషు చదువు గురించీ, కుటుంబ విషయాలూ అన్నీ అడిగాడు.

"అప్పుడప్పుడు మా యింటికి వస్తూండవోయ్."

"అలాగేనండీ."

"చాలా వుపకారం చేశావు. మొహమైనా తెలియని మనిషికి అందులో రోగిష్టి వాడికి సపర్యలు చెయ్యడం అంటే మాటలుకాదు"

"నేనేం చేశానండీ, యేదో చిన్న సహాయం. అదీ గంటలమీద"

ఆ పరిచయాన్ని పురస్కరించుకుని కూడా అతను తరువాత రాజశేఖరం గార్ని కల్సుకోలేదు. ఓ రోజు కాలేజీ ఫంక్షన్‌లో శేషు నాటకం వెయ్యడం జరిగింది. అంతా పూర్తయిన తర్వాత గ్రీన్ రూమ్‌లో రంగు కడుక్కుంటూంటే.

"కంగ్రాట్యులేషన్స్ మిస్టర్ శేషూ" అంటూ రాజశేఖరంగారు లోపలికి వచ్చారు.

శేషు ఆశ్చర్యంగాచూసి మౌనంగానే నమస్కరించాడు.

"మరికొంచెం ట్రయినింగ్ వుంటే బాగా రాణిస్తావు" అన్నాడు నవ్వుతూ.

"యేదోలెండి. ఈ నాటకాలూ, అనుభవాలూ, చదువుకునే నాలుగు రోజులే. కాలేజీ నుంచి అడుగు బయట పెట్టడంతోనే బ్రతుకుతో అణుయుద్ధం మొదలవుతుంది."

(సశేషం)

పనికిరాని పరిజ్ఞానం

ఇంగ్లీషు భాషలోంచి కొన్ని పనికిరాని పాతమాటలు వాడుకలోంచి పోతున్నాయి పనికొచ్చే కొత్తమాటలు చేరుతున్నాయి. ఈ విధంగా అది ఎప్పటికప్పుడు అభివృద్ధి అవుతోంది. విద్యుచ్ఛక్తి వచ్చినతరవాత ఇంగ్లీషులోకి నాలుగువేల కొత్త మాటలు వచ్చి చేరాయట.

ఇంగ్లీషులో మొత్తం మూడు లక్షల మాటలున్నాయని ఒక అంచనా. కాని, వీటిలో పదోవంతు కూడా రోజువారీ వాడకంలోకి రావు. సామాన్యంగా వాడుకునే మాటలు మూడువేలు— అయిదు వేలు మధ్యలో వుంటాయి.

ఆంగ్ల మహాకవి మిల్టన్ ఎనిమిది వేల కంటె ఎక్కువమాటలు వాడలేదు. షేక్‌స్పియర్ రచనలలో 15 వేల మాటలకంటె ఎక్కువ లేవు.

♦

మిలియన్ అంటే పది లక్షలు. బిలియన్ అంటే అమెరికాలో చెప్పే లెక్కప్రకారం వెయ్యి మిలియన్లు అంటే వంద కోట్లు. ఈ లెక్క ఇప్పుడు ప్రపంచంలో అంతా ఉపయోగిస్తున్నారు.

కాని, బిలియన్ అంటే ఇంగ్లీషు వారికి మిలియన్ మిలియన్లు. అంటే 1 తరవాత 12 సున్నాలు పెట్టాలి. అంటే లక్ష కోట్లు. కాని, ఇంగ్లీషు వారు కూడా అమెరికన్ లెక్కనే వాడుతున్నారు

♦

ప్రపంచంలో పెద్ద వజ్రం దక్షిణాఫ్రికాలోని ట్రాన్స్‌వాల్ రాష్ట్రములో క్యూలినన్ పట్టణంవద్ద ఒక గనిలో 1905లో దొరికింది. దాని బరువు 1⅓ పౌనులు. 3106 క్యారట్లు.

ఆ వజ్రాన్ని యామ్‌స్టర్‌డామ్ వజ్రకారులు నాలుగు ముక్కలుగా కోసి సానపెట్టారు. అందులో పెద్ద ముక్క కోడిగుడ్డు ఆకారంలో 530 క్యారట్లపైగా వుంటుంది. ఇప్పటికీ ప్రపంచంలోకెల్లా పెద్దవజ్రం అదే.

♦

చదరంగం ఆటని కనిపెట్టింది ఇండియాలోనే. పేకాటని కనిపెట్టింది కూడా ఇండియాలోనేనట. క్రీస్తు శకం 800 నాటికే మన దేశంలో పేకలున్నాయి. ఇక్కడినుంచే అవి తూర్పు, పశ్చిమదేశాలకు వెళ్ళాయి.

అయితే ఆ రోజుల్లో ఇండియాలో పేకముక్కలను దశావతారాల బొమ్మలతో చిత్రించేవారు. వాటిని ఇతర దేశాలవారు రకరకాలుగా మార్చుకున్నారు.

♦

పేకముక్కలు ఎటు పట్టుకున్నా ఒకేలాగా వుండేట్టు ఎందుకు తయారు చేస్తారో తెలుసా? ముక్కల్ని చేతులోకి తీసుకున్న తరవాత తలకిందులుగా వున్నవాటిని సరిగా పెట్టుకోవడంలో ఎదటివాడు మనముక్కల్ని పసికట్టవచ్చు. దానికి వీలులేకుండా ఎలా పట్టుకున్నా సరిగానే వుండేట్టు ముద్రిస్తారు.

అయినా, అవలిస్తే పేకలు లెక్కపెట్టేవారు ఎప్పుడూ వుంటారు.

♦

వార్తాపత్రికలు ఇటలీలో ప్రారంభమైనాయట. 1566 లో వెనిస్ ప్రభుత్వం చేత్తో వ్రాసిన వార్తలతో కాగితాలను వీధులో అంటించేది. వాటిని చదవడానికి ఒక్కొక్కరు ఒక్కొక్క 'గజెట్టా' అనే నాణెం చెల్లించాలి, అందుకనే న్యూస్‌పేపర్లకి 'గజెట్' అనే పేరు వచ్చింది.

ఇంగ్లండులో మొదటి వార్తాపత్రిక 1622 లో లండన్‌లో వెలువడిన 'వీక్లీ న్యూస్'

తెలుగులో మొట్టమొదటి పత్రిక 1835 ప్రాంతాల్లో బహుశా వెలువడుతూవున్న 'మద్రాసు క్రానికల్' అనేది అయివుండాలని ఆరుద్రగారి పరిశోధనలలో తెలియవచ్చిన సమాచారం.

♦

ఓపిక ఎక్కువ, పని తక్కువగల ఒక లైబ్రేరియన్ వేసిన లెక్క ప్రకారం ముద్రణ ప్రారంభమైన దగ్గిర్నుంచి ఇప్పటిదాకా అచ్చు అయిన పుస్తకాల సంఖ్య ఒక కోటి 80 లక్షల పైమాటే. ఒక్కొక్క పుస్తకానికి సగటున తక్కువలో తక్కువగా మూడువేల కాపీలచొప్పున 5400 కోట్ల కాపీలు అచ్చు అయివుంటాయట.

1900 నాటినుంచి ఇప్పటికి అరవైలక్షల పైగా పుస్తకాలు అచ్చు అయ్యాయట.

— "శాస్త్రి"

□□□



సెషన్స్

పిళ్లారిసెట్టి నరసింహారావు

ఆ రోజు సాయంకాలం కాలేజి ఆడిటోరియమ్‌లో పెద్ద టీ పార్టీ జరుగుతూ ఉంది. దానికి విద్యార్థులు, విద్యార్థినులు, లెక్చరర్లు ప్రిన్సిపాలు అందరూ హాజరయ్యారు. సంభాషణలు స్వేచ్ఛగా సాగిపోతున్నాయి. కొందరు గుంపులు గుంపులుగా అక్కడక్కడ నిలబడి, పేట్లు చేతుల్లో పట్టుకొని, ఫలహారాలు సేవిస్తూ మాట్లాడుకుంటున్నారు.

ఒక అరగంట తరువాత గిరిజ కుర్చీమీదనుంచి నెమ్మదిగా లేచి, దూరంగా ఉన్న ఒక కిటికీ వద్దకు వెళ్ళి, తదేక ధ్యానంతో బయటకు చూస్తూ ఉండటం మోహన్ కనిపెట్టేడు. నెమ్మదిగా తను కూడా లేచి ఆమె దగ్గరకు వెళ్ళేడు.

"గిరిజా... నేనన్నది ఏమైనా జరిగిందా?" అని మెలగా ఆమెను ప్రశ్నించాడు. విచారంగా ఉన్న గిరిజ మొహాన్ని చూచి అతను ముందుగానే ఈ ప్రశ్నకు సమాధానాన్ని గ్రహించేశాడు. కాని మాట వరుసకు అలా అడుగక తప్పలేదు.

"లేదు" అన్నట్లు తల ఊపి ఆ

అమ్మాయి కన్నీళ్ళు కార్చడం మొదలు పెట్టింది.

మోహన్‌కు ఇక ఏం మాట్లాడాలో తెలియక కిటికీలోంచి చేతిని బయటుకు పెట్టి, అక్కడే పెరుగుతున్న ఒక చెట్టు ఆకుల్ని త్రుంచి, నలిపి క్రింద పారేస్తున్నాడు... ...

గిరిజ, మోహన్ బి. యస్ సి చదువుతున్నారు. ఒకసారి బస్సులో అందరూ పిక్‌నిక్‌కు వెళ్తున్నప్పుడు అతని చెప్పులు, ఆమె చెప్పులు సీటు క్రిందకు జారి కలిసిపోయాయి. దిగవలసిన చోటు వచ్చినప్పుడు గిరిజ అంది.

"ఎక్స్‌క్యూజ్ మి. నా చెప్పులు తీసుకోనివ్వండి."

"నేను తీసిస్తానుండండి" అంటూ అతను ఆమె స్లిప్పర్లను బయటుకు లాగి ఆమెకందిచ్చాడు.

"అయ్యో మీరెందుకు? నేనే తీసుకునేదాన్ని కదండి" అని గిరిజ నొచ్చుకుంది.

"మరేం ఫర్వాలేదులెండి" అన్నాడతను చిరునవ్వు నవ్వుతూ.

ఈ సంభాషణతో ఇద్దరికీ పరిచయమయ్యింది. ఆ తరువాత కాలేజి ఆవరణలో ఎప్పుడన్నా కలుసుకున్నపుడు ఇద్దరూ మాట్లాడుకొనేవారు.

"మీదే వూరండి?", ఒకసారి అతనామెను అడిగాడు.

"అనకాపల్లి"

"మీ తండ్రిగారేం చేస్తారు?"

"ఆయన ఇప్పుడు లేరండి. చనిపోయి అయిదు సంవత్సరాలయింది. మా అమ్మ మావూళ్ళోనే ఉంటోంది. చదువుకునే నిక్కడకొచ్చి హాస్టల్లో ఉంటున్నాను."

"అలాగా"

"మరి మీరు?"

"మాది విజయనగరంలెండి. మా నాన్నగారక్కడ ఒక పత్రికను నడుపుతున్నారు. మొదట్లో చిన్నదే. కాని రానురాను అభివృద్ధిలోనికి వచ్చింది..."

"దాని పేరు?"

మోహన్ చెప్పేడు.


"ఓహ్, అదా! ప్రతినెల దాన్ని చదువుతూనే ఉంటాను. కథలు స్టాండర్డు బాగుంటుంది."

"థాంక్స్."

"మరి బి. యస్ సి మీ వూళ్ళో చదువుకోక ఈ విశాఖపట్టణంలో చదువుతున్నారేమిటి?"

"నాకు ఓడల్లో తిరుగుతూ విదేశాలు చూడాలని ఆసక్తి ఉంది. అందుచేత ఈ చదువు పూర్తయాక తరువాత ఏ ఓడలోనో ఉద్యోగం సంపాదించ దలచుకున్నాను. కాబట్టి ఈ వూళ్ళో ఉంటే ఏ స్టీమరు కంపెనీ వాళ్ళతోనో స్నేహంచేసి, వాళ్ళసహాయంతో నాకు కావలసిన పని సంపాదించుకోవచ్చని నా ఆశ. కాని మా నాన్న మాత్రం మా పత్రికను ఇంకా ఇంప్రూవ్ చేసుకోవచ్చు విజయనగరం వచ్చెయ్యమంటాడు... మరి, చదువు పూర్తయిన తరువాత మీరేం చెయ్యదలచుకున్నారు?"

"ఏమీలేదు. ఏదో ఒక ఉద్యోగం చూసుకోవడమే."



"లేకపోతే పెళ్ళి."

ఆమె నవ్వింది.

"అడప్పుడప్పుడే కాదులెండి."

"అదేమిటి? నచ్చినవాడు దొరికితే మీరే ముందతని మెళ్లో మంగళసూత్రం కట్టేస్తారు."

గిరిజ మళ్ళీ నవ్వి అంది.

"స్త్రీలు పురుషులకు మంగళసూత్రం కడతారటండి, చోద్యం? పెళ్ళయిన తరువాత ముక్కుకి తాడేస్తారుగాని."

"అమ్మ బాబోయ్, ఇక నేను చస్తే పెళ్ళి చేసుకోను."

వారి పరిచయం రోజురోజుకు వృద్ధిచెందసాగింది. సినిమాలకు, నాటకాలకు, పార్కులకు, బీచికి వెళ్తుండేవారు. ఆఖరికి వారిస్నేహం ప్రేమగా మారిపోయింది. ప్రేమ మాటలు జరిగిన తరువాత పెళ్ళి మాట వచ్చింది.

"నేను ఫారిన్ వెళ్ళివచ్చిన తరువాత పెళ్ళి చేసుకుందాం."

"అంటే రెండు మూడేళ్ళన్నా అవుతుందా?"

"అవ్వొచ్చు"

"ఈలోగా విదేశాల్లో ఏ దొరసాన్నన్నా పట్టుకుంటావేమో?"

"నా మాటకేంగాని, ఈ లోగా నువ్వెవరినీ కట్టుకోకు."

"చాల్లే నీ మాటలు."

కొన్నాళ్ళ తరువాత వారి ప్రేమ పక్వదశకు వచ్చింది. సినిమాల్లోని ప్రేమ సన్నివేశాలు, కోయిల కుహూ కుహూలు, పార్కులలోని రంగురంగుల పుష్పాలు మన ప్రేమికుల్ని వేధించసాగాయి.

ఒక ఆదివారంనాడు మోహన్ గిరిజను అడిగాడు.

"నా రూమును నువ్వెప్పుడూ చూడలేదు కదూ?"

"నువ్వొక ఇంట్లోనో అద్దెకుంటున్నానని చెప్పేవు?"

"అవును, మా ఇంటి ఆవిడ... కాదు కాదు మా ఇల్లుగల ఆవిడ పేరు రమణమ్మ. ఏభై ఏళ్ళది. ఒక భాగంలో తనుంటూ రెండవ భాగాన్నంతా నా కద్దెకిచ్చేసింది. కాబట్టి అది రూము కాదు; ఇల్లే అనాలి. వెళ్దాం వస్తావా? రమణమ్మగారిని కూడా చూడొచ్చు."

సంకోచిస్తూ గిరిజ అంది:

"ఇప్పుడు కాదులే. మరోసారి వస్తాను."

"ఇప్పుడు కాకపోతే మరెప్పుడు? మరో మూడు వారాలలో యూనివర్సిటీ పరీక్షలు మొదలవుతున్నాయి. ఇక చదువుల్లో పడిపోతాం. ఇలా షికారుకు తిరగడం కుదరదు. వస్తే ఇప్పుడే రావాలి."

చివరకు గిరిజ ఒప్పుకోక తప్పింది కాదు.

"సరే, వెళ్దాంపద", అంది.

ఇంటికి వెళ్ళేసరికి రమణమ్మగారి భాగానికి తాళం వేయబడి ఉంది.

"బహుశః ఏ బంధువులింటికైనా వెళ్ళి ఉంటుంది... పద లోపలికి వెళ్దాం"

ఏకాంతత వారి నిగ్రహశక్తుల్ని తుదముట్టించింది. జరిగిన దానికి ఏ ఒకరిదీ తప్పుకాదు; ఇద్దరూ బాధ్యులే అనాలి. తన కోర్కెను వెళ్ళబుచ్చటం అతని తప్పు; దాన్ని గట్టిగా నిరాకరించకపోవటం ఆమె తప్పు. చివరకు ఇద్దరూ చాల పశ్చాత్తాప పడ్డారు.

మరుసటి దినంనుంచి వాళ్ళిద్దరూ కలవనేలేదు. రాత్రింబగళ్ళు బాగా చదివేరు. పరీక్షలు వారం రోజులు జరిగాయి. అన్నీ బాగా రాశారు. అందులో ఉత్తీర్ణులు కావడం ఖాయం.

ఇక స్టూడెంట్సు ఎవరి ఊళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయేముందు కాలేజీలో పెద్ద టీ పార్టీ ఏర్పాటు చేయబడింది. ఆ పార్టీకి ముందు రోజున గిరిజ మోహన్ను కలిసి తన అనుమానాన్ని బయటపెట్టింది.

"సీది వట్టి భ్రమ. రేపు చూడు. అంతా సవ్యంగా జరిగిపోతుంది" అని ధైర్యం చెప్పేడు...

చేతికి అంటుకున్న ఆకు పసరును జేబురుమాలతో తుడుచుకొని, మోహన్ గిరిజవైపు తిరిగాడు.

"ఇష్, జాగ్రత్త. కనీళ్ళు తుడుచుకో. ఎవరన్నా చూస్తారు."

ఒక నిమిషం ఇద్దరూ నిశ్శబ్దంగా ఉన్నారు.

మోహన్ మళ్ళీ ప్రశ్నించాడు.

"ఆలస్యం అవటానికి అవకాశం లేదా?"

"అటువంటిదెప్పుడూ నాకు జరగలేదు."

"పోనీ, మరి రెండు రోజులు చూడరాదు?"

"ఏమీ లాభం లేదు, మోహన్. ఇప్పటికే చాల ఆలస్యమయిపోయింది."

"రెండు రోజులే కదా"

"సరే"

రెండు రోజులు జరిగిపోయాయి. ఆ పైన మరి నాలుగు రోజులు కూడా గడచిపోవడంతో వారి అనుమానాలు దృఢపడినాయి. దానితో గిరిజ వెక్కి వెక్కి ఏడ్వటం మొదలుపెట్టింది. మోహన్ మనసు కరిగిపోయింది. పైకి ఆమెకు ధైర్యం చెప్తున్నా లోలోన బాధపడుతూనే ఉన్నాడు.

"చూడు గిరిజా, ఈ క్షణంనుంచి ఈ బాధ్యతంతా నా మీద వేసుకుంటున్నాను. నువ్వేమీ విచారపడకు."

"జరిగినదానికి ఏడ్వకుండా ఎలా ఉండగలను మోహన్?"

"నా మాట విను, గిరిజా. నాకొక ఉపాయం తట్టింది."

"ఏమిటది?"

"ఎబార్షన్."

"అమ్మో, అదా!"

"చదువుకున్న దానివి నువ్వే ఇలా భయపడితే, ఎలా గిరిజా? ఈ రోజుల్లో భయపడవలసినది ఏమీ లేదు. ఎంతోమంది స్పెషలిస్టులుంటారు. గవర్నమెంటే ఎబార్షన్ను లీగలైజ్ చెయ్యాలనుకుంటూ ఉన్న రోజులివి. పైగా నువ్వు రెండునెలల లోపలే ఉన్నావు. ఏం భయం లేదు" అని మోహన్ ఆమెను ఒప్పించాడు. కాని అతనికి ఈ స్పెషలిస్టులు ఎవరో బొత్తిగా తెలియదు. వీరిగురించి ఎవర్ని వాకబు చెయ్యాలో అంతకన్నా తెలియదు.

"మా హాస్టల్ వార్డెన్ను అడగరాదూ? ఆవిడ ఎంతో మంది, ఆడపిల్లల్ని చూస్తూ ఉంటుంది. ఇటువంటి సమస్యను ఆవిడ ఎప్పుడైనా పరిష్కరించి ఉండవచ్చని నా నమ్మకం."

"అబ్బా? ప్రిన్సిపాల్‌తో చెప్పేస్తే నా గతి ఏమవుతుంది?"

"ఆవిడలా చేస్తుందని నీకెలా తెలుసు?"

"ఆవిడ సంగతి నాకు బాగా తెలుసు. చాల నిక్కచ్చి మనిషి."

"మరి ఎవర్నో ఒకర్ని నమ్మకపోతే ఎలా?"

"కాలేజీకి సంబంధించినవారు మాత్రం వద్దు."

ఆ రాత్రి మోహన్ ఇంటికిచేరి "స్పెషలిస్టులు ఎవరు" అని ఎవర్ని అడగాలో దీర్ఘంగా ఆలోచించాడు. చివరకు ఆ ఊళ్ళో తనకు బాగా తెలిసినవారి పేర్ల జాబితా తయారు చేశాడు. కాని ఆలోచించి చూస్తే,

"మేం టెలిఫోన్ చేసేటప్పుడు హలో అంటాం" అన్నాడొక అమెరికన్.

"అయితే మావద్ద తేడా ఉంది" అన్నాడు బ్రిటిష్ వాడు.

"ఏమిటి, ఆ పద్ధతి?"

"ఫోన్ చేసేటప్పుడు — నువ్వక్కడున్నావా అంటాం. మేం ఉండకపోతే అసలు మాట్లాడక్కర్లేదు కదా."

అందులో ఏ ఒక్కరూ తన సమస్య తీర్చగలరనే నమ్మకం కలుగక పోవటమేకాక తన రహస్యం బయట పెట్టేస్తారనికూడా అతనికి భయం పట్టుకుంది.

నిస్పృహతో మోహన్ ఆ కాగితాన్ని చింపిపారేసి, బల్లమీద తల పెట్టి తన్ను తానే నిందించుకోవడం ప్రారంభించాడు. ఇంతలో "నాయనా మోహన్" అంటూ రమణమ్మగారు లోపలికొచ్చింది. అతను వెంటనే లేచి 'రండి, రండి' అంటూ ఆమెను ఆహ్వానిస్తూ ఆమెకో కుర్చీని చూపేడు.

"ఏం బాబూ, పెద్ద పరీక్షలయి వారం పైనయింది. మీ వూరింకా వెళ్ళలేదేం?" అని అడిగింది.

"ఏవో కొన్ని పనులుండటంచేత వెళ్ళలేదండి."

"నువ్విక్కడనుంచి వెళ్ళిపోతున్నా [illegible]కెంతో విచారంగా ఉంది, నాయనా. ఇన్నాళ్ళూ నీకిక్కడ సౌఖ్యంగానే గడచింది కదూ?"

అబ్బ ఎంత ఆప్యాయంగా మాట్లాడుతోంది ఈవిడ! తన గోడు ఈమెతో ఎందుకు చెప్పకూడదు? ఈ వూరి మనిషి అవడంచేత ఈవిడకి ఏ స్పెషలిస్టయినా తెలిసుంటాడు. వెంటనే ఆ నిశ్చయానికి వచ్చేశాడు మోహన్.

"ఈ ఇంటిని, మిమ్మల్ని విడిచి పెట్టి వెళ్ళాలంటే నాకూ ఎంతో బాధగా ఉంది రమణమ్మగారు. అయినా వెళ్ళక తప్పదుకదా. కాని వెళ్ళేముందు మిమ్మల్ని ఒక చిన్న సహాయం కోరాలని ఉంది."

"ఏమిటి బాబూ, అది?"

"మీదీ వూళ్ళో, చాలాకాలం నుంచి ఉంటున్నారుకదూ?"

"చాలకాల మేమిటి, బాబు? నేను పుట్టింది ఇక్కడే; బ్రతికేది ఇక్కడే; చచ్చేది ఇక్కడే."

"అంతమాట ఎందుకులెండి ... అయితే మీకీ వూళ్ళో ఎంతో మందితో పరిచయం ఉండి ఉంటుంది; ఎన్నో విషయాలు మీకు తెలిసి ఉంటాయి."

"ఏమిటో నాయనా, నువ్వంటున్న దేమిటో నాకగపడంలేదు. అడగదలచిందేదో సరిగ్గా అడగరాదూ? ఈ డొంకతిరుగుడంతా ఏమిటి?"

"చెప్పడానికి భయపడుతున్నానండి. జరిగినదానికి ఎంతో పశ్చాత్తాప పడుతున్నాను."

"సరేలే, సంగతేమిటో ముందు చెప్పు."

మోహన్ కథ ప్రారంభించాడు ... ...

"అయ్యయ్యో, నే నింట్లో లేకుండాచేసి, ఎవతో ఒక పిల్లను ఇక్కడకు తెచ్చి ... నువ్వేదో పెద్దింటి అబ్బాయివనుకున్నానుగాని ఇలాంటి తప్పుడు పనులు చేసేవాడివని కలలో కూడా అనుకోలేదు" అంటూ రమణమ్మ అతన్ని బాగా దూషించటం మొదలు పెట్టింది

తనమీద దయదలచి ఎవరైతే

సహాయం చేస్తారనుకున్నాడో వారే తన్నిలా తూలనాడటంతో మోహన్ బాగా క్రుంగిపోయి, ఆవిడకు ఎలాంటి సమాధానం ఇవ్వలేకపోయాడు.

కొంతసేపటికి రమణమ్మగారి ధోరణి తగ్గింది. ఆ అదను చూసుకొని, అతను తలెత్తి, దీనంగా ఆమె వంకచూస్తూ ప్రతిమాలుకున్నాడు: "నేను చేసింది తప్పే. అందుకు మీకు మనస్ఫూర్తిగా క్షమార్పణ చెప్పుకుంటున్నాను. నాకు సహాయం చెయ్యలేకపోతే చెయ్యకపోయారు గాని ఈ రహస్యాన్ని మాత్రం దయచేసి ఎక్కడా బయట పెట్టకండి."

ఒక నిమిషం ఆమె మౌనంగా వుండి మళ్ళీ ప్రశ్నించింది:

"ఊఁ, తరువాత ఏం జరిగింది?"

ఆమె అలా అడగటంతో మోహన్లో అంతరించిన ఆశలు తిరిగి ఉద్భవించాయి. గిరిజకు వచ్చిన సమస్య, దానికి పరిష్కారంగా తను సూచించిన విధానాన్నిగూర్చి చెప్తూ అన్నాడు!

"మీ ఎరుకలో ఇలాంటి స్పెషలిస్టులు ఎవరైనా ఉండుంటారు కాబట్టి ..." మోహన్ నాలిక కొరుక్కుని చటుక్కున ఆగిపోయాడు.

"అంటే అలాంటి వారికి నేను సహాయపడి పనిచేస్తూ ఉంటానని నీ అభిప్రాయమా?" అని ఆవిడ కోపంతో అడిగింది.

"క్షమించండి, రమణమ్మగారు. మీకు మళ్ళీకోపం తెప్పించాను. నా ఉద్దేశమది కానేకాదు. మీరు ఈ వూరివాళ్ళు; పెద్దలు. కాబట్టి అటువంటి చిక్కుల్లోపడి ఎవరైనా మీ సహాయం అర్థించి ఉండవచ్చు. అప్పుడు మీకు వాళ్ళని ఇటువంటి కేసులు చేపట్టే స్పెషలిస్టు దగ్గరికి పంపించి ఉం..."

రమణమ్మగారు తన మాటలు వినకుండా ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండటంచూసి మోహన్ ఆగిపోయాడు

ఐదు నిమిషాలు గడచిపోయిన తరువాత ఆమె అంది:

"అవును. నువన్నది నిజమే. ఐదారేళ్ళకితం మా బంధువుల కుర్రవాడొకడు ఇలాగేచేసి నా దగ్గరకొస్తే, వాణ్ణి, ఆ పిల్లని నాకు తెలిసిన ఒక స్పెషలిస్టు వద్దకు పంపేను. ఆ తరువాత వాడికీ, ఆ అమ్మాయికీ చిక్కులన్నీ తీరిపోయాయి."

"ఇందులో ప్రాణాపాయం ఏమీ ఉండదు కదండీ?" అని అతను ఆత్రుతతో ప్రశ్నించాడు.

"చీమ కుట్టినంత బాధ కూడా ఉండదు; ఇక ప్రాణాపాయం ఏమిటి నా మొహం? ఆయనంత గొప్ప స్పెషలిస్టు."

మోహన్ కళ్ళు ఆనందంతో మెరిశాయి. నిజంగా గిరిజ చాల అదృష్టవంతురాలే ననుకున్నాడు.

"అయితే ఆయనకు డిగ్రీలు, డిప్లొమాలు చాల ఉండి ఉండాలి."

"ఏమున్నాయో నాకు తెలియదు కాని ఇలాంటి సమస్యలు సునాయాసంగా తీర్చడంలో ఆయనంతటి

వేర్పరిమరొకరు లేరని గట్టిగా చెప్పగలను."

"రక్షించారు రమణమ్మగారు. ఇప్పుడు నా కెంత సంతోషంగా ఉందో చెప్పలేను. నా మనస్సు ఇప్పుడుగాని కుదుటపడలేదు. మీ మేలు ఎన్నటికీ మరువలేను" అని అతనామెకు తన కృతజ్ఞను వెల్లడించాడు.

"ఆ, ఏముందిలే నాయనా. ఏదో మొదట్లో కోప్పడ్డానుగాని ఆ మాత్రం సాయం నీకు చెయ్యలేనా ఏమిటి? ఇన్నాళ్ళు నా యింట్లో ఉన్నావాయె"

"ఇక ఆలస్యమెందుకు, రమణమ్మగారూ? ఆయన పేరు, ఎడ్రస్సు చెప్పండి. ఇప్పుడే వెళ్తాను" అని మోహన్ హుషారుగా కుర్చీమీద నుంచి లేచి నిలబడ్డాడు.

"ఆయన పేరు - పూర్ణానందం. కాని నువ్వాయన్ని కలవటం ఇప్పుడు కాదులే, కబురు. ముందుగా నే నాయనతో మాట్లాడి వస్తాను!"

"అలాగేనండి రేపే ఆయన్ని కలస్తారు కదూ?"

"అవును. మీ పూర్తిపేర్లు, పుట్టిన తేదీలు ఒక కాగితంమీద రాసివ్వు ఆయన తప్పనిసరిగా అడుగుతాడు."

"పుట్టిన తేదీలా! అవెందుకండి ఆయనకు?" అని మోహన్ ఆశ్చర్యంగా అడిగాడు.

తాము మాట్లాడుకుంటున్న విషయానికి వాటి అవసరం ఏమిటో అతనికి అంతుబట్టలేదు.

"మంచిప్రశ్నే వేశావు. పూర్ణానందంగారు ఎంత గొప్ప స్పెషలిస్టయినా చాల ఛాదసపు మనిషి. మంచి ముహూర్తం చూడందే ఏ పనీ తలపెట్టడు."

మారు మాట్లాడకుండా మోహన్ ఆమె అడిగింది రాసిచ్చాడు.

"ఇక నేను చెయ్యవలసింది చేస్తాను. రేపు నువ్వా అమ్మాయిని కలుసుకొని ధైర్యం చెప్పు నాయనా పాపం, ఏం భయపడుతుందో ఏమో" అంటూ ఆమె లేచింది.


"అలాగేనండి ... మీ మేలు ..." అని అతను అంటూ ఉండగానే ఆమె తన భాగంలోకి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి సంతోషంతో మోహన్‌కి నిద్రపట్టలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు ఈ శుభవార్తను గిరిజకు చెప్పుదామా అని ఉబలాటపడుతున్నాడు.

మరునాడు ప్రొద్దున్నే రమణమ్మగారు ఇల్లువిడిచి వెళ్ళిపోయింది. మధ్యాహ్నం తిరిగి వస్తుందేమోనని అతను ఆమెకోసం కాశాడు. కాని సాయంకాలంగాని ఆమె తిరిగి రాలేదు.

"ఏమండీ వెళ్ళినపని ఏమయిందికి? పూర్ణానందంగారు ఈ పనికి ఒప్పుకున్నట్టేనా?" అని మోహన్ ఆదుర్దాగా అడిగాడు.

"ఒప్పుకోక ఏంచేస్తాడులే? కాని ఆయన చేత ఊ అనిపించటానికి నా తాతలు దిగొచ్చారనుకో. ఆయన చేయవలసిన కేసులు ఇవ్వాటికే చాల ఉన్నాయి. కాని అతి కష్టంమీద మీ పని త్వరలోనే చెయ్యడానికి ఒప్పుకున్నాడు."



"చాల సంతోషమండి. మరి ఆయన ఫీజు మాటేమిటి?"

"ఆ సంగతి తరువాత చూసుకోవచ్చు. నీకేం భయంలేదు. నేనున్నానుగా" అంది రమణమ్మగారు గూఢంగా.

"మరి ఆయనవద్దకు గిరిజను ఎప్పుడు తీసుకువెళ్ళాలండి?"

"ఈ రోజు సోమవారం. వచ్చే ఆదివారం సాయంకాలం ఐదు గంటలకు గిరిజను వెంటబెట్టుకొని, నిన్ను తన ఇంటికి రమ్మన్నాడు. ఇదుగో ఆయన ఎడ్రస్సు" అని ఆమె అతనికొక కాగితాన్ని అందిచ్చింది.

మోహన్ దాన్ని చదివి ప్రశ్నించాడు;

"ఆయన ఇంట్లోనే క్లినిక్ ఉందా అండి?"

"లేదు. అది వేరేచోట ఉంది. కాని ఆయన మిమ్మల్ని రమ్మన్నది తన ఇంటికే. అక్కడే అంతా ఏర్పాటు చేస్తానన్నాడు."

జరగబోయే విషయాన్ని అత్యంత రహస్యంగా ఉంచాలి కాబట్టి అందుకు ఆయన తన ఇంట్లోనే సన్నాహాలు చేస్తున్నాడన్నమాట! నిజంగా ఈ పూర్ణానందం మంచి జాగ్రత్తగల మనిషే...

"ఏమిటి బాబూ. ఏదో ఆలోచిస్తున్నావే?" అని రమణమ్మగారు మళ్ళీ అడిగింది.

"మరేం లేదండి. మీరుకూడా ఆ సమయానికి అక్కడవుంటే మా కెంతో ధైర్యంగా ఉంటుంది. దయ చేసి మీరుకూడా..."

"ఓ తప్పకుండా వస్తాను. నువ్వు మాత్రం నిశ్చింతగా ఉండు. కాని ఆయన చెప్పిన టైముకు మీ రక్కడకు వెళ్ళకపోతే ఆయన మనల్ని ఇక దగ్గరకు రానియ్యడు" అని ఆమె అతన్ని గట్టిగా హెచ్చరించింది.

"ఎబ్బెబ్బే, అలా ఎప్పుడు చెయ్యనండి. వచ్చే ఆదివారం సాయంకాలం అయిదు గంటలకు పంక్చువల్‌గా మేమిద్దరం అక్కడ ఉంటాం, చూడండి" అని అతను బాస చేశాడు.

"మంచిది, సరేనా. అలాగే చెయ్యి. ఇక నేను వెళ్తొస్తాను," అంటూ ఆవిడ తన ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఆ అయిదురోజులు వారిద్దరికి అయిదు యుగాల్లాగ గడిచాయి.

ఆదివారం వచ్చింది. సాయంకాలం మూడు గంటలయ్యేప్పటికి మోహన్ గరల్స్ హాస్టల రిసెప్షన్ గదికి వచ్చేశాడు.

"నా కెందుకో చాల భయంగా ఉంది మోహన్."

"భయం దేనికి? పూర్ణానందం గారు చాల నేర్పరి, మంచివాడని రమణమ్మగారు చాల చెప్పింది. నీ కేమీ భయంలేదు ధైర్యంగా ఉండు."

"భయంమాట అటుంచు. నా పరిస్థితిని చూసి నాలో నేనే సిగ్గుతో చస్తున్నాను. ఇక ఆయన మొహం ఎలా చూసేది? ఏమంటాడో నన్ను చూసి?"

"ఏమీ అనడు. ఆయన చాల పెద్దమనిషి. తన డ్యూటీ తను చేసి ఫీజు తీసుకుంటాడు గాని మన తప్పుల్ని ఎప్పుడూ విమర్శించడు. ఆ భయమేమీ నీ కక్కర్లేదు."

"ట్రీట్‌మెంట్ ఎన్ని రోజులు పడుతుందో ఏమో? నేనిక్కడ్నుంచి వచ్చేవారంలో వెళ్ళిపోవాలి."

"ఈ నెల ఆఖరువరకు ఇక్కడ ఉండనిమ్మని మీ వార్డెన్ను రిక్వెస్ట్ చెయ్యకూడదూ?"

"అదేమి లాభం లేదు, మోహన్. కాలేజి మూసేసినా ఆమె నన్నిక్కడ ఇన్నాళ్ళు ఉండనిచ్చింది. అదే గొప్పసంగతి. వచ్చే వారంలో ఖాళీ చేసెయ్యాలని ఖచ్చితంగా చెప్పేసింది. ట్రీట్‌మెంట్ ఆలస్యం అవుతే మరి ఆ తరువాత నే నెక్కడ ఉండేది?"

తన స్థితిని తలచుకోగానే గిరిజ కళ్ళు కన్నీటితో నిండాయి. మౌనంగా మోహన్ అందించిన జేబురుమాలుతో కళ్ళు తుడుచుకొంది.

ఒక నిమిషం ఆలోచించిన తరువాత అతనొక నిర్ధారణకొచ్చి అన్నాడు:

"నువ్వేమి దిగులుపడకు, గిరిజ. రమణమ్మగారి భాగంలో నీ కొకగది ఏర్పాటు చేస్తాను. ఆవిడ నా మాట కాదనదు. అయినా పూర్ణానందం గారితో ఈ విషయంకూడా చెప్ప

దాం. మన పనిని సాధ్యమైనంత త్వరలో కానిచ్చేస్తాడు... టైమ యింది. ఇక బయలుదేరు."

"ఏమో మోహన్, నా శరీరం తేలిపోతున్నట్లుంది."

"వేడివేడి కాఫీ త్రాగితే అంతా పోతుంది లే."

సరిగ్గా అయిదు గంటలకు మోహన్ గిరిజలు రమణమ్మగా రిచ్చిన ఎడ్రస్సుకు చేరారు. వెంటనే గిరిజకు కాళ్ళు వణకటం ప్రారంభించాయి. మోహన్ ఆమెను పట్టుకొని ధైర్యవచనాలు పలుకుతూ, నెమ్మదిగా లోనికి నడిపించుకొని తీసుకువెళ్తున్నాడు. అదే సమయానికి రమణమ్మగారు బయటకువచ్చి అతనికి సహాయపడింది.

♦ ♦

రెండున్నర గంటలతరువాత గిరిజ మోహన్‌లు ఆ యింటినుంచి బయటకువచ్చి, చల్లగాలికని బీచికి వెళ్ళి, అక్కడ ఇసుకతిన్నెలమీద కూర్చొని మాట్లాడుకోవడం ప్రారంభించారు.

"అబ్బ, నా కెంత సంతోషంగా ఉందో చెప్పలేకపోతున్నాను," అంది గిరిజ. ఆమె కళ్ళు ఆనందంతో మెరిసిపోతున్నాయి.

"చచ్చి, మళ్ళీ బ్రతికినట్టుంది నాకు," అన్నాడు మోహన్ సంతృప్తిగా నిట్టూరుస్తూ.

"తమరిక ఓడలెక్కి విదేశాలు తిరగడం కుదరదు" అంది గిరిజ చిలిపిగా.

భార్యాభర్తలు సినిమాకెళ్ళి వచ్చారు. భార్య అంది! 'చూడండి ఆ సినిమాలో హీరో హీరోయిన్‌తో ఎంత ప్రేమగా మాట్లాడతాడో. మీ రెప్పుడన్నా నాతో అలా మాట్లాడారా?'

భర్త: 'ఏడిశావ్. అది సినిమా. అలా మాట్లాడినందుకు వాళ్ళు బోలెడు డబ్బు పుచ్చుకుంటారు.'

"పోనీలే, వాటిగురించి పత్రికల్లో చదువుకుంటాను."

"మీ పత్రికను ఇంప్రూవ్ చేసుకోవచ్చు కూడా."


"నిజమే, మా నాన్నకూడా చాల సంతోషిస్తాడు."

"ఇదంతా ఆ పూర్ణానందంగారి చలవే."

"నిస్సందేహంగా."

పూర్ణానందంగారు పేరు బడ్డ పురోహితుడు అంతేకాక మంచి వాగ్ధాటిగల మనిషి. తన వాక్చాతుర్యంతో మోహన్ గిరిజలను వారు చేసిన తప్పుకు పరిష్కారంగా వివాహమొక్కటే మార్గమని సూచించి, బోధించి ఒప్పించి, అరున్నర గంటల ముహూర్తానికి గిరిజ మెడలో మోహన్ చేత తాళి కట్టించేశాడు.

□□□



కథకుల కథ

పి.యస్.శాస్త్రి

"ఏయ్ రాజా! నాకో బ్రిలియంట్ అయిడియా వచ్చింది. వెంటనే కథ వ్రాస్తున్నాను!" అన్నాడు గోపాలం యెగిరి గంతు వేస్తూ!

"పోవోయ్ గోపాలం! నువ్వు యిప్పటిదాకా యెన్ని కథలు వ్రాసి పెట్లో పారెయ్యలేదు? ఇవాళ యేదో పెద్ద ఘనకార్యం చెయ్యబోతున్నట్టు చెబుతావేం?" అన్నాడు రాజు కసురుకుంటూ.

గోపాలం ఉత్సాహం కాస్తా గాలిలో కెగిరి పోయింది. "ఏమోయ్ రాజా! నీకు పుణ్యముంటుందిరా బాబూ! ఈ రాసే వొక్క కథా మాత్రం నువ్వు వినక తప్పదు! కావలిస్తే చెప్పి కడుపున పడతా!" అంటూ రాజును బ్రతిమాలుకొన్నాడు.

"ఏం? చెప్పు నా కడుపు నిండి వుకిత్తే, అప్పుడు చెప్పినట్టు వింటానా నీ ఊహ? ఛస్తే వినను!" అన్నాడు రాజా విసురుగా.

"రాజా పరిస్థితి చూసి గోపాలానికి మతిపోయింది. "రాజా కేమైం

దివ్వాళ? ఇవ్వాళ రాజుకేమైంది?' అనుకున్నాడు.

మెల్లిగా ప్లేటు ఫిరాయించి, తెపు కొడితేనేకాని రాజు, తనను కథ రానుకోనివ్వడు! వినడు! ఈ రెండింట్లో యేది జరుగక పోయినా తనకు తోచిచావదు!

ఇప్పటికే గోపాలం కోలెడు కథలు వ్రాసి ప్రక్కగదిలోని పెట్లో పారేశాడు! ఐనా వ్రాయాలనే తృష్ణ తగ్గటం లేదు! వార, పక్ష, మాసపత్రికలలో కథలు చదివినప్పు డల్లా తను కూడా యింత మంచి కథలు వ్రాయగలననే ఉత్సాహం కొద్దీ వ్రాసి పారేసేవాడు! కాని పత్రికలు మాత్రం వాటిని ప్రచురించ టానికేం ఉత్సాహం చూపలేదు!

కనుక తన తోడునీడైన రాజే తన కథారధ సారధి! కర్ణదాత! తలవంతపు శ్రోత!

అటువంటి వాడు ఇవ్వాళ ఇంత వేడి వేడిగా మట్లాడుతున్నాడంటే యేదో ఉపద్రవం జరిగి వుండాలి! అది కనుక్కోని రాజును మంచి చేసుకోకపోతే, ఉన్న వొక్క శ్రోతా గాలిలో కలిసిపోతాడు!

పోనీలే రాజా! వెధవ కథ! నేను వ్రాయనూవద్దు! నీవు వినమూ వద్దు! ఏదో ప్రొద్దుపోక అల్లా అన్నా నంతే! అన్నట్టు 'ప్రొద్దు'అంటే గుర్తొచ్చింది. నువు ప్రొద్దున "వరల్డ్ టై నైట్" పిక్చరుకు వెళ్లామన్నావు కాదూ? మరిచిపోయాను! పోదాం పద! నీ డబ్బులు కూడా నేనే పెట్టుకుంటాను' అన్నాడు గోపాలం గబ గబా తన మాటల రంగునీ తను తొడుక్కున్న రంగు చొక్కానీ మారుస్తూ!

అలా మెల్లిగా గోపాలం రాజును చల్లబరిచి అసలు కథ రాబట్టాడు.


ఆ రోజు ఆదివారం కావటంవల్ల పది గంటల వేళ రాజు తనతో పాటే ఆఫీసులో పనిచేసే మాధవ రావ్ కులకర్ణి ఇంటికి వెళ్ళాడట. వీడి దురదృష్టవశాత్తు మాధవరావ్ కులకర్ణి కూడా అనేక 'అముద్రిత' మరాఠీ కథా సంపుటాల రచయి తట. అవి అతను మరాఠీ పత్రికలకు పంపిస్తే అవి ఇతను ప్రవాస మహా రాష్ట్రుడనేనా అభిమానం చూపక వెంటనే త్రిప్పి పంపేవిట!

మరాఠీ శ్రోతలు కరువైన కుల కర్ణి రాజును కూర్చోబెట్టి, తన కథను ముందు మరాఠీలోనూ, ఆ తరువాత దాన్ని తెలుగులోకి మార్చి వీడి ప్రాణం తీశాడట!

వాళ్ళింటికి వెళ్ళేటప్పటికే రాజు గోపాలం దగ్గర వాడి 'కోటా' కథను వినేసి తగిన ఫీజు వసూలు చేసుకొని బయటపడ్డాడు. తలా నొప్పితో!

దాని మీద ఈ మరాఠీ, తెలుగు అనువాదం, కథ వినేసరికి పిచ్చి కోపం వచ్చిందట!

ఆ వేడిలో ఇంటికి వచ్చిన రాజుకు, గోపాలంగాడు గుమ్మం లోనే యెదురై 'కథ రాస్తాను' అంటే తంతానన్నాడు! అదీ కథ!



ఈ కథ విన్న గోపాలానికి బుర్రలో బ్రహ్మాండమైన మెరుపు మెరిసింది. కాని పైకి చెబితే రాజు మళ్ళీ తంతానంటాడో యేమోనని భయం వేసింది అందుకని నోరు మూసుకు పూరుకొన్నాడు.

మర్నాడు ప్రొద్దున్నే టిఫిన్ చేసి గోపాలం రాజుతో మాట మాత్ర మైనా చెప్పకుండా కులకర్ణి ఇంటికి వెళ్లాడు.

అప్పటికే కులకర్ణి తన మరాఠీ కథలతో కుస్తీ పట్టున్నాడు.

గోపాలం కులకర్ణికి తనంతతనే పరిచయం చేసుకుని, చాలా సేపు మాట్లాడాడు.

అంతే! అటుపైన వారం, వారం, వివిధ పత్రికల్లో గోపాలం కథలు పడ్డం ప్రారంభించాయి!

కాని రాజుకి ఈ సంగతు లేవీ తెలియవు. గోపాలం కోటా కథలు వినిపించడం మానేసినందుకు బోలెడు సంతోషపడ్డాడు. అడిగితే మళ్ళీ ఎక్కడ తగులుకుంటాడో అని అడగతే ఎత్తలేదు!

ఓ రోజు మామూలుగా పత్రి కలు తిరగేస్తూంటే ఓదాంట్లో వో కథ కనువించింది. దాని మీద 'ప్రఖ్యాత మరాఠీ రచయిత మాధవ రావ్ కులకర్ణి రచనకు స్వేచ్ఛాను సరణ – గోపాలం' అని వుంది.

రాజుకు తల తిరిగిపోయింది. మాధవరావ్ కులకర్ణి మరాఠీలో ప్రఖ్యాత రచయిత యెప్పు డయ్యాడో అర్థంకాలేదతనికి! పోనీ అయ్యాడే అనుకుందాం! తెలుగే పరిగా వచ్చిచావని ఈ గోపాలం

గాడికి మరాఠీ యెల్లా వచ్చింది? అనువాదం ఎప్పుడు, ఎల్లా చేశాడు? అన్నీ ప్రశ్నలే! గోపాలమే చెప్పాలి జవాబు అనుకుంటూ యింటికి పరుగెట్టాడు.

లోపలి కొస్తూనే 'గోపాలం, గోపాలం' అని చావు కేకలాంటి రెండు గావుకేకలు పెట్టాడు!

చేతిలో వున్న పత్రికలోని కథ తీసి చూపిస్తూ, 'ఏంట్రా ఇది? ఇది యేమిటి?' అన్నాడు గోపాలాన్ని దబాయిస్తూ!

గోపాలం సర్వజ్ఞుడైన వ్యాస మహర్షిలా చిరునవ్వు నవ్వాడు.

'మాధవరావ్ కులకర్ణి ఇంటికి పోదాం రారాదూ! చాలా రోజులైంది చూసి పాపం!' అన్నాడు.

రాజుకు అరికాలి మంట నెత్తికెక్కింది 'బోడి వెధవ! బోడి వెధవ సస్పెన్స్ వీడూను! తిన్నగా జవాబు చెప్పడేం? తనెన్నిమాట్లు వద్దంటున్నా 'ఇదీ నా కథలో సస్పెన్స్' అంటూ తనెంత బోరు కొట్టేవాడు? వినరా బాబూ అనిపీకిచ్చి కాళ్ళు పట్టుకునేవాడు! ఇల్లాంటి వెధవ, వో అనువాదం కథ చదివేసరికి యెంత పోజు కొట్టేస్తున్నాడు' అనుకున్నాడు.

కులకర్ణి ఇంటికి వీళ్ళు చేరేసరికి అక్కడ ఇంత కంటె హడావుడిగా వుంది. కులకర్ణి మూడు నాలుగు మరాఠీ పత్రికలు చేత్తో పట్టుకుని సంతోష పడిపోతున్నాడు.

గోపాలాన్ని చూడగానే యెగిరి గంతేసి 'గోపాలంగారూ, మీరు చాలా జీనియస్! మిమ్మల్ని దేవుడు ఈ ఆంధ్రదేశంలో కాక యే అమెరికాలోనో పుట్టిస్తే బోల్డు గొప్పవారు, కోటీశ్వరులు అయిపోయి వుందురు. నావి మూడు కథలు మా పత్రికల వాళ్ళు ప్రచురించారు' అన్నాడు పొంగిపోతూ.

రాజుకి మరీ అయోమయమయిపోయింది! 'పదిహేను, ఇరవయ్యి రోజుల క్రిందటి వరకు తిరిగి వస్తున్న కులకర్ణి కథలు పత్రికల్లో యెలా ప్రచురిత మవుతున్నాయి? దానికి గోపాలంగాడి సహాయమేమిటి?' అనుకొన్నాడు ఆశ్చర్యపోతూ!

కొంచెంసేపటికి కులకర్ణి మరాఠీ రాని తన మిత్రుల సౌకర్యార్థం తన కథని తెలుగు చేసి వినిపించడం మొదలు పెట్టాడు. కథ పేరు చదివి 'ప్రఖ్యాత తెలుగు కథకులు శ్రీ గోపాలంగారి కథకు మాధవరావు కులకర్ణి స్వేచ్ఛానుసరణం' అని చదివాడు.

తీరా వింటే, ఆ కథ ఇంతకు ముందు కులకర్ణి రాజుకు బలవంతంగా చదివి వినిపించిందే!

రాజుకు ఇప్పుడంతా అర్థమయింది!

□□□

జయంతి

అనూరాధ వార్ధక్యంలో అడుగు పెట్టింది. గత జీవితంలోని అనుభవాలు స్మృతులుగానైనా వేధించనంత ఆనందంగా ఆమె జీవితం గడిచిపోయింది. అనురాగంగా చూసుకునే అనుకూలమైన భర్త శ్రీనివాసరావు అందలో ఎన్నడూ ఆమె బాధపడ నవసరమే కలుగలేదు.

అటువంటి దీనాడు అకస్మాత్తుగా రాజారావు ఉత్తరం ఆమె కనుల బడేటప్పటికి అలజడి చెందింది. అసలు ఉబుసుపోక భర్త పాతడైరీ తెరిచి చూడకుండా ఉంటే ఆ ఉత్తరం ఆమె చూడటం సంభవించే ఉండేది కాదు.

ఆ డైరీ అయినా ఇప్పటిదా? పదిహేనేళ్ళ నాటిది. ఇంట్లో అటకలపైన సామాను సర్దిస్తూ ఉంటే పాత్ర సామాను, పాతపుస్తకాలతో పాటు ఈ డైరీకూడా బయటపడింది. తోచక, కుతూహలం అణచుకోలేక డైరీ తెరిస్తే అందులో రాజారావు ఉత్తరం.

'రాజారావు వెధవ. ఎంత సాహసానికి ఒడికట్టాడు. ఏమి వ్రాశాడో అయనకి! ఎన్నడూ ఆయన నాతో మాటమాత్రమైనా అనలేదే.

ఒకప్పుడు రాజారావు మాటలు విని ఎంతగా మోసపోయాను! ఉన్నతమైన భావాలు కలవాడనుకున్నాను. విశిష్టమైన వ్యక్తిత్వం అని గౌరవించాను. నాగరాజు అనుకున్న రాజారావు ఆఖరికి వానపామై పోయాడు. ఇంకానయం.'

భగవంతుడు తన్ను రక్షించాడు. లేకుంటే ఏమైఉండేదో — చేతిలో ఉత్తరాన్ని పట్టుకున్న అనూరాధ మనసు పదిహేనేళ్ళ వెనక్కి వెళ్ళి గతాన్ని తలుచుకుంది.

'అనూ, వీడే రాజారావు నా ప్రాణస్నేహితుడు. మన పెళ్ళికి రాలేకపోయాడు' — పెళ్ళయిన కొత్తలలో ఆయన ఒకనాడు అతన్ని ఇంటికి తీసుకు వచ్చి పరిచయం చేశారు.

పేరువిని అనుమానంగానే తలెత్తి

చూసిన నేను ఉలిక్కిపడ్డాను. రాజు... ఆయనకి స్నేహితుడా! ఇది నిజమా!—భయంతోనూ, బాధతోనూ నమస్కరించాను.

'నమస్తే' — రెండు చేతులూ జోడించి ఏమీ ఎరగనట్టుగానే నమస్కారం చేశాడు.

"ఒక్క నిమిషం రాజూ, నేను స్నానం చేసి వస్తాను. నేను వచ్చే దాకా మా ఆవిడ ఎంగేజ్ చేస్తుంది" — నన్ను అక్కడ వదిలేసి ఆయన వెళ్ళారు.

నాకు కాళ్ళూ చేతులూ వణికాయి. ఏం మాట్లాడాలో తోచలేదు.

"కూర్చో అనూరాధా" — రాజే మాట్లాడాడు.

మాటలు రానిదానిలాగా వెంటనే సోఫాలో కూలబడ్డాను.

"ఎందుకొచ్చావురాజూ" — నీరసంగా కనులు మూసుకుంటూ అడిగాను.

నాకేమయింది! నా గొంతు నా చెవులకే వింతగా వినపడింది.

రాజు నవ్వాడు. "నోబుల్ ఇన్ డీడ్. ఇంకా గుర్తు ఉన్నానన్న మాట. ఫరవాలేదు."

నేను మాటాడలేదు. మాట్లాడగల శక్తి నాలో లేదు.

'ఎందుకొచ్చానని కదూ అడిగావు.

నాకేం తెలును, నువ్వే నా సర్వస్వం రాజూ అన్న ఒకనాటి అనూరాధే మా శీనుగాడి భార్య అని.

ఒకవేళ తెలిస్తే మాత్రం ఇలా ఉత్తిచేతులతో వచ్చేవాడిని కాదు. ఏదైనా కానుక తెచ్చేవాడిని."

అతని మాటలు విని ఊపిరి బిగబట్టాను. నేను ఏదో అనబోతుంటే,

"ఆగు అనూరాధా, నీ ప్రశ్నకి జవాబిచ్చాను. ఇక నువ్వు నా ప్రశ్నకి జవాబివ్వాలి. ఇచ్చిపుచ్చుకోవటం అన్నారు నన్ను మరిచిపోలేదా? జవాబు చెప్పు" — రాజు అడిగాడు.

"ఎలా మరిచిపోతాను రాజూ"— ఈ మాటలు అంటుంటే నా గుండెలనెవరో నొక్కిపడుతున్నట్లు బాధ

ఊపిరి ఆడదేమో అని భయం వేసింది.

రాజు మళ్ళీ పెద్దగా నవ్వాడు.


"నోబుల్ ఇన్ డీడ్. భారత స్త్రీ తన జీవితంలో ఒక్కడినే ఒక్కసారే ప్రేమిస్తుంది. మంచి ఆదర్శం, సినిమాల్లోనూ, నవలల్లోనూ బాగా పనికొస్తుంది."

"రాజూ ప్లీజ్. మరీ అంత అన్యాయంగా మాట్లాడకు."

"ఏది అన్యాయం అనూరాధా? అనగా అనగా ఒక అనూరాధ."

బాధతో నేను రెండు చేతులతోనూ మొహం కప్పుకున్నాను.

"ఏం? పేరు బాగాలేదా? పోనీ ఎవరో, ఒక సీతో, సావిత్రో, దమయంతో, — ఒక నిర్భాగ్యుడు, అమాయకుడు, పూర్ ఫెలో అయిన



రాజారావుని ప్రేమించింది. అనూరాధకి కోలెడంత డబ్బు. రాజారావు జేబులో దమ్మిడీలేదు. అతని జేబుకి చిలుట. దమ్మిడీ లేనివాడికి నా కూతుర్నివ్వను ఫో అంటాడు అనూరాధ నాన్న. ఆ తరువాత ఏమవుతుంది."

"రాజూ ప్లీజ్ స్టాపిట్."

రాజు నా అరుపు వినిపించుకోనట్లే కొనసాగించాడు.

"ఆ తరువాత ఏమవుతుంది? అనూరాధ ఇంట్లోనుంచి పారిపోయి రాజారావుని పెళ్ళి చేసుకుంటుందా?

దొడ్లోని గన్నేరుకాయ మింగి చచ్చిపోతుందా?

రాజారావు పిచ్చివాడయి పాటలు పాడుకుంటాడా? నో నో నాట్ ఎటాల్. ఇది సినిమాకాదు. జీవితం అందుకని ఆ అమ్మడు కాస్తా చక్కగా తలవంచుకుని కూర్చుని అతను తెచ్చిన వాడిని పెళ్ళిచేసుకుంటుంది

రాజారావు అనంత విశ్వంలో

తెరవెనుక బడిపోతాడు. దేర్ ఎండ్స్ ది స్టోరి."

"రాజా ఎందుకిదంతా? అయినా కథ అక్కడితోనే ఆగిపోలేదుగా. ఈ వేళ ఇలా నా ప్రాణాలకి యముడిలాగా దాపురించావు."

నాకు విసుగు, అశక్తత లోనుంచి కోపం కలుగుతోంది.

"వెరీగుడ్ సో, కథ పునరావృత్తి అవుతుంది.

నువ్వు లేనిదే నేను బ్రతకలేను అన్న అనూరాధే నా ప్రాణాలకి యముడులాగా దాపురించావు అంటుంది రాజారావుని చూసి. దానికి రాజారా వేమంటాడు?"

ఈ సారి నాకు భయంపోయి ఆ స్థానే కోపం ఆవరించింది. లేచి నిలుచుని "రాజా, అసందర్భంగా ప్రవర్తిస్తున్నావు. అవన్నీ మరిచిపో" అన్నాను.

"మరిచిపోనిది నువ్వే అనూరాధా. నే నేనాడో మరచిపోయాను. నీ మొహంలో ఎంత బాధ, నీ మనసులో ఎంత కంగారు వ్యక్తమవుతున్నాయో చూడు. వాటిని నా పెదవులపై చిరునవ్వుతో పోల్చుకో. ఎవరు మరిచిపోలేదో తెలుస్తుంది. ప్లీజ్ కూర్చో."

నేను అశక్తురాలనయి కూర్చున్నాను.

"నేను నీకోసమేమీ ఏడ్చి బాధపడలేదులే, విచారించకు. అసలు ఇన్నేళ్ళ జీవితంలోనూ నిన్ను విడిచిన తరువాత ఒక్కసారి కూడా తలుచుకోలేదు.

"ఏంచేస్తున్నావు రాజా. పెళ్ళయిందా" — కుతూహలంగా అడిగాను.

"దివ్యంగా. అదృష్టం బాగుండి బాగా డబ్బున్న రోగిష్టి పిల్లని, మా మావకి ఒక్కతే కూతురుని చేసుకున్నాను. పెళ్ళయిన ఏడాదిలో నే నా శ్రీమతి రత్నం హరీ అంది. సో... ఇప్పుడు రాజారావు జేబుకి చిల్లులేదు, కావలసినంత డబ్బు, మంచి ఉద్యోగం. అందమైన అనూరాధను పెళ్లాడగల అర్హత."

—అని పెద్దగా నవ్వాడు రాజారావు.


ఆ మాటలలోని కాఠిన్యానికి, అసభ్యతకు నా వళ్ళు జలదరించింది.

"ఈ మనిషినా నేను ప్రేమించింది? ఈ మనిషికోసమా నేను బాధపడుతోంది? ఛీ ఎంత మోసపోయాను! మనిషికాదు మృగం. భగవంతుడు రక్షించాడు. ఇంకా నయం. తండ్రి నెదిరించి పెళ్ళిచేసుకోలేదు."

—నా మనసు మంటలు గ్రక్కింది.

"అనూరాధా. ఒక చిన్న కోరిక. పోనీ ఇప్పుడయినా మించిపోయిందిలేదు. నాతో వచ్చెయ్యకూడదూ. కావలసినంత ధనముంది."

ఉలిక్కిపడి చూశాను. అతని



పెదవులపై చిరునవ్వు అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది.

రాజారావు చెంప ఛెళ్ళుమంది.

"ఛీ, ఇంతనికృష్టుడి వనుకోలేదు. ప్రాణస్నేహితుడివి అనుకుంటున్న ఆయనకు నువ్వు చేయవలసిన ఉపకారమిదేనా. నీనోటితో నా పేరు ఉచ్చరిస్తేనే సర్వపాపాలూ అంటుకుంటాయి. జరిగింది మరిచిపోయి నీ మిత్రుడి భార్యగా చూడగలిగితేనే ఆయన వచ్చేదాకా అయినా ఉండు. లేకుంటే ఇప్పుడే నడు బయటికి."

నా మాటలు విని రాజారావు వికటంగా నవ్వాడు.

"ఓకే. ఓకే. ఈ కథ ఇంతటితో సమాప్తం. పోనీలే నువ్వు కాకపోతే ఇంకొకరు. ఈ దిక్కుమాలిన దేశంలో ఆడవాళ్ళకేం తక్కువ."

"ఛీ ... సిగ్గులేదూ" — నేను ఛీత్కారం చేసి లోపలికి వెళ్ళిపోయాను.

వెళుతుంటే అతని నవ్వు కఠోరంగా వినపడింది.

తరువాత ఇక ఆ రోజున ఆయన ముందర రాజారావుతో సభ్యంగా ప్రవర్తించటం చాలా కష్టమయింది.

ఎంత తమాయించుకున్నాగాని రాజారావుని చూస్తేనే చాలు నా మనసు సెగలు పొగలయి అసహ్యాన్ని వెళ్ళగ్రక్కింది.

ముగ్గురం కలసి పేకాడదామన్నారు ఆయన.

నాకు వంట్లో బాగుండలేదు, ఆడనన్నాను.

భోజనాల దగ్గర, ఆయన చెయ్యి కడుక్కోవటానికి వెళ్ళినపుడు మాత్రం - 'రాజూ, ఇంకెప్పుడూ మా ఇంటికి రాకు. జన్మలో నీ దౌర్భాగ్యపు మొహం తిరిగి నాకు చూపించకు. నీ జ్ఞాపకాల నీడ కూడా నా మీద పడనివ్వకు. నువ్వంటే నాకు మిగిలింది అసహ్యమే' - అన్నాను నిర్మొహమాటంగా.

రాజారావు జవాబివ్వలేదు. నవ్వాడు. ఆ నవ్వు విని వళ్ళు మండిపోయింది.

భోజనాలు అయిపోగానే, తలకాయ నెప్పిగా ఉందని పోయి పడుకున్నాను.

"అనూ ... లే ... అతను వెళుతున్నాడు. ఏమిటిది? ఏమైనా బాగుందా" - ఆయన వచ్చి బతిమాలారు.

'నేను లేవలేను. వెళ్ళిరమ్మనండి' - కఠినంగా చెప్పాను.

'ఇంత మూర్ఖంగా ప్రవర్తిస్తావనుకోలేదు' - ఆయన విసుక్కున్నారు.

'ఫరవాలేదులేరా. మీ ఆవిడ లేచి రాలేకపోయినంత మాత్రాన కొంపేం మునిగిపోదులే. నేను వెళుతున్నాను' - నవ్వుతూ రాజు అన్న మాటల్లో నన్ను ఎగతాళి చేస్తున్నట్లు అనిపించింది.

లేచి చెప్పు తీసుకు కొడదామనుకున్నాను

* * *

గతాన్ని గుర్తుచేసుకున్న అనూరాధ కోపంతో ఊగింది. నిట్టూర్పు విడిచి అనుకుంది.

భగవంతుడి దయవలన రాజు మళ్ళీ కనిపించలేదు. అదే ఆఖరుసారి చూడటం.

ఆ తరువాత ఆయనవచ్చి 'రాజు ఉద్యోగానికి రిజైన్ చేశాడుట. అసలు బదిలీ చేయించుకుందామని ప్రయత్నించాడుట. అది వీలుపడకపోతే ఉద్యోగమే వదిలేసి ఊరు విడచి వెళ్ళిపోయాడుట. వెళ్ళే ముందు చెప్పైనా వెళ్ళలేదు' అని భర్త బాధపడుతుంటే అనూరాధ ఓదార్చే ప్రయత్నమే చేయలేదు. విననట్టు ఊరుకుంది.

అంతకన్నా, అయిదేళ్ళ క్రితం - 'రాజు చచ్చిపోయాడుట అనూ. ఎవరూ లేనిచోట దిక్కులేని చావు చచ్చాడుట, ఆశ్చర్యంగా లేదూ.'

అని తన మొహంలోకి సూటిగా చూసి భర్త అడిగితే ఆమె నిర్వికారంగా ఉండిపోయింది.

అరేళ్ళ కుర్రాడు కాలవ గట్టున ఆడుకుంటూ కాలుజారి నీళ్ళలోకి పోయాడు. దారిన పోయే దానయ్య వాడిని బయటికితీసి, తండ్రిపేరు, అడ్రసు కనుక్కుని ఇంటికి తీసుకెళ్ళాడు.

'నువ్వేనా మా వాణ్ణి కాలవలోంచి తీసింది?' అని కుర్రాడి తండ్రి అడిగాడు.

'ఫర్లేదండి. దానికేముంది? ఏదో చిన్న పిల్లాడు మునిగిపోతుంటే తీసిరక్షించడంకూడా గొప్పేనా?' అన్నాడు దానయ్య.

'ఫర్లేదేమిటయ్యా? వాడి జేబులో అర్థరూపాయి వుండాలి. ఏదీ?' అని తండ్రి గద్దించాడు.

రాజారావు చావుకి కొంచెమైనా బాధ పడలేదు.

'ఎటువంటి మనుషులకి అటువంటి చావు లభిస్తుంది' - అనుకున్నది మనసులో.

కానీ అన్నిటికన్నా అనూరాధను బాధించిన విషయం, భర్త తన మాట వినకుండా ఒక్కగానొక్క కూతురికి పేరు పెట్టటమే.

'మా రాజు జ్ఞాపకార్థం దీనికి రాజేశ్వరి అని పేరుపెడతాను' అని భర్త అంటే, అనూరాధ వద్దంది,

బ్రతిమాలింది, భయపెట్టింది, కోప గించుకుంది, భంగపడింది.

భర్త ఆమె మాట వినలేదు.

అందుకే అనూరాధ కూతురుని ఎప్పుడూ పేరు పెట్టి పిలవదు. "అమ్మాయీ" అనే పిలుస్తుంది

అది గుర్తుకొచ్చి "ఛీ... పాడు పేరు. ఆ పేరువిన్నా పాపమే" అనుకుంది.

ఆలోచనలతో మునిగిపోయిన ఆమె చేతిలోని ఉత్తరం గాలికెగిరి కిందపడింది.

అనూరాధవంగి ఆ ఉత్తరాన్ని అందుకుంటూ విసుక్కుంది.

"ఇందులో ఏం వ్రాశాడో ఆ దుర్మార్గుడు" అనుకుంటూ కళ్ళ జోడు సవరించుకుని చదివింది.

"శీనూ,



చెప్పకుండా ఊరినుంచి వెళ్ళిపో తున్నందుకు నువ్వు బాధపడతావని తెలుసు. అందుకు క్షమించాలి. నేను బ్రతికున్నంతకాలం నా ఉనికి నీకు తెలియనివ్వను. చావు కబురు మాత్రం నీకు తప్పక అందేటట్లు చూస్తాను. ఇక ఈ ఉత్తరంలో నేను వ్రాయబోయే విషయం నువ్వు బ్రతి కున్నంతకాలం నీలోనే ఉంచుకుంటా నని, నీ భార్యకి తెలియనివ్వనని నాకు మాట ఇచ్చినట్లుగా భావించి చదువు.

నీకు తెలియదేమో. నేనూ రాధా ఒకానొకరోజుల్లో ప్రేమించు కున్నాం. పెద్దలు మా వివాహానికి అనుమతించకపోతే, అనూరాధ నిన్ను చేసుకుంది. అనూరాధే నీ భార్య అని మీ ఇంటికి వచ్చేదాకా నాకు తెలియదు. తెలిస్తే వచ్చే వాడినిగాను. ఆడవాళ్ళు త్త సెంటి మెంటల్ ఫూల్స్ అపాత్రమైన విషయాలకు ప్రాముఖ్యతనిచ్చి జీవి తాన్ని విషాదం చేసుకుంటారు. అనూరాధ నన్ను మరిచిపోలేదని, పాతజీవితాన్ని మరచిపోలేక, కొత్త జీవితాన్ని కాదనలేక సంఘర్షణలో నలిగిపోతుండటం చూశాను.

మైడియర్ శీనూ, దానికి ఒకటే మందు.

అప్పటిదాకా 'దేవదాసూ, మజ్నూలాగా ఆమె మనోవీధిలో మెదిలే రాజారావు దుష్టుడు, దుందుభి, దుశ్శాసనుడు అయిపో వాలి. అందుకే ఆ రోజున నువ్వు లేనప్పుడు మీ ఆవిడ దగ్గిర నేను ఒక చిన్నసైజు విలనులాగా ప్రవర్తిం చాల్సి వచ్చింది.

ఎవరైనా తనను నిర్లక్ష్యంచేసి, లోకువ కడితే ఆడవాని అహందెబ్బ తింటుంది. ఆ పని చేసిన మగవాడిని ఆమె ఎన్నటికీ క్షమించలేదు. అదే నేను చేసింది. అందుకే అనూరాధ నన్ను ఇకపై జీవితాంతం ద్వేషి స్తుంది. నీకు నిజమైన భార్య దొరుకు తుంది అదే నాకు కావలసింది! అందుకే వెళ్ళిపోతున్నాను.

నా చావుకబురు విన్నపుడు మాత్రం ఈ రెండు మాటలు నన్ను గురించి అనుకో.

ఇల్లు శుభ్రంగా వుండాలంటే ఇంట్లో ఒక చెత్తకాగితాల బుట్ట, మాసిన బట్టలపెట్టె ఎంతఅవసరమో కొందరి జీవితాలు గందరగోళం లేకుండా ఉండాలంటే ఆ సంఘర్షణ ఇంకొకరు భరించటమూ అవసరమే. అందుకని—

అనురాగానికన్నా జీవితంలో ధర్మం ముఖ్యమని విలనయ్యాడు హీరో రాజారావు.

శాలాంగ్ మైడియర్

రాజు

పి.ఎస్.: ఇంట్లో వేస్టుపేపర్ బాస్కెట్ చూసినప్పుడల్లా నన్ను గుర్తుకు తెచ్చుకో."

ఉత్తరం పూర్తిగా చదివిన అనూరాధ నిశ్చేష్ట అయింది.

□□□



ఓ అందమైన అమ్మాయిని - ఇంటర్వ్యూ అధికారి ఇలా ప్రశ్నించాడు:

'ఆడవాళ్ళకి అందం ఎందుకు ఉపయోగిస్తుంది?'

'ఉద్యోగాలు సులువుగా రావడానికి'

'గుడ్. నీ ఖరీదెంత?'

'రెండు చెప్పుదెబ్బలు'

'వెరీగుడ్. నే అడగబోయే మూడవ ప్రశ్న ఏమిటో చెప్పు?'

'ఎక్స్క్యూజ్ మి, ఇప్పుడు మీరడిగినది మూడవ ప్రశ్నే.'

'వెరీ వెరీ గుడ్......'

* *

ఓ హాస్య రచయిత తన జీవిత వేదాంతాన్ని ఇలా క్లుప్తీకరించాడు:

'జీవితంలో ఎన్ని నిరాశ లెదురైనా నవ్వడం చేతనవుతే ఎలాగో ఏడవచ్చు.'

* *

లైటు లేకుండా సైకిల్‌పై వెడుతున్న కాలేజీ స్టూడెంటుని పోలీసు ఆపుచేసి 'లైటేది?' అన్నాడు.

అప్పుడా స్టూడెంటు 'కనబట్టంలా?' అన్నాడు నోట్లో వెలుగుతూన్న సిగరెట్టు చూపించి.

♦ ♦

'నిన్న మన ఎదురింటి సీత నాతో మాట్లాడిందోచ్..'

'నిజంగా?'

'కాలేజీకి వెడుతోంది ... నేనూ కాలే వెళ్లాను ... ఓసారి వెనక్కి తిరిగి "కుక్కలా వెనకాలే వస్తావేం?" అంది'

—సోమిన శివరామప్రసాద్,
రాజమండ్రి.

♦ ♦

ఇద్దరు స్నేహితులు మాట్లాడుకుంటున్నారు.

'ఇరవై ఏళ్ళు నేను మా ఆవిడ సుఖంగా, సంతోషంగా గడిపాం..'

'తరవాత?'

'ఏముంది, మా పెళ్ళయింది...'

* *

తల్లి కొడుక్కి అల్బం చూపిస్తోంది. అందమైన పాతికేళ్ళ యువకుడిని చూపుతూ 'మీ నాన్న' అంది.

'మరి మనతోవున్న బట్టతలాయన ఎవరు మరి?' సందేహం వెలిబుచ్చాడు సుపుత్రుడు.

—జి. సుధాకరరెడ్డి,
విజయవాడ.

□□□



జీవితం

బాలగంగాధర తిలక్

[గత సంచిక తరువాయి]

6

ఏడాది క్రిందటి నిర్మలకన్న ఈ నిర్మలలో సౌందర్యం ఇనుమడించింది. ఆమె కళ్ళల్లో వసంతాలు నవ్వుతున్నై. ఆమె శరీరపు కదలికలో, పెదవి వంపుల్లో జవ్వనపు బిగిబిగి గోచరిస్తుంది. గులాబీరంగు రిబ్బను కొసను కట్టిన వాల్జడ సౌఖ్యానికి సోపాన శ్రేణిలా ఉంది

కుటుంబయ్యకి దగ్గు ఎక్కువయింది. లక్ష్మమ్మ చాలా సంతోషంతో ఆదరించింది. మొదటిరోజున నిర్మల అంతగా మాట్లాడలేదు రావుతో. ఏదో పుస్తకం తీసుకొని మేడ మెట్లమీద కూర్చొని సాయంత్రం వరకూ చదువుతోంది. కొత్తగా నేర్చుకొన్న పాటలు పాడింది, తన యాక్టివిటీస్‌నుగురించి చెప్పింది. ఆమె చలాకీతనానికి గాంభీర్యము తోడై కొత్త అందాన్ని కూర్చింది.

మరుసటిరోజున లక్ష్మమ్మదగ్గర బిడియపడుతూ వివాహ ప్రసంగం తెచ్చాడు. లక్ష్మమ్మ యిలా అంది: 'నాయనా, నిన్నే అడుగుదామనుకొంటున్నాను. కావల్సినవాడవూ, ఉద్యోగస్థుడవూ, యింతకన్న నాకు కావల్సిందేమిటి? అమ్మాయికూడా యిష్టపడుతుందనే నా ఉద్దేశ్యం. ఎప్పుడా ప్రసంగం తెచ్చినా, 'నీకెందుకు, నీ గొడవకా' దంటుంది. అయినా ఈ వాళ అడిగి చూస్తాను. చదువు కొన్నవాడవు, దొరబల్లా మీరే ఆలోచించుకోండి.'

లక్ష్మమ్మ అడిగి చెప్పేవరకూ

రావు ఓర్పు పట్టలేకపోయాడు. మధ్యాహ్నం నాలుగు గంటలకి నిర్మలగదిలోకి వెళ్ళాడు. నిర్మల వీణ వాయిస్తోంది.

"నిర్మలా!"

"ఊఁ!"

"నీతో ఒక విషయం మాట్లాడాలి."

"చెప్పండి"

"ఇక్కడ కాదు – తోటలో!"

ఆమె విశాలమైన కళ్ళ నెత్తి రావు కళ్ళల్లోకి చూసింది. ఆమె బుగ్గ లెఱ్ఱపడ్డాయి. కాని ఏమీ తెలియనట్టు "అలాగే" అంది.

తోటలో మామిడిచెట్టు క్రింద నిల్చుని ఆమె నడిగాడు, ఆమె చేతిని తన చేత్తో పట్టుకొని. ప్రకృతి పవిత్రమైన గంభీరత దాల్చింది. పచ్చని చేలు ఎండలో మెరుస్తున్నాయి. ఆవేశం రావు గొంతులో "జలజలించింది."

"నిర్మలా! నేను చెప్పబోయే విషయం నీకు తెలిసే ఉంటుంది. నేను తలిదండ్రులు లేనివాణ్ణి. స్వశక్తిచేత యీ స్థితిలోకి వచ్చాను. నాకు నూటపాతిక రూపాయల జీతము, మేనత్తరాసియిచ్చిన పాతిక ఎకరాలు నా ఆస్తి… …నాకు జీవితంలో ("జీవితం" అని ఉచ్చరించినపుడు అతని గొంతు వణికింది. అతని బ్రతుకు తన ఎదురుగా నిల్చొని నవ్వినట్టనిపించింది.) ఏ కోర్కె లేదు–ఒకటి తప్ప. నా కష్టసుఖాల్ని పంచుకొందుకు, నా ప్రేమకు తిరిగి ప్రేమ యివ్వటానికి, నా యింట్లో ఒక దేవత-ఒక చిరునవ్వు – ఒక స్త్రీ…(అతని గొంతు తిరిగి వణికింది.) నిన్ను ప్రేమిస్తున్నాను నిర్మలా! నీ ప్రేమ అమూల్యం. నిన్ను పెళ్ళిచేసుకోవాలని నాకోరిక. నీతల్లి ఇష్టపడింది. నువ్వు, నువ్వు… ఒప్పుకోవాలి అంతే."

నిర్మల ఒకమారు రావు కేసి చూసి రెప్పలు కిందకి వాల్చింది. రావు ఆమె చేతిని నొక్కుతూ, "చెప్పు నిర్మలా!" అన్నాడు. ఆమె తిరిగి అతని కేసి చూసి రెప్పలు వాల్చింది. ఆ మౌనం చిరుమంటలా రావుగుండెలో సెగల్ని జల్లుతోంది. తిరిగి అడిగాడు రావు. స్ఫుటంగా, మృదువుగా నిర్మల యిలా అంది :

"మీరు వేరొక విధంగా తలిస్తే నేను చెప్పలేను. నాకు మీ యెడ విముఖభావంలేదు. ఈ ఏడాదిలో నా ఉద్దేశ్యాలు మారిపోయినై. కళకి, సంఘానికి సేవచేయటానికి నేను కంకణం కట్టుకొన్నాను. నాకు పెళ్ళి చేసుకొనే ఉద్దేశ్యం ఏమీ లేదు. మీకు కష్టం కలిగిస్తే క్షమించండి. కాని యిది నిశ్చయం."

రావు ఆమెచేతిని వదిలివేశాడు. కళ్ళమ్మట పొర్లివచ్చే నీళ్లు, పగిలిపోయే గుండెకనపడకుండా, వెనక్కి తిరిగి, మొహం చేతుల్లో దాచుకు చరచరా వెళ్ళిపోతూాడు. "రావూ, రావూ" అని పిలుస్తున్న నిర్మల కేక అతను వినిపించుకోలేదు. నిర్మల యింటికి వెళ్ళింది; రావు కన్పడలేదు. "అర్జంటు పని అంటూ వెంక



ట్రావు యీ బండికి వెళ్ళిపోయాడమ్మాయి!" అంది లక్ష్మమ్మ. నిర్మల జాలితో నిట్టూర్చింది.

7

వెంకట్రావు కొన్నాళ్ళు వీధిలోకి వెళ్ళలేదు. నిర్మలఫొటో శంకరాని కిచ్చేశాడు. ఒక్కడూ ఆకాశంకేసి చూస్తూండేవాడు—మబ్బులు, నక్షత్రాలు, చీకటి, వెలుగు, సంధ్య, అన్నీ ఆ తెరమీద నాటకమాడుతూ దేవి ఈ ఏకాంత ప్రేక్షకుడికో[illegible]

రోజులూ, వారాలూ నెలలూ గడచినై. వెంకట్రావు [illegible] కి వెళ్ళటం మొదలెట్టాడు. [illegible] వారి కంట్రాక్టరుతో రోజూ [illegible] గంట బాతాఖానీ, రెండుగంట[illegible] పేక ఆడేవాడు. సాయంత్రం [illegible] క్లబ్బుకి

వెళ్ళి నలుగురితోనూ కలిసికూర్చొనేవాడు. కాని 'చాలా మితభాషి అయాడురా రావు' అనేవారు స్నేహితులు. యుద్ధాన్ని గురించీ, ఆరోగ్యశాస్త్రాన్ని గురించీ, టెన్నిస్‌ను గురించీ అందరూ చెప్పుకొనే కబుర్లు విని, ఆలస్యంగా ఒక్కడూ చీకట్లో యింటికి వెళ్ళేవాడు. 'బాబుగారు అలసిపోయారు' అంటూ కన్నయ్య ఎదురుగా వచ్చేవాడు.

ఏడాది గడచింది. అతనిలో ఒకవిధమైన అసంతృప్తీ, అశ్రద్ధా పొడుకొనిపోయినై. ఆ రోజున తిన్న భోజనపదార్థాలు ఏవో కూడా చెప్పలేడు. శంకరంతో యిలా అనేవాడు: 'ఆ రోజులు వేరోయ్! కాని ఆమె నా జీవితాన్ని భస్మంచేసింది' ఎవరేనా తన వివాహ ప్రస్తావన తెస్తే, చిరునవ్వుతో యిలా అనేవాడు: 'ఇరవై ఆరేళ్ళుకదాండి — అదే, ఇరవైయేడు వచ్చింది. అంటే సగం జీవితం అయింది. ఆ సగమూ సుఖంగా యిలా పోనివ్వండి!' అతను ఉద్యోగం విషయంలో యిదివరకటికన్నా పట్టుదల ఎక్కువ చూపాడు. జీతంలో యింక్రిమెంటు వచ్చింది.

సాయంత్రం పొలాలగట్లనుంచి వస్తో వివిధ వృక్షాల్ని పరికించేవాడు. కన్నయ్య ఆ యేడాది వర్షాల్ని గురించీ, రైతుల కష్టాల్ని గురించీ చెప్పేవాడు. రోడ్డు మీదకు రాగానే 'ఓహో! యింజనీరుగారా! నమస్కారం' అని పలకరిస్తారు ఒకరు.

'కనపడటం మానేశారేం' అంటాడు రావు.

'మా చిన్నవెధవకి ఒంట్లో బాగాలేదు. అదీ గాక మా అమ్మాయి పురుడు కొచ్చింది.'

'అలాగా?'

'మా రోడ్డు విషయం మీరు కొద్దిగా దయ ఉంచాలి.'

'ఏం రోడ్డండీ! గవర్నమెంటుకాదాయం తగ్గిపోతోంది ఈ డిస్ట్రిక్టు బోర్డు వచ్చాక మరీ అధ్వాన్నం అయిపోయింది' అంటూ చిన్నగా దగ్గుతాడు రావు.

'మరేనండీ! ఈ మున్సిపాలిటీలు— 'అమ్మిరాజు' ఛైర్మను అయాక దరిద్రమే పట్టుకొంది. 'ఓ' అంటే 'న' రాదు, డబ్బు గుప్పేసి పదవి సంపాదించాడు.'

'కలికాలం!'

'చూడండి ఈ మురికికాల్వలూ... అబ్బ వెధవ దోమలూ, వెధవ యిదీన్ని' అంటాడు ఆ పెద్దమనిషి.

అక్కణ్ణుంచి తిన్నగా యింటికి వెళ్తాడు రావు. కొత్త మిత్రుడు యాజులు యం. యస్ సి వస్తాడు. తెలివైనవాడూ, మంచివాడూ కాని, అహంభావపు పాలుఎక్కువ. నోబుల్ ప్రయిజు తనకి ఎప్పుడో వస్తుందనే నమ్మకం-తను ముందుచేయబోయే రిసెర్చికి. తర్వాత భోజనం, ఆఫీసు కాగితాలు చూసుకోవటమూ, కిటికీలోంచి విశాలమైన బయలు చూడటమూ. కన్నయ్య 'పెళ్ళాంమీద బెంగపుట్టింది, సెలవిప్పించండి'

అంటాడు. ఆ నక్షత్రాలు ఒక్కొక్కటే రాలిపోతే, యింజనీర్లు ఆకాశానికి రోడ్డువేస్తే, దెయ్యాలు తన్ని ఏవ్ చేస్తే—ఇలా ఆలోచించుకుంటూ భయంతో నిద్రపోతాడు. ఉదయం తను పక్కమీదనుంచి లేవకుండానే దాసీది రావటం, అంట్లు చప్పుడు చెయ్యటం, కన్నయ్య దానితో సరసాలాడటం వింటాడు. లేచి స్నానం చేసి డ్రెస్సువేసుకొంటాడు. తిరిగి ఆఫీసు పని. సాల్యూటు చేసేవాళ్ళకి సాల్యూటు చేస్తూ, తీవిలో చిరునవ్వు మిళితం చేస్తూ మాట్లాడాలి. అందరూ 'ఇంజనీరుగారు' అంటూ గౌరవిస్తారు; అంతేకాని, ఒక పద్దెనిమిదేళ్ళ పిల్ల చేతిలో వోడిపోయాడనీ, ఆమె వెనకాల ఉన్మాదుడులా తిరిగాడనీ ఎవరికి తెలుసు? సాయంత్రం క్లబ్బుకి! తిరిగి యుద్ధాన్ని గురించీ, రేడియోని గురించీ కబుర్లు వసంతరావు తన రసికత్వాన్ని గురించి సగర్వంగా విశదపరుస్తాడు ప్లీడరు రామచంద్రరావు పార్కులో మొక్కల్నిగురించీ, శ్రీనివాసరావు రేడియో రిపెయిర్ల గురించీ లెక్చర్లిస్తారు. అమ్మిరాజు తను సన్నంగా ఉండేటందుకు మార్గాలు చెప్పమంటాడు. చివరికి అందరూ పేకాడుతారు. తనకి ఎప్పుడూ నష్టం వస్తుంది. రాత్రి ఒక్కడూ యింటికి వెళ్తాడు కన్నయ్య 'బాబుగారు అలసిపోయారు' అంటూ, చీకటి నవ్వుతో ఎదురౌతాడు.

ఎధవకలలు వచ్చిన పెద్ద నిద్ర

'మీకేవైనా సమస్యలున్నాయా? ఒంటరిగా కూర్చొని తీరిగ్గా ఆలోచించుకోండి సమస్యలు పరిష్కారమైపోయే మార్గం గోచరిస్తుంది' అన్నాడు ఒక ఆసామీ, మిత్రుడితో.

'అసలు ఒంటరిగా కూర్చొనే అవకాశం దొరకదే!'

'దానికేముంది? నీ సమస్యలన్నీ నీ దగ్గర కొచ్చిన వాళ్ళందరి దగ్గర ఏకరువు పెడితేసరి. త్వరలో ఏకాంతం సమకూరుతుంది.'

లాగ, మూడేళ్ళూ గడచిపోయాయి. వెంకట్రావుకి జీతం రెండువందల దాకా పెరిగింది అతనికి ప్రపంచంలో అనందించ వలసిన వస్తువూ, విచారించవలసిన విషయమూ ఏమీ లేవు. నిన్నటి తనదృష్టిలో అన్నీ ఒకటే! ఏడుపూ, నవ్వూ లేనివాడు తనొక్కడే అనుకొన్నాడు.

ఆ రోజున ఒక్కడూ సిగరెట్ కాలుస్తూ యీజీఛైరులో పడుకొని ఆలోచిస్తున్నాడు, దేవుడు కూడా లేడా అని తను చాలా పెద్దవాడైపోయినట్టూ, వృద్ధాప్యాన్ని సమీపిస్తున్నట్టూ తలచుకొని ఉలిక్కిపడ్డాడు. కన్నయ్య ఒక్కంగంతేసి 'అమ్మాయిగారు వచ్చేరండి' అన్నాడు.

'ఎవరురా?'

"అమ్మాయిగారు— నర్సాపురం అమ్మాయిగారు."

తీనంగా, ధైర్యంగా చూస్తో, నిర్మల గుమ్మం ముందు నుంచొంది. రావు ఆమె ఆకస్మాత్ ఆగమనానికి తెల్లబోయాడు. ఏమనాలో తెలియక కంగారు పడ్డాడు.

"నేను రావటం మీకు చాలా ఆశ్చర్యంగా ఉంటుంది" అంది నిర్మల, పేలవంగా నవ్వుతో. వెంకట్రావు తేరుకొని లేచి ఆమెని ఆహ్వానించాడు. అతను చాలా నెమ్మదిగా మాట్లాడాడు :

"కుటుంబయ్యగారు క్షేమమా ?"

"పోయారు – ఏడాది అయింది."

"పాపం !" అన్నాడు రావు. నిర్మలలో పూర్వపు చలాకీతనమూ, అయస్కాంతంలా ఆకర్షించే పెర్సనాలిటీ అంతలేదు. ఆమెలో వెలిగే సహజమైన నవ్వూ లేదు. ఆ నవ్వు యొక్క మాసిపోయిన ఛాయలు మాత్రం కన్పడుతున్నాయి.

"మీఅమ్మగారేం చేస్తున్నారు?"


"కాశీ వెళ్ళిపోయింది కోపంవచ్చి."

"ఏం—నిర్మలా ?"

"నేను పెళ్ళి చేసుకోనన్నానని."

తర్వాత మౌనం. గతసంగతులు జ్ఞప్తికి వచ్చి, ఇద్దర్నీ కలచివేశాయి. వెంకట్రావు కిటికీలోంచి ఆకాశంకేసి చూస్తున్నాడు; పిల్లమబ్బులు గతులేస్తున్నాయి, లేగదూడలలాగ. ఇంతకీ ఆమె ఎందుకొచ్చింది ?

"ఈ గది అంతా యింత చిందరవందరగా ఉందేం ? ఆడదిక్కులేందే మగవాళ్ళు యిలాగే ఉంటారు" అంది నిర్మల. ఆ పలుకుల్లో ఆశా, ఆత్రుతా, పరితాపమూ గుడి గంటల్లా శబ్దించాయి. తొమ్మిది గంటలకి రావు ఆఫీసుకు వెళ్ళిపోయాడు నిర్మల రావు యింట్లోనే ఆగిపోయింది. సిగరెట్టు పీకలూ, పుస్తకాలూ, ఖాళీ అగ్గిపెట్టెలూ, పాతబట్టలూ—గది అంతా అసహ్యంగా వుంది. తిరిగి రావు



సాయంత్రం యింటికి వచ్చాడు. గుమ్మానికెదురుగా నిర్మల నవ్వుతో నుంచొంది ఇదివరకటికన్నా ఆమె పెద్దదయింది. ఆ సమయంలో తిరిగి నిర్మలలో పూర్వపు నవ్వూ, కళ్ళల్లో వెలుగూ కలిగినై. రావు యిల్లంతా చూశాడు. అన్నీ చక్కగా అమర్చబడి ఉన్నాయి.

"నిర్మలా – నువ్వేనా?" అన్నాడు రావు.

"ఏం, బాగాలేదా" అంది నిర్మల. వెంకట్రావు మాట్లాడలేదు. నిర్మలకి కష్టమనిపించింది.

"కోపమా మీకు, స్వతంత్రం తీసుకున్నానని ?"

"కాదు నిర్మలా ! చాలా సంతోషం. కాని నా మనస్సుకి పూర్వపు గది శాంతి, సంతోషమూ ఇస్తుంది."

నిర్మల వులిక్కిపడింది. అతనిలో ఎంత ఖేదం కలిగిందో, మానసికంగా ! రావుదగ్గరగా కుర్చీలో కూర్చుని తన్నిగురించి యిలా చెప్పింది : "నేను యితర యాక్టివిటీస్ మానేశాను, నాకు విసుగెత్తింది. అవన్నీ భ్రమలు...అందరూ విమర్శించేవారే ! నాకున్న ఉత్సాహం ఇతర్లకి లేదు. నా కోసమా అనిపించింది. అవన్నీ భ్రమలు ... రావూ. లేకపోతే స్త్రీలకు పబ్లిక్ జీవితం ఏమిటి ?"

"నిజం" అన్నాడు రావు.

"నిజం – ఈమూడేళ్ళ జీవితమూ – ఎంత వృధా చేశానో !"

రావు ఆమె కేసి చూశాడు. ఆమెలో పశ్చాత్తాపమో, బాధో వ్యక్తమవుతోంది.

ఇద్దరూ కలిసి షికారు వెళ్లారు పొలాలగట్లకి. రావు తన ఆఫీసు పనుల్ని గురించి ముకసరిగా చెప్పాడు. ఒకరి హృదయంలో తళుకొత్తే ఆశా, నిరాశా, మరొకరి హృదయంలో మోడుపోయిన చైతన్యమూ నీడలలా, దెయ్యాలలా కదుల్తున్నాయి. ఎక్కువసేపు ఇద్దరూ మౌనంగానే ఉన్నారు.

ఇద్దరూ క్యారేజీ భోజనం చేశారు. మధ్య గదిలో రావూ, ప్రక్క గదిలో నిర్మలా పడుకొన్నారు. వరండాలో కన్నయ్య గుర్రుపట్టుతున్నాడు.

పంద్రెండు గంటలయింది. రావు పడుకొన్నదీ లేందీ చూద్దామని నిర్మల రావుగదిలోకి వచ్చింది. రావు రెండు చేతులతో తలని పట్టుకొని కుర్చీలో కూర్చొన్నాడు.

'మీరు నిద్రపోలేదా?' అంది నిర్మల.

'... ...'

'జబ్బు చేసిందా?'

'నాకు అలవాటే!'

'తల అల్లా పట్టుకున్నారేం!' నిర్మల అతన్ని సమీపించి 'అతని కణతల్ని తాకింది. అవి కొట్టుకుంటున్నాయి,

'తలనొప్పి ఎక్కువగా ఉందా?'

'అంత ఎక్కువలేదు.'

నిర్మల తన గదిలోకి వెళ్ళి అమృతాంజనంతో తిరిగివచ్చింది. "చేతులు తియ్యండి, రాస్తాను. నాకు చెప్ప లేదేం? ఎందుకు వొక్కరూ ఇలా బాధపడతారు?" అని అతని కణతల్ని తాకబోయింది. వెంకట్రావు ఆమెని వారించి, ఆమె చేతిలోని డబ్బాతీసి బల్లమీద పెట్టాడు. ఆమె అక్కడ కొంతసేపు నుంచొంది. ఆ మౌనం ఆమెకి దుర్భరమైంది. తడబడుతూ ప్రక్కగదిలోకి వెళ్ళి కూలబడింది. ఒక నిముషానికి వెంకట్రావుకు వెక్కి వెక్కి యేడుపు వినపడింది. అమె గదిలోకి వెళ్లి "ఛ! నిర్మలా, ఏడుస్తున్నావా?" అన్నాడు.

"నేను రావటం మీకింత కష్టంగా ఉందని నాకు తెలియదు. నేను మీకు అవసర సమయంలో సేవ చేయకూడదా? మన పూర్వ స్నేహం మరచిపోయారా!" ఆమె యింకా తలగడలో మొహం కప్పుకొని ఏడుస్తో ఉంది.

"లేదు నిర్మలా ...' అతని గొంతుక బరువెక్కింది. "నేనేం చేస్తున్నదీ నాకొకొక్కసారి తెలియదు. నీరాక నాకు కష్టం కలిగించ లేదు. నీకు కష్టం కలిగిస్తే క్షమించు. నా యింటికి వచ్చిన స్నేహితురాలివి, అతిథివి. నీ సౌఖ్యం చూడవలసిన విధి నాకుంది" నిర్మల తల పైకెత్తింది.

"మీకు నేను అంతేనా? అతిథినేనా? మీ జీవితానికి ఇంక ఎందుకూ ఉపయోగపడలేనా?" ఆమె గొంతు గద్గదికమయింది.

"నాకు జీవితమనేది వుంటే అది జరిగిపోయింది. నాకు కోరికలులేవు. అందు మూలాన్న ఒకరి సాహాయ్యం అవసరమని అనుకోను. నాకు రొటీన్ అలవాటయింది. జీతమిస్తారు పనిచేస్తాను - అన్నింట్లోనూ అంతే"

"ఇంక ఎందుకూ ఉపయోగపడలేనా మీ జీవితానికి? చెప్పండి, చెప్పండి" ఆమె ఆవ్యాకులతతో అడిగింది.

"నిర్మలా, ఒకరికొకరు పనికివస్తారనుకోవటం పిచ్చిపూహ. పడుకో నిర్మలా! తలితండ్రులు లేరు నీకు. ఈ గృహంలో ఎవరికేనా నీడనిస్తాను, నాకు సంపాదనాశక్తి ఉన్నంత వరకు. అలా యిచ్చేందుకు భగవంతుణ్ణి శక్తి యిమ్మని ప్రార్థిస్తాను."

'ఎంత మారిపోయారు మీరు!' అంది నిర్మల, కళ్ళు ఒత్తుకుంటూ. ఆమె తల ఎత్తేటప్పటికి రావు అక్కడ లేడు చలిగాలి తలుపు సందుల్లోంచి కీచుమంటూ వీచింది.

ఉదయం రావు లేవగానే కన్నయ్య వచ్చి "అమ్మాయిగారు వెళ్లిపోయారు బాబూ! మీతో చెప్పమన్నారు" అన్నాడు.

"ఎంతసేపయింది?"

"ఇప్పుడే - వీధిలో ఉంటారు."

వెంకట్రావు గుమ్మంలోకి వెళ్లాడు. ఫర్లాంగు దూరంలో కారు

దుమ్ములో నిర్మల నడిచి వెళ్లిపోతోంది - స్టేషనుకి!

8

ఎనిమిది నెలలు గడిచాయి. ప్రభుత్వం వెంకట్రావుని ఫారెస్టు రేంజికి బదిలీ చేశారు. ఒక రోజున కన్నయ్యతో, సామానుతో బయల్దేరాడు రావు.

ఆ వూళ్ళో మూడువందల గడప కన్న ఎక్కువ జనాభా లేదు. రెండు మైళ్ళ దూరంలో అరణ్యం కన్పడుతుంది. ఆ వూళ్ళో ఒక పెంకుటిల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు రావు. కాని అక్కడ అతనికి భోజన సదుపాయంలేదు. ఒక నెల జరిగాక శంకరానికి ఉత్తరం రాశాడు వంటలక్కనిగాని, బ్రాహ్మణనిగాని పంపమని. పదిహేను రోజుల్లో కేశాలున్న విధవ సుందరమ్మ వచ్చి పొయ్యి రాజేసింది.

ఆ వూళ్ళో వాళ్ళకీ, ప్రక్క గ్రామాల వాళ్ళకీ యింజనీరుగారు ప్రత్యక్షదైవం. పులితోళ్ళూ, దుప్పి చర్మం, కొమ్ములూ, ఆలోనేరేడి పళ్ళూ, ఇంకా వివిధములైన ఫల సముదాయాలూ ప్రతీవారం వెంకట్రావుకి భక్తి శ్రద్ధలతో అర్పించేవారు. వాళ్ళ ఆచార వ్యవహారాలు చిత్రంగా ఉన్నై. వాళ్ళు మాట్లాడే తెలుగు ఒక్కొక్కసారి అర్థమయ్యేది కాదు. పట్టణాల్లో ఉండే కృత్రిమత్వం, అతి తెలివీ అక్కడలేవు. కష్టపడిపని చేసుకుంటారు, అనుభవిస్తారు.

> పేరుపొందిన లాయరుగారబ్బాయి లా చదివి క్రొత్తగా ప్రాక్టీస్ పెట్టాడు.
>
> "ఎలా వుంది మీ అబ్బాయి ప్రాక్టీసు" అని పలకరించాడు పెద్దాయన్ని, ఓ స్నేహితుడు: "ఓ అయిదువందలన్నా కిడుతోందా?"
>
> "ఆ, కిడుతున్నదే ఎటొచ్చీ యాభై రూపాయలు నగదు రూపంలో వస్తోంది; మిగతాది ఆ కేసుల్లో సలహాల రూపంలో వస్తోంది" అని పెద్ద ప్లీడరుగారి సమాధానం

పార్టీ ప్రభుత్వాలూ, యుద్ధాలూ, ప్రజాస్వామ్యవాదమూ, సామ్యవాదమూ, ఆత్మహత్యలూ, రోడ్డు దుమ్మూ, సినీమాలూ, ప్రేమలూ, విరహాలూ వారిని బాధించవు. కడుపునిండా తింటారు, నెలవిరార నవ్వుతారు! సలహాలకి వెంకట్రావు దగ్గరకే వస్తారు.

నాలుగు నెలల్లో అతనిలో మార్పు కలిగింది. అతని కళ్ళల్లో జాలి గోచరించేది అతని జీవితం కరగి కళ్ళల్లోకి వచ్చిందా అనిపిస్తుంది. తిరిగి ఇదివరకటి రొటీన - జడత్వమూ!

ఆ వూరినీరు పడక అతనికి పెద్ద జబ్బు చేసింది. దగ్గరలో డాక్టరు ఎవరూ లేదు. ఊళ్ళో ఉన్న భిషగ్వరుడు వెంకయ్య మందిచ్చాడు. రెండు రోజులు స్మృతి లేకుండా

పడిపోయాడు. రాత్రింబవళ్ళు సుందరమ్మ, ఏమరక, కి ఉపచారం చేసింది. ఆమె ఓర్మిం ఆశ్చర్య పడ్డాడు. ఆమెతో 'మీ ఋణం ఎలా తీర్చుకోను' అన్నాడు. నెల్లాళ్ళకి జబ్బు తగ్గింది. చెంచయ్యకి యాభైరూపాయ లిచ్చాడు. అత డబ్బు అతనెపడూ కళ్ళతో చూడలేదు జీవితాంతం వరకూ, తన వైద్యశక్తిని గురించీ వెంకట్రావు దాతృత్వాన్ని గురించీ చెప్పుకొనేవాడు. రెండు నెలలో పూర్వపు జవసత్తులు సంపాదించాడు వెంకట్రావు

శంకరానికి ఉత్తరం రాశాడు కొన్ని చీరలూ, సామానులూ పంపమని. సుందరమ్మ ఆ విలువగల చీరలన్నీ చూసి 'నాకెందుకండీ ఇవన్నీ' అంది. 'కట్టుకోండి తప్పేముంది.' అన్నాడు రావు. సుందరమ్మ అవి ధరించటానికి భయపడేది.

ఆ రోజున వెంకట్రావు అర్ధరాత్రి ఉలిక్కిపడి లేచాడు. వెన్నెల విరగ కాస్తోంది 'శవం మీద కప్పిన తెల్ల బట్ట'లా ఉందనుకొన్నాడు. ఇంతలో ప్రక్క గదిలోంచి సన్నగా ఏడ్పు వినపడింది. నిర్మల జ్ఞప్తికి వచ్చింది ఆ గదిలోకి వెళ్ళాడు. కిటికీలో కూర్చొని బయలు చూస్తోంది సుందరమ్మ. ఆమె నల్లని పొడుగాటి జుట్టు ఆమె ఒదల్ని కప్పింది. వెన్నెల వెలుగులో ఆమె వదనం మీద నీటిబొట్లు చూశాడు రావు.

'ఏడుస్తున్నారా?' అన్నాడు.

'లేదు' అంటూ, ఆమె సిగ్గుతో తడబడుతో లేచింది.

'ఎందు కేడవటం? — గతాన్ని మరచిపోండి' అన్నాడు దయతో

'నాకు గతమనేది లేదు, జీవితమే లేదు నన్ను ఆదరించేవారు లేరు. 'నా' అన్నవారు లేరు. నేను బాల్యంలోనే విధవ నయాను.' ఆమె ఏడుస్తోంది చిన్నపిల్లలా.

'ఏం' అన్నాడు వెంకట్రావు. చీకట్లో నడిచేవాడికి దీపంకన్న మరొకపాంథుడు ఎక్కువ సహాయంగా ఉంటాడు అందుకే వెంకట్రావుకి క్యూరియాసిటీ ఎక్కువయింది.

'నేను ఒక విధవకి జన్మించాను. నా తల్లి నన్ను అమ్మేసింది, హోటలు పెట్టుకొన్న వెంకమ్మకి. కాని దాని ప్రియుడు ఒప్పుకోలేదు. ఆ వెంకమ్మ నన్ను పిల్లలు లేని తంత్రికి అమ్మింది. అతను ఎనిమిదేళ్ళ దాకా విద్యాబుద్ధులు చెప్పించి, ఒకడికి పెళ్ళిచేశాడు. ఆ తర్వాత చచ్చిపోయారు పెంపుడుతండ్రీ, మొగుడూన్నూ— ఒకే ఏడాదిలో. ఆ తర్వాత ఒకరింట్లో పిల్లల నెత్తుకొనేదాన్ని. అక్కడ నాలుగేళ్ళు పనిచేసి మానేశాను. తిండిలేక ఒక రోజున ఒకడికి మానాన్ని అమ్మాను. అప్పట్నుంచీ, ఆ వూరు విడిచి నేటిదాకా వంటచేస్తున్నాను. మూడు సార్లు అమ్ముడుపోయాను!'

వెంకట్రావు హృదయం కరిగింది.

> మెడికల్ కాలేజీ అబ్బాయిలు బర్త్‌డేపార్టీలు వరసగా ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. నెలరోజులు తిరక్కముందే ఒక్కొక్కరికీ రెండో టర్న్ కూడా తిరుగుతూ వుండగా, ఒక నరసింహానికి అసలు పుట్టినరోజే రాలేదు.
>
> 'ఏం వోయ్; మరి నీ పార్టీ ఎప్పుడు?'
>
> 'నా బర్త్‌డే నాలుగేళ్ళకో సారిగాని రాదు' అన్నాడా నరసింహం.
>
> 'అలా వుండాలి, పీనాసితనం అంటే'
>
> 'నిజం, నేను ఫిబ్రవరి 29న పుట్టాను!'

జాలితో, ఆమె భుజంమీద చెయ్యివేశాడు ఆమె ఆశతో, కాంక్షతో చూసింది. వెంకట్రావు తెలియని కాంక్షచేత ప్రోత్సహింపబడి ఆమెని కవుగలించుకొన్నాడు.

నాటినుండీ, సుందరమ్మ అతనికి వంటలక్క, భార్య, ఆదరించే తల్లీన్నూ. ఆమెను 'మీరు' అనే పిలిచేవాడు.


ఒక ఏడాది గడిచాక, వెంకట్రావు, ఆమె కోరికమీద ఆమెని కాశీ పంపించాడు. రెండు నెలల్లో ఆమె తిరిగి వచ్చి కాశీ విశేషాలు చెపుతూ యిలా అంది: 'పావం,

నర్సాపురంనుంచి లక్ష్మమ్మ అనే అవిడ నాలుగేళ్ళనుంచి అక్కడ ఉంటోందిట! పోయింది, వారం క్రితం."


"అరెరె!" అన్నాడు వెంకట్రావు.

మూడేళ్ళు గడిచాయి. ఒకనాడు రావుకి ప్రభుత్వపు అర్డరు వచ్చింది. విప్పి చూశాడు; తనకు డిస్ట్రిక్టు యింజనీరు పదవి యిచ్చింది ప్రభుత్వం. ఆనందంతో, సుందరమ్మతో యిలా చెప్పాడు: "రెండు నెలల్లో మనం మన జిల్లా వెళ్ళిపోవచ్చు. అక్కడ సుఖంగా ఉంటుంది."

సుందరమ్మ కడుపుతో ఉంది. ఆమె గర్భవిచ్ఛిత్తి చేసుకోంటానంది. కాని రావు ఒప్పుకోలేదు.



"నా ప్రతిరూపాన్ని చంపుకోలేను. నాకు మూడువందల రూపాయల జీతం వస్తోంది. నా జీవితం, నా పేరు నాతో అంతమవకుండా ఒక కొడుకు కావాలి నాకు" అన్నాడు. ఈ మూడేళ్ళనుంచీ, వారి మధ్య జీవితం చాలా గౌరవంగా నడిచింది. ఒకరితో ఒకరు అట్టే మాట్లాడుకోరు. సుందరమ్మను 'మీరు' అనే పిలిచేవాడు. కాని ఆ రోజున సుందరమ్మ కొత్తమార్గం తొక్కింది "నన్ను మీరు మన్నిస్తే నేనిక్కడ ఉండలేను మీలో ఒక భాగంగా మెలగుదామనుకొంటూన్న నాకు, మీరే సర్వం అయిన నాకు—" ఆమె కళ్ళవెమ్మట నీటి బిందువులుపొర్లినై. వెంకట్రావు తెల్లపోయాడు. ఆమెమీద అతనికి జాలీ, దయా ఉన్నై. 'ప్రేమ' అనేది అతను మరచిపోయాడు, పాతిపెట్టేశాడు. ఒక్కొక్కసారి 'ప్రేమ' కల్ల అనీ, అది భక్తులకి పూనే ఆవేశంలా యువకులకి పూనుతుందని అనుకొనేవాడు. కుటుంబ సౌఖ్యానికి స్త్రీ పురుషుల మధ్య పరస్పరావగాహనా, అనురాగమూ కావాలనీ, ప్రేమ కవులకీ, రచయితలకీ వదలివెయ్యాలనీ అతని ఉద్దేశ్యం. అయినా, అతను ఏ విషయంలోనూ ఎక్కువ ఉత్సాహం తీసుకోలేదు. అతనిలోని శక్తులు మోడు బెంబాయి. తనకి స్త్రీన్నీ, కొడుకూ అవసరం. అదికాక సుందరమ్మఅంటే అతనికి 'సింపతీ' ఉంది అయినా, నవ్వుతో సుందరమ్మతో యిలా అన్నాడు. "నిన్ను మన్నించటంలేదు




సుందరమ్మా! అలవాటుచొప్పున అనుకుంటున్నాను. నీ సౌఖ్యం నా సౌఖ్యం". ఆ రోజునుంచీ 'నువ్వు' అనేవాడు. సుందరమ్మ ఆనందంతో పొంగిపోయింది. "ఆయన యింటికి వచ్చేటప్పటికి అబ్బాయి ఎదురుగా వెళ్ళి 'నాన్నా' అని పిలుస్తాడు. ఆయన అబ్బాయిని ముద్దెట్టుకుంటూ" రని ఆలోచిస్తోండేది.

విధి నల్లని పెదవులు వారి జీవితాన్ని ముద్దెట్టుకొన్నాయి. నెల్లాళ్ళకి, పురిటిగండంవచ్చి తల్లీ పిల్లా చనిపోయారు ఆ రోజున ఘోరున ఏడ్చాడు వెంకట్రావు. కాని తర్వాతరోజున మామూలు మనిషి అయాడు. నాటినుంచీ నవ్వుఅంటే అతనికి రోతపుట్టింది. కొన్నాళ్ళకు, కన్నయ్యతో, గోదావరిజిల్లాకు ప్రయాణం కట్టాడు

9

తిరిగి మూడేళ్ళవరకూ వెంకట్రావు జీవితం సాఫీగా సాగిపోయింది మోటుతనమూ, నిరాశా అతనిలో పాతుకుపోయినై. చూపు సరిగ్గా ఆనటంలేదు ఆరోగ్యం క్షీణించటం మొదలెట్టింది. జ్ఞాపకశక్తి తగ్గిపోయింది. ఆఫీసులో డవాల్ బంట్రోతుమీదా, యింట్లో కన్నయ్యమీదా విసుక్కోవటం, గొణుక్కోవటం ప్రారంభించాడు. ఆఫీసునుంచి వస్తూ, ఏదో చూసి అలాగే నిలబడిపోయేవాడు.

ఒక కంట్రాక్టులో ప్రభుత్వానికి యాభైవేలు నష్టం వచ్చింది. కంట్రాక్టరు రావు కళ్ళల్లో దుమ్ముపోసి, సొమ్ముఅంతా గుంజుకొని, తిరిగి



రావుమీదే కేసు పెట్టారు. రావు ప్లీడరునేనా పెట్టుకోలేదు. ప్రభుత్వం రావుని డిస్మిస్ చేసింది. పదివేల రూపాయలు రావు కాజేశాడని, అందుకుగాను అతనికున్న యిరవై ఎకరాల భూమిలో పది ఎకరాలు ప్రభుత్వం స్వాధీనపరచుకొంది. వెంకట్రావు ఏమీ బాధపడలేదు తన్నయ్యమాత్రం మానేశాడు, జీతం తగ్గించారనే నెపంమీద

వెంకట్రావు పది ఎకరాలూ అమ్మేశాడు, ఎనిమిదివేల రూపాయలికి. రెండువేలుపెట్టి ఒక పెంకుటిల్లు కొన్నాడు ఒక గ్రామంలో. ఒక కొత్త నౌకరుని పెట్టుకొన్నాడు. "ఇంత యిల్లెందుకు" అనుకునేవాడు. నౌకరుతో "నా యిల్లు కదరా!" అనేవాడు. ఒక బక్కపిల్లిని చేరదీసి దాన్ని పెంచమని నౌకరుకు అర్డరిచ్చాడు. కాగితాలు చిరిగిపోయిన భాగవతపుస్తకం తీసి ఆనందభైరవి రాగంలో చదివేవాడు.

వెంకట్రావుకి గుండెజబ్బు చేసింది. డాక్టర్లు మద్రాసు వెళ్ళమన్నారు. పదిహేనువందల రూపాయలు ఖర్చుపెట్టి మద్రాసులో ఒక ఏడాది ఉండి జబ్బు నయంచేసుకొన్నాడు. మద్రాసునుంచి వస్తో..తే ఒక దిక్కులేని పన్నెండేళ్ళ పిల్లను తనతో తీసుకువచ్చాడు. ఆమెకి "సుందరమ్మ" అని నామకరణం చేశాడు. ఒక గురువుని నియోగించి సంగీతం చెప్పించేవాడు ఆమె "తాతయ్యా" అని పిలుస్తోందేది రావుని.

రోజూ సాయంత్రం మాలగూడెం వెళ్ళేవాడు. ఆ పూటకు తిండిలేనివాళ్ళకి పావలా అర్ధా యిచ్చేవాడు. పొరుగింటి లచ్చన్నగారితో తన యింజనీరుగొడవలు చెప్తూండేవాడు. ఇలా రెండేళ్ళు గడిచాయి. అతనికి బ్యాంకులో రెండువేలు మాత్రం మిగిలినై.

ఒక పట్టుభద్రుణ్ణి వెదకి తీసుకువచ్చి, సుందరమ్మకి పెళ్ళిచేశాడు. వెయ్యిరూపాయలు కట్నం, అయిదువందలు ఖర్చులు చేశాడు. కన్నీళ్ళతో సుందరమ్మని అత్తవారింటికి పంపించాడు. "మాతో వచ్చెయ్యి తాతయ్యా" అని ఏడ్చింది. "ఇప్పుడు కాదు, ముందు వస్తానమ్మా" అన్నాడు. జీవితంలో ఒక అనాధ బాలిక నుద్ధరించానుగదా అని సంతృప్తి పడ్డాడు.

క్రమంగా అతని నిల్వసొమ్ము ఖర్చు అయిపోయింది. "చేతుల్లో శక్తి వున్నంతవరకూ సుందరమ్మ యింటికి వెళ్ళి వాళ్ళను బాధించను" అనుకొన్నాడు ఒక బియ్యపు కొట్టులో గుమాస్తాగా కుదిరాడు, యిరవై రూపాయల జీతానికి.

వెంకట్రావు శక్తిహీనుడై పోయాడు గడ్డం బాగా పెరిగింది. దగ్గు తిరిగి వస్తోంది, మనిషి వంగిపోయాడు. మాలపల్లెలో పిల్లలు హాస్యం చేసే..రు. కాని నవ్వలేకపోయేవాడు రావు.

మిట్టమధ్యాహ్నం. అందులో వేసవికాలం. యజమాని అజ్ఞప్రకారం వెంకట్రావు ఆయాసపడుతో, మూడుమైళ్ళ దూరంలో ఉన్న పొరుగూరు వెళ్ళుతున్నాడు. అతని పాదాలూ, తలా మాడిపోతున్నై. తన పూర్వ జీవితాన్ని తల్చుకొన్నాడు. ఎండిపోయిన గుండెలో ఏ మూల ఒక నీటిచుక్క ఉందో, అది కళ్ళల్లోంచి పెగుల్చుకువచ్చింది.

తిన్నగా పొరుగు గ్రామానికి వెళ్ళి, ఒక కొలనిలో నీళ్ళు తాగి, ఒక యింటి అరుగుమీద కూర్చొన్నాడు విశ్రాంతికోసం. నాలుగయిదేళ్ళ పిల్లాడు "బూచాడు" అంటూ యింట్లోకి వెళ్ళి ఏడవటం మొదలెట్టాడు. ఒక ముప్ఫై ఆరేళ్ళ స్త్రీ గుమ్మంనుంచి తొంగిచూసి "ఎవరు తాతా, ఏవూరు మీది" అంది. వెంకట్రావు కునుకుపాట్లు పడుతో "పక్కవూరే" అన్నాడు.

"ఏమైనా పిల్లలూ, మనుమలూనా తాతగారూ" అంది ఆవిడ, గుమ్మం దగ్గర అరచాటుగా నించొని. ఇంతలోకి, ఆ అయిదేళ్ళ పిల్లాడు వచ్చి "తాతయ్య" అంటూ వొళ్ళో కూర్చున్నాడు.

"నీ పేరేమిటి" అన్నాడు వెంకట్రావు.

"వెంకట్రావు" అన్నాడు ఆ పిల్లాడు.

"నా పేరూ వెంకట్రావే" అన్నాడు రావు

"అందుకే తాతయ్యావ్" అన్నాడు ఆ పిల్లాడు.

ఆ పిల్లాడు పేర్లు చెబుతున్నాడు. "అడిపేరు రామం, అడిపేరు లక్ష్మినారాయణ."

'నీ స్నేహితుల పేర్లా?' అన్నాడు వెంకట్రావు.

'ఊఁ! అమ్మ పేరు నిర్మల, అమ్మమ్మ పేరు లక్షిమమ్మ...' అన్నాడు పిల్లవాడు.

వెంకట్రావు గుండెలో శతఘ్ని పేలినట్లయింది. తల పైకెత్తి చూశాడు గుమ్మంవగ్గర ఉన్న స్త్రీని. చిక్కిపోయిన చెక్కిళ్ళూ, ఊడిపోయినజుట్టూ, మాసిన బట్టలూ— ఈమె నిర్మల, నిర్మలేనా? ఆమె ఏదో చెవుతోంది. 'ఆయన పోయారు తాతగారూ, మా అమ్మ రాసిచ్చిన పది ఎకరాలమీద బ్రతుకుతున్నామండి కష్టాలు వచ్చాక మన మేం చేస్తాం తాతగారూ!'

వెంకట్రావు వినిపించుకోలేదు ఆతృతతో 'కుటుంబయ్యగారుఏమవుతారమ్మా' అని అడిగాడు.

'మామయ్య అవుతాడు, మీరెలా ఎరుగుదురు? అయితే యింజనీరు వెంకట్రావుని ఎరుగుదురా -తాతగారూ!' అంది ఆవిడ. ఒకనాటి ప్రియురాలు తన్ను 'తాతగారు' అని పిల్చింది. భూమి గిర్రున తిరిగినట్టయింది. జారిపోయే గుండెను ఒకచేత్తో పట్టుకొని, ఒకచేత్తో మొహం కప్పుకొని అక్కడనుంచి తిన్నగా యింటివైపు వెళ్ళిపోయాడు. ఈ హఠాత్ ప్రవర్తనకి ఆశ్చర్యపడింది నిర్మల. 'పిచ్చాడు తాతయ్య' అన్నాడు ఆ పిల్లవాడు.

వెంకట్రావు యింట్లో మంచం మీద కూలబడ్డాడు. ఇల్లుఅంతా నిశ్శబ్దంగా ఉంది. పిల్లి 'మ్యావు' అంటోంది. సూర్యుడూ, చంద్రుడూ, చుక్కలూ భూమిమీద ఒక్కసారిగా రాలినై. నల్లని సముద్రపు చీకటి కెరటాలు జీవితపు గట్లుల్ని ఒరసికొన్నాయి.

అతనిలో ఉత్సాహమూ, ఆనందమూ నాశనమైపోయాయి. అతని కళ్ళు, ఏదో పోగొట్టుకొన్నట్టు బీదగా చూస్తోంటాయి. వర్షాకాలంలో బోదురుకప్పల బెకబెకలూ, వసంతంలో కోకిల కూజితాలూ అతనికి ఒకటే! రాత్రిళ్ళు నక్షత్రాలు కనపడితే, ఉదయం దీపాలు అక్కర్లేకుండా వెలుగు వస్తుంది. ఆకలికి అన్నం తింటారు, తినటం మూలాన్ని పెరుగుతారు, యవ్వనంలో కామిస్తారు, వృద్ధాప్యంలో-చచ్చిపోయే రోజులు సమీపించినకొలదీ, చాలాకాలం బ్రతుకుతామనేఆశతో జీవిస్తారు, శ్రావ్యంగా పాడేవాడికీ, పాటరానివాడికీ ఒకటే హృదయం ఉంది. 'నీకంటె నేను గొప్పవాణ్ని' అంటానికి ఎవరికీ హక్కులేదు. ఒకరికి కవిత్వం రాయటంలో, ప్రకృతిని ఆనందించటంలో శక్తి ఉంటుంది. మరొకరికి హృదయాన్ని కరడుకట్టించుకొని, చీకటిని వెదజల్లే శక్తి ఉంటుంది. తోచక దెబ్బలాడుతారు. తెలివితేటలెక్కువై, ప్రభుత్వాలూ, యుద్ధాలూ, వివాదాలూ, కోర్టులూ కల్పించుకుంటూరు జీవితంలో నగ్నసత్యం తెలుసుకొని, నవలలూ, సినిమాలూ, రోమాన్సులూ చూసి ఆనందిస్తారు. చివరికి ప్రతీజీవితం ప్రత్యేక జీవితం. ఒకరికీ ఒకరికీ సంబంధం లేదు. ఆశకు అంతులేదు. అంతానికి ఆశ కారణం. ఇది ప్రపంచం, ఇది జీవితం □□□


చిత్ర విచిత్రాలు

స్వామి చిత్రానంద

ఈ మధ్య మరీ అర్ధనగ్నంగా తయారవుతూన్న ఒక చిత్రం నిర్మాణంలో వుండగానే, ఆ చిత్రం సెన్సార్ అవదనీ-అయినా, చాలా దృశ్యాలు పోతాయనీ, దానికి 'ఎ' సర్టిఫికెట్ తప్పదనీ, చాలామంది సహ నిర్మాతలు సంతోషిస్తున్నారు.

అంతా యిలా అనుకుంటున్నారని తెలిసి, ఆ నిర్మాత మిగతా సగంచిత్రాన్నిసర్వనగ్నంగాతీశాడు. సెన్సార్ అవుతోంది. దాని ఫలితం కోసం ఎందరో నిర్మాతలు ఆత్రుతగా చూస్తున్నారు. ఆ చిత్రాన్ని నిషేధించినా ఆశ్చర్యపడక్కర్లేదనుకుంటున్నారు.

ఇంతలో ఆ నిర్మాత స్టుడియోకి వచ్చాడు. అంతదూరంలో అతన్ని చూసి, గబగబా దగ్గరకు వెళ్ళారు.



'ఏమైంది?'

'ఎన్ని వేలు కట్ చేశారు?'

'కాంతి శ్రీ డ్యాన్సులన్నీ పోయినట్టేనా?'

అంటూ రకరకాలుగా ప్రశ్నించారు.

'అటిమీద అసలు చెయ్యే ఎయ్యలేదు. టైటిల్స్‌లో డ్రెస్ — మేన్ కార్డుమాత్రం తీసెయ్యమన్నారు.'

'అదేంటి?'

'మీసినిమాలో అసలు డ్రెస్సులే లేవుగదా. డ్రెస్సుల్లేనపుడు డ్రెస్సుమెన్ కార్డు వుండరాదు' అన్నాడు ఆఫీసరు అని చెప్పాడు.

'ఆహా! ఆ ఆఫీసరెంత మంచోడండి' అని అంతా అతన్ని ఏకకంఠంతో అభినందించారు.

* * *

ఒక తెలుగు చిత్ర నిర్మాత, అతి క్లుప్తంగా అతి చవకలో ఒక తెలుగు చిత్రం తీయాలని ఒక తెలుగుకథను, తెలుగు భాషలో మాత్రమే నిర్మించే హక్కును తెలుగు రచయిత వద్ద కొని, నిర్మాణం ప్రారంభించాడు.

తెలుగు కథని ఇతర భాషలవాళ్ళు ఎవరు కొంటార్లే అని, ఆ సర్వ హక్కులూ రచయితకే వదిలేశాడు.

ఆ రచయిత అదృష్టం బాగుంది. ఆకథను ఒక తమిళనిర్మాత కొని, తెలుగులో నటిస్తున్న నాయికతోనే నిర్మాణం ప్రారంభించాడు. తెలుగు చిత్రం కన్న ముందుగానే తాను పూర్తిచేయదల్చుకున్నాననీ, ఆమె తనతో సహకరించాలనీ ఆమెకు మరికొంత మొత్తం ఎక్కువగా ఇచ్చి, చకచకా చిత్రం షూట్ చేస్తున్నాడు. విడుదలకు కూడా సిద్ధమయింది.

ఈ సంగతి తెలుగు నిర్మాతకు తెల్సింది. కాని ఏంచేస్తాడు! తన దురదృష్టం అనుకున్నాడు. తెలుగు కథని తెలుగు సినీమా తీయాలని నిర్ణయించుకున్న తన తెలివి తక్కువ తనాన్ని నిందించుకున్నాడు.

తమిళచిత్రం విడుదలైంది; ఆ నాయిక చిత్రం అంటే చెవికోసుకునే తెలుగు ప్రేక్షకులకోసం దాన్ని "డబ్" చేయాలని తెలుగుదేశం నించి హుటాహుటీ ఒక యువ నిర్మాత వచ్చి తమిళ చిత్రం బేరమాడుతున్నాడు.

తన చిత్రం పూర్తికావడంలేదని బాధపడుతున్న తెలుగు నిర్మాతకి ఈ వార్త తెల్సింది. మూలిగే నక్క మీద తాటికాయ పడినట్లయింది. ఆయన శ్రేయోభిలాషి, అంతరంగిక కార్యదర్శి అసలీ కథని కొనమని ప్రోత్సహించిన 'చలనచిత్ర సర్వజ్ఞుడూ' ఆ తమిళచిత్రం డబ్బింగు హక్కులుకూడా కొనమని సలహా ఇచ్చాడు నిర్మాతకు.

'కొంటాను. ఎంత ఖరీదైనా కొంటాను. తెలుగుకథని, తెలుగు వాళ్ళకోసం తెలుగు సినీమాగా తీయలేనుకోవడం తెలుగువాడి బుద్ధితక్కువ అనుకుంటాను. ఆ తమిళచిత్రం డబ్బింగు హక్కులు కొంటాను. కాని దాన్నిమాత్రం డబ్బింగు చెయ్యను. అసలీచిత్రాన్ని పూర్తిచెయ్యను. అప్పుడుగాని ఈ తెలుగువాళ్ళ తెగులు కుదరదు' అని భీష్మించుకున్నాడు.

● ● ●

మద్రాసులో తెలుగుతారల్ని చూసి, వారి ఆటోగ్రాఫుల్ని సేకరించి, పుస్తకరూపంలో ప్రచురించి తన వేసవిసెలవుల్ని ఈ విధంగా సద్వినియోగం చేసుకోవాలనుకున్న ఓ విద్యార్థి మదరాసు వచ్చి, తారల చిరునామాల్ని సులువుగా తెలుసుకుందుకు వీలుగా వుంటుందని, మూడు రూపాయలిచ్చి, ఒక ఫిలిం డైరెక్టరీ కొనుక్కున్నాడు. అందులో వున్న చిరునామాల ప్రకారం ఎంత తిరిగినా, ఒక్కరినీ కలుసుకోవడం పడలేదు— అన్నీ తప్పుచిరునామాలే! అతనికి విసుగెత్తి, ఆ డైరెక్టరీ సంపాదకుడిని కలిసి, ఛడామడా తిట్టాలనుకున్నాడు. నేరుగా అతని అడ్రసుకు వెళ్ళాడు. ఆ అడ్రసులో అతనూ లేడు. అతనికి ఒళ్ళుమండింది. ఆ మంటల్ని ఆర్పుకుందుకు పాండీ బజార్ వచ్చి, ఓ చల్లని పానీయం తాగి, వెచ్చగా ఓ సిగరెట్ కాలుస్తూవుండగా, ఎదురుగా ఓ చెట్టుకింద నిలబడి సిగరెట్ కాల్చుకుంటున్న ఆసామీయే ఆ సంపాదకుడని తెల్సింది. నేరుగా అవతల పక్కకు వెళ్ళి ఆయన్ని నిలబెట్టి అడుగుతున్నాడు—

'ఇదేం డైరెక్టరీ అయ్యా! దీన్నిండా అన్నీ తప్పులే—!'

"నన్నేం చెయ్యమంటారు! అవన్నీ అచ్చుతప్పులు! తప్పొప్పుల పట్టిక వేస్తున్నాం— ఓటి కొనుక్కోండి. ఎంతో వుండదు— రూపాయిన్నర!"

"అదీ కొంటాననుకోండి దానికి మళ్ళీ మరో తప్పొప్పుల పట్టిక వుండదుగదా!" అన్నాడు విద్యార్థి.

"ఏం చెప్పగలనండీ!" అని వెళ్ళిపోయాడు డైరెక్టరీ సంపాదకుడు.

□□□



సీరియల్

గోమతి



ద్వివేదుల విశాలాక్షి

42

(గత సంచిక తరువాయి)

రెండునెలలపాటు అహోరాత్రాలు కూడా నిద్రాహారాలు లక్ష్యపెట్టకుండా ఆస్పత్రిలో భర్తకి సేవచేసి అతన్ని రక్షించుకొందిగోమతి. పెద్ద డాక్టర్ చాలా మంచివాడు. గోమతిని కన్న బిడ్డలా చూసుకొనేవాడు. ఆప్యాయంగా పలకరించి అవసరం అయినప్పుడల్లా ధైర్యం చెప్తుండేవాడు.

భర్తని ఇంటికి తీసుకు వెళ్తున్న సమయంలో, రెండుచేతులు జోడించి "మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను డాక్టరుగారూ" అంది గోమతి వినయంగా.

"నేను డాక్టరుగా చెయ్యగలిగిన ప్రయత్నం మాత్రమే చేసేనమ్మా! అతడు బ్రతికేడంటే అది నీ అదృష్టం. "నిజానికి ఇది నెగ్గుకురాగలిగే కేసు కాదు. అతడు నిన్ను భార్యగా పొందేడు. అందుకే బ్రతకగలిగేడు" అన్నాడు డాక్టరు అభిమానంగా ఆమెని అభినందిస్తూ.

గోవిందుని తీసుకొని గోమతి ఇంటిలో కాలు పెట్టగానే ఆ ఇంట్లో ఉన్నవారి సానుభూతి వచనాలు ఆమె చెవులు చిల్లులు పడేలా చేసేయి.

"అయ్యో పాపం ఎంత కష్టం వచ్చిందమ్మా! ఎంత మంచివాడు. ఎంత బుద్ధిమంతుడు. ఇంట్లో మనిషి మసలుతున్న జాడే ఉండేదికాదు."

"గోమతి ఈ కాలం పిల్లలా ఉన్నా, మాటలలా మాట్లాడినా, మహాపతివ్రత. అందుకే ఆ

మొగుణ్ణి బ్రతికించుకోగలిగింది. తరచి చూడాలికాని ఏకాలంలోనూ ఉంటారమ్మా సీత, సావిత్రివంటి వారు" అంటూ ఆ ఇంటు అడంగులంతా ఏకగ్రీవంగా తీర్మానించేరు.

అప్పుడు గోమతికి కావలసింది వారి మెప్పుదలకాదు. సానుభూతి వచనాలు కావు. విశ్రాంతి. శారీరకంగా, మానసికంగావిశ్రాంతి కాని అదే ఆమెకి కరువయింది.

అంగవికలుడైన భర్త, అటువంటి పరిస్థితికి ఆర్థికంగా తట్టుకోలేని సంసారం, అల్లారు ముద్దుగా పెంచిన కొడుకు పాటుకి అంగలారుస్తున్న అత్తగారు. ఎలా ఈ పరిస్థితిని నెట్టుకు రావడం? ఈ కష్ట సమయంలో ఎవరు ఆదుకొంటారు? రాత్రి, పగలు తల్లడిల్లి పోయింది గోమతి మనసు.

ఆస్పత్రి ఖర్చులన్నీ భరించి, మరి కొంత సొమ్ము నష్ట పరిహారంగా ఇచ్చి తమ బాధ్యత తీర్చుకున్నారు కంపెనీవాళ్ళు. కూర్చుని తింటే కొండలు కూడా తరుగుతాయంటారు

ఆ సొమ్ముతో ఎంతకాలం గడుస్తుంది? అటు తరవాత పరిస్థితి ఏమిటి? అన్నదే గోమతి ఆరాటం.

"నువ్వు కంగారు పడకు గోమతీ! ఈ షాక్ నుంచి నన్ను కోలుకోనీ! కాలు లేనంతమాత్రాన ఏమయింది? ఏదో నౌకరీ చేయలేకపోను. ఆ కంపెనీ వాళ్ళనే బ్రతిమాలుతాను. వారే ఏదో ఒకదారి చూపిస్తారు" అంటూ పక్కపై ఉండి తాను కుమిలి పోతున్నా భార్యకి ధైర్యం చెప్పేవాడు గోవిందు.

తమ బ్రతుకులే ఇద్దరు పెద్ద కూతుళ్ళ ఇళ్ళలోఏదో విధంగా గడుపుకు పోతున్న గోమతి తల్లీ, తండ్రీ కూడా గోమతికి ఏ విధం

జరిగిన కథ

గోమతి, గోవిందు చిన్ననాటి నేస్తాలు. వారివి ఇరుగు పొరుగు ఇళ్ళు. వారి అల్లరికి ఊరూ వాడా ఏకమయ్యేది. ఇలా వుండగా గోమతి తండ్రి రామనాథం ఒకనాడు తల్లి దండ్రులులేని తన మేనల్లుడు గోపాలాన్ని ఇంటికి తీసుకు వచ్చాడు వాడిని పెంచి పెద్దచేసే భారం తనపై వేసుకున్నాడు. గోమతిని వాడికిచ్చి పెళ్ళి చేయాలని రామనాథం దంపతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అతనికి పెద్ద చదువులు చెప్పించారు. కాని, గోమతి తన్నుకాక గోవిందును ప్రేమిస్తున్నదని భావించి గోపాలం ఆమెను పెళ్ళి చేసుకోనని చెప్పివేశాడు. గోమతి పెళ్ళి గోవిందుతో జరిగి పోతుంది. ఒకనాడు గోవిందు పని చేస్తున్న ఫ్యాక్టరిలో యాక్సిడెంటుకు లోనవుతాడు.

గానూ సహాయపడలేక పోయేరు. "నీ కన్నీరుచూస్తూ మేము బాధ పడడంతప్ప నీ కేమీ చేయలేక పోతున్నామే" తల్లీ అంటూ వాపో యేరు.

కొంతకాలం గడిచేసరికి గోమతి మనసు చిక్కబెట్టుకొంది. తనశక్తి నంతా వెచ్చించి ఆ ఇంటిని నడువుకు రావాలనుకొంది. భర్తకి, అత్తగారికి ఏ విధమైన అశాంతి, అసౌకర్యం కలుగకుండా చూసుకోడమే తన జీవిత లక్ష్యం అన్న నిర్ణయానికి వచ్చింది.

అస్తవ్యస్తంగా ఉన్న ఆలోచనలని కూడదీసి ఒకమార్గం, ఒక గమ్యం నిర్ధారణ చేసుకొన్న తరువాత, ఆమెకి ఒంటిలో శక్తి, మనసులో బ్రతుకు పట్ల ఆసక్తి తిరిగి చిగురించేయి.

కృత్రిమపాదం తగుల్చుకొని, చేతిలో కర్రపట్టుకొని, ఇంటిలో తిరుగాడుతున్న కొడుకునిచూస్తుంటే రంగమ్మ మనసు ఛిన్నాభిన్నం అ ఎ పోయేది. ఆడపిల్ల ఇల్లు పట్టకుండా అతి కష్టపడుతుంటే, అందర్నీ ఉద్ధరిస్తాడు అనుకొన్న కొడుకు అవిటి వాడయిపోతే, ఇలా చూస్తూ ఇంకా ఎంతకాలం బ్రతకను తండ్రీ! ఈ అనుభవాలకేనా నాకుఇంత ఆయువు పోసేవు? ఇంకా ఎటువంటి అనర్థాలు చూడవలసి రాకుండా నన్ను నీదగ్గరికి పిలిపించుకో పరమేశ్వరా!" అంటూ రాత్రీపగలూ విలపించేది.

"పెద్దదానివి. నాకు ధైర్యం చెప్పవలసిన దానివి. నువ్వే ఇలా దిగులు పడితే ఎలా అత్తయ్యా" ఈ ఆపదలని మనం కావాలనికోరుకున్నామా, ఈ రోజు కాదంటే తొలగి పోయేందుకు? ఏది మనకై నిర్ణయింపబడిందో దానిని ఓర్మితో అనుభవించడమే మనవంతు.

"ఒక్కొక్కరి జీవితాన్ని ఎందుకిలా మారుస్తాడో, అందువల్ల అతడు పొందే ఆనందం ఏమిటో ఆ భగవంతుడికే తెలియాలి. ఏమి చేసినా ఎదుటపడి అడుగలేరు కదా అన్నదే అతడి ధైర్యం అనుకుంటాను.

"బహుశా మనం ప్రాణాంతకమైన ఆపద అనుకొన్నది అతనికి అతిఅల్ప విషయంగా కన్పిస్తుందేమో? మన ఆవేదనలని, ఆరాటాల్నిచూసి చిన్నగా తల పంకిస్తూ నవ్వుకొంటాడేమో?" అంది గోమతి భారంగా.

గోమతి మాటలవల్ల ఆమె మనసు ఎంతగా వికలమయిందో రంగమ్మ తెలుసుకొంది. కోడలిముందు తను దిగులు పడకూడదనే నిర్ణయానికి వచ్చింది.

43

కాలం ఎవరికోసంఆగదు. గోమతి వంటి అభాగ్యులకోసం అసలేఆగదు. అందుకే ఆ రోజు వచ్చింది. నెల రోజులుగా మృత్యువులా వెంటాడుతున్న ఆ రోజు. గోమతి తన ఆలోచనల్లోంచి, కలలలోంచి కూడా పట్టి నెట్టివేస్తున్న రోజు. ఉన్నకాస్త ఆధారంతెగి ఆ కుటుంబం గాలిలో వ్రేలాడవలసి వచ్చిన ఆ రోజు.



నెలజీతం చేతబట్టుకొని గోమతి స్కూలునుండి బయటికి కాలు కదిపింది. మరునాడు ఆమె తిరిగి అక్కడికి రానక్కరలేదు. ఆ రోజుతో ఆ స్కూలుతో మూడు సంవత్సరాలుగా ఉన్న అనుబంధం తెగిపోయింది.

విద్యావిధానంలో ఎప్పటికప్పుడు ఏవో మార్పులు వస్తూనే ఉంటాయి. అందులో ఏవి సముచితమైనవో, ఏవి అనుచితమైనవో చెప్పడం కష్టం. లోపాల్ని క్షాళితంచేసి మెరుగుపరచాలనే ప్రభుత్వపు సదుద్దేశానికి గోమతివంటి నిర్భాగ్యులు కొందరు ఎప్పుడూ బలి అవుతూనే ఉంటారు. అన్ట్రెయిన్డు టీచరు అన్న కార

ఖంగా గోమతిని ఉద్యోగంనుంచి తొలగించేరు.

కన్నీటితో తన పరిస్థితిని విన్న వించుకొంది గోమతి. కాని ఫలితం లేకపోయింది. 'నేనేం చెయ్యగలను అమ్మా! ఇది నా ఇంటిలో పని కాదు. వారు ఎలా నిర్ణయిస్తే మేము అలా నడుచుకోవాలి' అన్నాడు ఆ ఉద్యోగి.

వాడిన ముఖంతో ఇల్లుచేరిన గోమతిని తల్లీ, కొడుకూ జాలిగా చూసేరు. కోడల్ని చూడగానే వంట ఇంటిలోకిపోయి చల్లటి మంచి నీళ్లు తెచ్చి అందించింది రంగమ్మ. "ఏం తల్లీ అలా ఉన్నావు?" అని అడగ లేకపోయింది. గోమతి అలా ఉండేందుకు కారణం ఆమెకి తెలియంది కాదు. ఎప్పుడో నెలనాడు వస్తుం దనుకొన్న ఆ రోజు అంత త్వరగా ఎలా వచ్చిందా అన్నదే ఆమె ఆశ్చర్యం.

"కాస్త సేవు సేదదీర్చుకో. ఎండలో నడిచి వచ్చేవు" అంటూ ఖాళీగ్లాసుని వంట ఇంటిలో పెట్టి మిష మీద లోపలికి వెళ్ళిపోయింది.

పగలనున్న కన్నీటి కడవలా ఉంది గోమతి. ఆ దృశ్యాన్ని ఆమె చూడలేదు. పువ్వులా పుట్టి పెరిగిన ఆ పిల్ల పరిస్థితుల చేతుల్లోపడి నలిగి పోతుంటే సువాసనలు చిందవలసిన ఆ చిన్నారిపువ్వు అంతలోనే వసివాడి పోతుంటే, చూసిసహించేటంత గట్టి గుండె ఆమెకి లేదు అందుకే అక్కడినుంచి తప్పుకొంది రంగమ్మ.

కన్నార్పకుండా క్షణకాలం గోవిందు వంక చూసింది గోమతి. ఆమె పెదవులు మాటిమాటికి అదురుతున్నాయి. ఏదో చెప్పాలనే కాంక్ష లోనుండి పొంగివస్తున్నాది. ఏమీ చెప్పలేని అశక్తత దాన్ని అడ్డగిస్తున్నది. అన్నిటినీ తోసుకుని దుఃఖం పొంగుకొస్తున్నాది.

భర్త గుండెల మీద వాలిపోయి తనివితీరా ఏడవాలనే తపన; తానలా అధైర్యపడితే అతడేమయిపోతాడో అన్న బెంగ; బ్రతుకులో మొదటి సారిగా భయపడింది గోమతి. ఆ జీవితం నుంచి పిరికిదానిలా వెనుతిరిగి చూడకుండా పారిపోవాలనుకుంది.

ఈ భారం నువ్వు వహించలేవు. ఈ బ్రతుకు బండిని నువ్వు లాగించ లేవు. నీ ప్రతికదలికకి విధి నీతో పంతం పట్టింది. అడుగడుగునా దెబ్బలు తింటూనే ఉన్నావు. ఇంకా ఎందుకీ పోరాటం? దేని కోసం ఈ ఆరాటం? వెనక్కిరా— వెనక్కిరా —

ఎవరో తన్ను బలంగా పట్టి లాగినట్లు తూలిపడింది గోమతి. కాని ఆపడింది వెనక్కి కాదు; ముందుకే. భర్త గుండెల మీదికే.

"గోవిందూ" అంటూ తనని ఎవరో అతని నుండి లాక్కుపోతున్నారన్నంత భయంగా వాటేసు కొంది.

"గోమతీ" అంటూ ఆమెని అప్యాయంగా పొదివి పట్టుకొన్నాడు గోవిందు.

ఇద్దరి కళ్ళూ పోటీలు పడుతూ వర్షించేయి. ఒకరి ఆవేదనని ఇంకొకరు అర్థం చేసుకొన్నారు ఒకరి కన్నీటిని ఇంకొకరు రుచి చూసేరు.

ఒకనాడు, ఏడ్చే మగాళ్ళంటే నాకు ఇష్టం లేదంది గోమతి. కాని ఆనాడు తన బాధని అర్థంచేసుకొని, తన ఆవేదనలో భాగం పంచుకొంటూ భర్త అలా ఏడిస్తే ఆమె మనసు తేలికపడింది.

కంటిలోని నీరు ఇంకేదాకా, కళ్ళు ఎర్రబడి మండేదాకా, మనసు లోని మంటలు ఆరేదాకా ఇద్దరూ అలాగే ఉండిపోయేరు.

వారిని ఆ పరిస్థితిలో చూసిన రామారావు, గడపలోనే ఆగిపోయేడు. తన రాకని వారికి ఎలా తెలియజెయ్యాలో తోచక ఇటు, అటు మసలసాగేడు. చివరికి గొంతుక సవరించుకొంటూ చిన్నగా దగ్గేడు.

అప్పటికి ఆ భార్యాభర్తలకి బాహ్యస్మృతి వచ్చింది. పెద్దవాడిని దగ్గరలో చూసి తొట్రుపాటుగా లేచి నిలచింది గోమతి. వాడి ఎర్రపడిన ఆమె కళ్ళు, కన్నీటితో మలినంగా ఉన్న గోవిందు ముఖం వేరే వ్యాఖ్యానం అక్కర లేకుండానే ఆ విషాద కావ్యాన్ని వివరించేయి.

"ఓ — అన్నగారా" అంటూ మంచానికి దగ్గరగా కుర్చీ లాగి, పక్కకి తప్పుకొంది గోమతి.

ఆ రోజంతా కుండపోతగా వాన కురిసింది. అర్ధరాత్రివేళ భార్య భయపడుతూ లేచి, భర్తనులేపి, "ఏవండీ! ఇల్లు కూలిపోయేట్టుంది," అంది.

పోనెద్దూ. అద్దెకొంపేగా? కూలిపోతే మనదేంపోయింది!" అన్నాడు భర్త.

"బాగున్నానా అమ్మా" అర్థం లేని పలకరింపుతో మాటలు మొదలు పెట్టేడు రామారావు.

గోవిందు అవసరానికి ఆపదలో ఆదుకొన్న మిత్రుడు అతడు ఒక్కడే. అతడు కూడా గోవిందు పని చేసిన కంపెనీలోనే ఏదో ఉద్యోగం చేస్తున్నాడు. కాకుంటే మరి పది రాళ్ళు హెచ్చుగా జీతం వస్తుంది. అప్పుడప్పుడువచ్చి చూసి పోతుంటాడు. చేతనైన మాట సాయం, అంతగా అవసరం అయితే పదో, పరకో డబ్బు సాయం కూడా చేస్తుంటాడు. ఆ ఊరిలో గోవిందుకి 'నా' అనుకొన్న వ్యక్తి భార్యా, తల్లీ తరువాత అతడు మాత్రమే.

"ఈమధ్య నెల రోజులుగా శెలవు మీద మా ఊరు వెళ్ళేను. ఆమధ్య పేపర్లో చూసిన వార్తనుబట్టి ఇటువంటిదేదో జరిగి ఉంటుంది – అనుకొన్నాను. భయపడినంతా అయిందన్న మాట" అన్నాడు రామారావు గోవిందు ముఖం చూస్తూ.

"ఇందుకే కష్టాలు ఒంటిగారావు అంటారు."

"కానీ ఆ హెడ్మాష్టరు ఎవరో మంచివాడనీ, గోమతి అంటే అభిమానం అనీ చెప్పేవాడివి —"

"అదీ మా దురదృష్టమే. అతడికి బదిలీ అయింది. ఇప్పుడు ఉన్న వాడు కూడా మంచివాడేనట. కాని ముక్కుకి సూటిగా పోయే రకం."

"ఇప్పుడేం చేయాలనుకుంటు న్నారు ?"

"గోమతి ఇంతకు ముందే వచ్చింది. డాక్టరు రోగి బ్రతకడని చెప్పినా ఏదో అద్భుతం జరిగి జబ్బు నయమై పోకూడదా అని ఆశించే ఆత్మీయుల్లా, ఏదో విధాన ఈ ఉద్యోగం నిలుస్తుందేమో అని ఇంత వరకు ఆశపెట్టుకుని నిరీక్షించాము ఈరోజుతో అది తీరిపోయింది. ముందుగతి ఏమిటి అని ఆలోచించే ముందు మనసుల్లో నిండి ఉన్న బాధను దింపుకోవాలి. నువ్వు వచ్చే ముందు ఆ ప్రయత్నంలోనే ఉన్నాం" ఏడవలేక నవ్వేసేడు గోవిందు.

తన చేతిలో మడచిపట్టుకొన్న పేపరులో ఒక ప్రకటన చూపిస్తూ, "గోమతిని దీనికి అప్లయి చేయమను" అన్నాడు రామారావు.

గోవిందు ఆత్రంగా పేపరు అందుకొని చదివి, లాభంలేదన్నట్లు పెదవి చప్పరించి నిరాశగా ఇచ్చేసేడు.

"ఈ ఉద్యోగం గోమతికి రావడం కష్టం బ్రదర్. టైపు, షార్టుహేండు. ఎక్స్‌పీరియన్స్ అంటూ అన్నిరాస్తున్నారు. వారిచ్చే జీతానికి ఆ హంగులన్నీ ఉన్నవాళ్ళు తప్పక వస్తారు" అన్నాడు గోవిందు.

"ఈ అర్హతలన్నీ గోమతికి లేని మాట నిజమే. కాని ఉద్యోగాల కోసం వచ్చే చాలామంది ఆడవాళ్ళకి ఉండని ఇంకో అర్హత గోమతికి ఉంది. అదే ఆమె అందం. ఇటువంటి ఉద్యోగాలకి అది కూడా అవసరమే. ఇంకొక విషయం. ఆ ఆఫీసర్ మా మామయ్యకి తెలుసట. అతనిచే చెప్పించి చూద్దాం"

"గోమతికి టైపువచ్చు. షార్టుహేండు అంతగా రాదు. నెలరోజులు నేర్చుకొని బద్ధకించి మానేసింది"



"వడ్డించేవాడు మనవాడైతే కడపంక్తిని కూర్చున్నా ఫరవాలేదన్న సామెత విన్నావా ? మిగిలిన విషయాలు వాళ్ళకి నచ్చితే షార్టుహేండు నేర్చుకోడం ఏమంత కష్టం. ఉద్యోగం చేస్తూనే నేర్చుకోవచ్చు."

గోమతి రెండు కప్పులలో కాఫీ తెచ్చింది.

41 "ఇప్పుడు ఇదంతా ఎందుకమ్మా" అన్నాడు రామారావు కాఫీ కప్పు అందుకొంటూ.

"ఈ సారికి ఉన్నాది ఇస్తున్నాను. ఇంకో సారి మీరు వచ్చేసరికి మంచి నీళ్ళు ఇచ్చి పంపవలసిన స్థితి వస్తుందేమో" గోమతి కంఠం పూడుకు పోయింది.

"ఎందుకమ్మ అంతలా కంగారు పడతావు. మేమంతా ఉండి చూస్తూ ఊరుకొంటామనే — ఛా —తప్పు. కళ్ళుతుడుచుకో. ఇంకా నువ్వేదో ధైర్యవంతురాలివి అనుకొంటున్నాను నేను. అలా అకారణంగా కంటతడి

పెట్టవచ్చునా? వెళ్ళు. నీ కాఫీ కూడా తెచ్చుకో. అంతా కలసి తాగుదాం" అంటూ ఆమెని అను నయించేడు రామారావు.

రామారావు గోవిందుకన్న వయసులో కాస్త పెద్ద. రూపంలో ఇంకా పెద్దవాడిలా ఉంటాడు. ముఖ్యంగా ఆ దుబ్బుమీసాలు అతని ముఖాన్ని ఉన్నవయసుకన్న హెచ్చుగా పెంచి చూపుతాయి. గోమతి అతనిని అన్నయ్యాఅని పిలుస్తుంది. ఆ చనువుతోనే తోడపుట్టినచెల్లెలుగా భావించి ఆమెని మందలిస్తూ మాట్లాడుతాడు రామారావు

44

అప్లికేషన్సుకి ఆఖరురోజు దాటిపోయిన దగ్గరినుంచీ గోవిందు ఆత్రంగా పోస్టుకోసం ఎదురుచూస్తున్నాడు. ఎందుకైనా మంచిదని షార్టుహేండు పుస్తకాలు ముందు వేసుకొని ప్రాక్టీసు చెయ్యడం మొదలుపెట్టింది గోమతి "ఈ పిల్లలు నీ పట్ల చేసిన ద్రోహం ఏముంది తండ్రీ! ఎందుకిలా పరీక్షిస్తున్నావు? వాళ్ళకేదో ఒకదారి చూపించు. నిన్నేం సిరి సంపదలు కోరలేదు. మడిమాన్యాలు ఆశించలేదు. కడుపు కింత తిండీ, మనసు కింత శాంతి ప్రసాదించి కరుణించు తండ్రీ" అంటూ దేవుణ్ణి ప్రార్థించ సాగింది రంగమ్మ.

ఒక్కొక్కరోజే గడచిపోతున్న కొద్దీ గోమతికి ఇంటర్వ్యూకి పిలుపు వస్తుందన్న నమ్మకం సన్నగిల్లింది. ఇంకేమైనా అవకాశాలు కలసివస్తాయేమో అని ప్రయత్నాలు మొదలుపెట్టింది. పదిమంది పిల్లల్నిచేర్చి ప్రయివేట్లు చెప్పాలన్నది అందులో ఒకటి

చిన్నపిల్లలున్న ఇంటింటికిపోయి తల్లుల్ని అర్థించసాగింది.

"మావాళ్ళు చిన్నవాళ్ళు. ఇప్పటినుంచే చదువు అక్కరలేదు" అని కొందరు అంటే "మావాళ్ళు ఎండలో అంతదూరం నడచి రాలేరు" అన్నారు మరి కొందరు.


"రోజూ ఏదో సమయంలో మీ ఇంటికి వచ్చి ఇక్కడే పాఠాలు చెప్తాను" అంది గోమతి ఒక ధనవంతుని గృహిణితో.

"చూడమ్మాయి. నాకు పెళ్ళయి ఇరవై ఏళ్ళయింది. మా సంసారం చల్లగా సాగిపోతున్నాది" అంది ఆవిడ అదోలా గోమతివంక చూస్తూ.

మొదట ఆమె మాట గోమతికి అర్థంకాలేదు. ఆ భావం అవగాహన చేసుకొన్నాక "ఛీ... ఛీ పాడుమనిషి. సాటి ఆడదాన్ని అంతమాట ఎలా అనగలిగింది"అని అసహ్యించుకొంది. దానితో అటువంటి ప్రయత్నాలకి స్వస్తి చెప్పింది.

గోవిందు మంచంమీద కూర్చుని ఉద్యోగాలకి పెట్టినఅర్జీలకి "ఖాళీలు లేవు" "ప్రస్తుతంఅవసరంలేదు." వంటి జవాబులుమాత్రం క్రమంతప్పకుండా వస్తున్నాయి గోమతి ఎదురు చూస్తున్న ఉత్తరం మాత్రం రాలేదు.

"ఎప్రెనుసరిగారాసేవో... లేదో"



ఎదురు చూడలేని గోవిందు వినుకొన్నాడు.

"ఇది మరీ బాగుంది గోవిందూ! నువ్వు మూడు పుంజులమార్లు చదివి అన్నీ సరిగా ఉన్నాయి అన్నాకనే కదా పోస్టుచేసేను"

"ఆ రామారావుకూడా కన్పించడం మానేసేడు..."

"మనకంటే పనీపాటు లేకుండా ఇంట్లో కూర్చుని కబుర్లు చెప్తున్నాం కాని అతనేం తొందరపనుల్లో ఉన్నాడో. ఫ్యాక్టరీలో పనిచేసేప్పుడు నీకు మాత్రం ఏపాటి తీరికఉండేది? రావడానికి సమయం ఉండొద్దూ?" అంది గోమతి.

గోమతి అన్న ఆ మాట గోవిందు మనస్సులో బాగా లోతుగా తాకింది. "నీకైతే ఈ రోజుకాకుంటే రేపైనా ఏదైనా కలసి వస్తుందన్న ఆశ అయినా ఉంది గోమతీ. నాకేముంది? తగినంత చదువులేదు. పైగా అవిటివాడిని. ఎవరిస్తారు ఉద్యోగం?" అన్నాడు గోవిందు బాధగా.

"నేను ఏదో మాటకి అన్నాను గోవిందూ. ప్రతిమాటనీ అంతగా పట్టించుకొని అన్నీ నీకు అన్వయించుకొంటే ఎలా చెప్పు. మన ఇద్దరిలో భేదం ఏమిటి? ఉద్యోగం వచ్చి కడుపుకి ఇంత తిండీ ఉంటుంది. నీకు ఉద్యోగమైతే నాకు లేదే అన్న ఆలో

చన జోలికి పోకుండా హాయిగా విశ్రాంతి తీసుకొంటాను తెలుసా'

'ఈ అవిటి మొగుడితో ఇంక నీకు విశ్రాంతే గోమతీ! చచ్చేవరకు వీడికి చాకిరీచెయ్యడం, కూర్చో పెట్టి మేపడమే నీ నుదుటరాసుంది' నిట్టూరుస్తూ అన్నాడు గోవిందు

'నిన్ను కూర్చో పెట్టి తిండి పెట్టడం, నీ సపర్యలు చెయ్యడం నాకు కష్టంలేదుకాని ఇటువంటి మాటలు వినడం నా తరంకాదు' గోమతి కోపంగా జవాబు చెప్పింది.

గోవిందు తిరిగి ఏదో అనబోయే లోపునే వీధి గుమ్మంలో పోస్టు బంట్రోతు కేక విన్పించింది. గోమతి వరుగున వెళ్ళి ఉత్తరం అందుకొంది.

'ఎక్కడినుంచి గోమతీ?' ఆత్రం పట్టలేని గోవిందు గదిలోంచి కేక పెట్టేడు.

'అక్కడనుంచే అనుకొంటాను. ఉండు. సరిగా చూడనీ' వణుకుతున్న చేతులలో ఉత్తరం పట్టుకొని గదిలోకి వచ్చింది గోమతి.

'కవరు చించకుండా అలాగేం చూస్తావు? చించిచూడు'

'అబ్బా నాకు భయంగా ఉంది. నువ్వేచింపు'

'నావి వెధవ చేతులు. ఏ పని చెయ్యబోయినా నాశనమే. నువ్వే చించి చూడు' అన్నాడు గోవిందు.

పోస్టు బంట్రోతు కేక విన్న రంగమ్మ గదిలోకి వచ్చింది.

'అదేమిటర్రా. నువ్వంటే నువ్వంటూ కవరు చించకుండా అలా పెట్టుకు కూర్చున్నారు. కవరుచించి కాగితం తియ్యకుండా అందులో ఏముందో ఎలా తెలుస్తుంది. ఎవరి చేతులు తాకినా ఇప్పటికే రాసున్నది ఇప్పుడు మారిపోతుందా? ఇలా ఇయ్యి గోమతీ! నేను చింపుతాను' అంది రంగమ్మ.

గోమతి ఉత్తరం అత్తగారి చేతిలో పెట్టి ఉత్సాహంగా వెనుక చూస్తున్నది.

'అంతా ఇంగ్లీషులో ఉంది. నువ్వే చదువు' అంది రంగమ్మ కాగితం విప్పిపట్టుకొంటూ.

'ఓ గోవిందూ! ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది. ఈ శుక్రవారం నాడేట' పట్టరాని ఆనందంతో కేక పెట్టింది గోమతి.


'ఏమిటీ... ఏమిటి శుక్రవారం... అంటే ఎల్లుండే—' కర్ర అసరా లేందే అడుగు ముందుకి వడనన్న మాట మరచి, ఉన్నపాటునే మంచం మీంచి లేచిన గోవిందు దభీమని పడిపోయేడు.

'అమ్మా' అని బాధగా కాలు పట్టుకొన్నాడు.

'అయ్యో—అయ్యో—' అంటూ గోమతి, రంగమ్మ అతన్ని పట్టుకొన్నారు.

రెండు నిముషాలకి గోవిందు బాధ సర్దుకుంది

'మరేం చికాకులేదు. ముణుకు పట్టికి తగిలింది. అంతకన్నా ఏం లేదు. ఏదీ...ఏదీ ఆ ఉత్తరం ఇలా తే... నన్ను సరిగా చూడనీ' అన్నాడు అంత బాధనీ మరచి ఉత్సాహంగా గోవిందు.



ఆ పిల్లల ముఖాల్లో తాండవిస్తున్న సంతోషాన్ని చూచి, 'నౌకరీ అయినట్లేనా ?' అంది రంగమ్మ తృప్తిగా.

'ఇంకా సరిగా తెలియదు. అది తేల్చుకోందికే రమ్మని పిల్చేరు' అంది గోమతి.

'ఆ పాటిదానికేనా ఈ హంగామా అంతా! రమ్మని పిలవగానే సరా. అదృష్టం కలిసి రావద్దూ' అంది రంగమ్మ.

'లేదమ్మా. ఈసారి అదృష్ట దేవత మనల్ని మోసంచేసి పారిపోదు. ఎందుకో నాకు అలా అనిపిస్తున్నది. అంతా సవ్యంగా అయిపోతుంది. అప్పుడు నీ కోడలికి ఎంత జీతమో తెలుసా ?'

'అబ్బా. ఏమిటి గోవిందూ! అప్పుడే ఉద్యోగం స్థిరపడి జీతం అందుకొన్నట్లు'

'ఇది అవుతుంది గోమతీ! అయి తీరుతుంది. నేను చెప్తున్నాను చూడు'

'రామారావు మామయ్య సిఫార్సు ఉందనేకదూ ఈ బడాయి. నాకు తెలియ దనుకొన్నావేమిటి ?' గోమతి ఎగతాళి చేసింది.

'ఈ అనకాశం కలిసివచ్చేలా చెయ్యి తండ్రీ' రంగమ్మ మనసులో దేవుని ప్రార్థించింది.

45

గోమతి ఇల్లుదాటి వెళ్ళిన దగ్గిర నుంచి గోవిందుకి కాలం ఆగిపోయింది. ఆమె నోట వినబోయే చల్లనిమాటకోసం వేచి, వేచి మనసు

విసిగిపోయింది. అబ్బా గోమతి ఎంతకీ రాదేం? మరీ ఇంత ఆలస్యం చేస్తే ఎలా? ఏమీ చేసేదిలేక కళ్ళు మూసుకొని మంచంమీద పడుకొన్నాడు.

"అమ్మా అయిదయింది కదూ! ఈపాటికి గోమతి వస్తుండాలి. కాస్త వీధిగుమ్మంవరకు వెళ్ళి చూసివస్తావా! పండో కాయో చూసిచెప్తావా? ఇంటర్వ్యూకి పిలుపు వచ్చిందంటే ఈ వుద్యోగం గోమతి చేతిలోకి వచ్చినట్లే నమ్మా! రామారావు మామయ్యకి అతడితో అంత పరిచయం వుందిట.

"ఆ అధికారికూడా చాలా మంచివాడట. వృద్ధిలోకి వచ్చేందుకు ఈ ఆఫీసులో ఎన్నో అవకాశాలు ఉన్నాయట. సమయం చూసుకొని నా విషయంకూడా వాళ్ళమామయ్యతో చెప్తానన్నాడు రామారావు. ఈలోగా పుస్తకాలు తెప్పించుకొని ఆ బియ్యే పూర్తిచెయ్యమన్నాడు.

"ఇంక మన దశ తిరిగిందమ్మా కష్టాలు కలకాలం కాపురం ఉండవు అంటారు కదూ! మన కష్టకాలం ఈరోజుతోనే సరి-అనీ, ఇకముందు మంచే మనకోసం పొంచిఉన్నాదనీ నా కెందుకో అన్పిస్తున్నాదమ్మా!

"అసలు విషయం మరచిపోయి నిన్ను మాటల్లో పెడున్నాను. గోమతి వస్తున్నాదేమో వెళ్ళి చూసిరా అమ్మా."

రంగమ్మ కొడుకువంక వింతగా చూసి నుదుటిమీద చెయ్యివేసింది.

గల్లున నవ్వేడు గోవిందు. "నాకు జ్వరం వచ్చిందనుకొంటున్నావా అమ్మా! అలాగేంలేదు. ఎందువల్లనో ఈరోజున నాకు చాలా ఆనందంగా ఉంది. పీడకలలోంచి ఇప్పుడే తెలివి వచ్చినంత హాయిగా ఉంది.

"అదిగో గోమతి వచ్చేస్తుంది. ఆ అడుగుల చప్పుడు ఆమెదే. ఆ గుమ్మంలోంచి ఈ గదిలోకి రావడానికి మరీ ఇంత ఆలస్యం చేస్తున్నాదేమిటి? ఆడవాళ్ళు ఎంత మందగమనలైనా అడుగుతీసి అడుగు వెయ్యడానికే అరగంట పడ్తుందా?"

గోవిందు అంచనాలో పొరపాటు లేదు. ఆ వచ్చింది గోమతే. అడుగు తీసి అడుగు వెయ్యడానికి అరగంట పట్టకపోయినా, ఆలోచిస్తూ నెమ్మదిగానే నడుస్తున్నది. ఒంట్లో జవసత్వాలు ఉడిగి, వయోభారంతో నడ్డి వంగిన ముదుసలిలా అడుగులు వేసుకొంటూ వస్తున్నది.

చావిట్లో కాలుపెట్టగానే గోమతి ముఖం రంగమ్మకి కన్పించింది. రెప్పపాటులో చావు తప్పి బ్రతికిన మనిషిలా పాలిపోయి ఉంది. ఫలితం అడుగనవసరం లేకుండానే రంగమ్మ తెలుసుకొంది.

అల్లంత దూరంనుంచే గోమతిని చూస్తూ.

"ఏమయింది గోమతీ?" అన్నాడు కంగారుగా గోవిందు.

"ఆ ఉద్యోగం నేను చెయ్యలేను గోవిందూ" అంది గోమతి భారంగా కుర్చీలో కూలబడుతూ.

"ఏం. పనిఎక్కువగా ఉంటుందా? నీ క్వాలిఫికేషన్సు చాలవన్నారా? వివరంగా చెప్పు గోమతీ! నీ నోట వినబోయే మాటకోసం ఈ నాలుగు గంటలకాలం నాలుగు యుగాలుగా గడుపుతుంటే, మనను ఆరాటంతో తహతహలాడుతుంటే అంత ముభావంగా చెప్పి ఊరుకొంటావేం?"

"ఇదేదో జీవనమరణ సమస్యలా ఎందుకంతగా బాధపడుతావు గోవిందూ! ఇంత ప్రపంచంలో ఇది కాకపోతే వేరే ఉద్యోగమే దొరకదా?"

"అసలు విషయం చెప్పక ఎందుకిటువంటి మాటలు చెప్తావు గోమతీ! వాళ్ళు నువ్వు ఈ ఉద్యోగానికి పనికిరావు పొమ్మన్నారు. అంతేనా? కాస్త దయచూపమని బ్రతిమాలుకోలేకపోయేవా? కష్టించి పనిచేస్తానని నమ్మించలేకపోయేవా?"

"లేదు గోవిందూ. వారు వద్దు పొమ్మనలేదు. నాకే ఆ ఉద్యోగం నచ్చలేదు. ఆ ఆఫీసులో నేను పని చెయ్యలేను. అంతకు మించి నన్నేం అడక్కు. ఈ సమయంలో నేనేం చెప్పలేను" అంది గోమతి రెండు చేతులతో ముఖం కప్పుకొంటూ.

గోవిందు మతిపోయిన వాడిలా దిగాలుపడి కూర్చుండిపోయేడు. గోమతి ఇలా ఎందుకు చేసింది? పేదవాని పాలిటి పెన్నిధిలా చేతిలోకి వచ్చిన ఉద్యోగాన్ని ఎందుకు కాలతన్నింది? అంత ఉత్సాహంగా వెళ్ళిన గోమతి ఇంత దిగులుగా ఎందుకు తిరిగి వచ్చింది? ఆఫీసులో ఎవరైనా అవమానంగా మాట్లాడేరా? అధికారి ఏమైనా అనుచితంగా ప్రవర్తించేడా? ఏమయిందో ఎలా తెలుస్తుంది? ఆలోచిస్తూ కళ్ళు మూసేడు గోవిందు. ఆ రాత్రంతా ఇద్దరూ మౌనంగా మేలుకువగా అలాగే గడిపివేసేరు.

(సశేషం)

సినిమా

సినిమా పరిశ్రమాభివృద్ధికి 'గుర్రబ్బగ్గి' పథకం!

హైదరాబాదులో నిర్మించే చిత్రాలకు భాషాభేదం, ప్రమాణాల ప్రసక్తి లేకుండా ప్రతిదానికి రు 50 వేలు సబ్సిడీ ఇస్తానని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది దాని నిదివరకే ఒకసారి పొడిగించింది. మరి రెండేళ్ళపాటు ఈ పద్ధతి అమలులో వుంటుందని యిప్పుడు మరలా ప్రకటించింది. అయితే కొన్నాళ్ళక్రితం శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఏర్పాటు చేయించిన 'ఫిల్మ్‌కన్వెన్షన్' సిఫారసు ప్రకారం ఈ మొత్తాన్ని రు 75/- వేలకుమాత్రం పెంచలేదు. ఆంధ్రుల రాజధానిని దేశంలో ఒక చలన చిత్రాజధానిగా అభివృద్ధి చేయడానికై నిర్మాతలకు ప్రోత్సాహం ఇవ్వాలన్న సత్సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం 1964 లో ప్రకటించిన ఈ సబ్సిడీ పథకం మన చిత్రాల నాణ్యతను ప్రమాణాలను పెంచడంలో ఎంతవరకు తోడ్పడినది చెప్పాలంటే సమగ్రంగా ఒక పరిశీలన జరిపించడం అవసరం.

ఇంతవరకు కె. ఎ. అబ్బాస్ నిర్మించిన 'ఆస్మాన్ మహల్' తోసహా ఈ ఐదేళ్ళలోనూ సుమారు ఓ డజను చిత్రాలు మాత్రమే ఆంధ్ర రాజధాని నగరంలో నిర్మించబడి ఈ సబ్సిడీని అందుకున్నాయి. ఆస్మాన్ మహల్ హైద్రాబాద్‌లో నిర్మించబడ్డదే అయినప్పటికీ ప్రాసెసింగు, ప్రింటింగు అంతా బొంబాయిలోనే జరిగిపోయింది. ఈ కారణంవల్ల ఇది పూర్తిగా 'హైద్రాబాద్ మేడ్' అని


చెప్పుకుదము. అందుకనే దానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రు 50 వేల సబ్సిడీలోనూ సగం మాత్రమే ముట్టింది.



'పోసుమాన్‌రాజు'లో జయలలిత

ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీలకు చిత్రాల నిర్మాణ విలువలు, సాంకేతిక ప్రమాణాలు, ఇతివృత్త వివేచన ఏవీ లేవు. అయితే ఇకపై నిర్మించే చిత్రాల కనీస ప్రమాణాలను సరితూకేందుకు ఒక కమిటీ ఏర్పాటయింది. నిజానికి ఇది నంది అవార్డుల నిర్ణయ కమిటీయే. శాసనసభ స్పీకర్ శ్రీ బి. వి. సుబ్బారెడ్డి అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిటీలో హైదరాబాద్ - ఆలిండియా రేడియో స్టేషన్ రిటైర్డు డైరెక్టర్ శ్రీ ఎ. వీరభద్రరావు, తెలుగు లెక్చరర్ బి. రామరాజు సభ్యులుగా వున్నారు ఈ కమిటీ నియామకం ఏ యోగ్యతలు, కొలబద్దల ప్రాతిపదికపై జరిగిందీ ప్రభుత్వం ఎప్పుడూ చెప్పలేదు. హైదరాబాద్‌లో నిర్మించబడి 'నంది అవార్డు'ను పొందిన చిత్రమయి వుంటే దానికి ఈ కమిటీ పరిశీలించనక్కరలేకుండానే సబ్సిడీ లభిస్తుంది. అంటే ఈ కమిటీకున్న ప్రతిపత్తి రెండోతరగతి క్రిందికి తేల్చాలి!

తెలుగు రాజధానిని 'చలనచిత్రాజధాని'గా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఈ సబ్సిడీ పథకం అంత ఫలప్రదం కాదని, ప్రభుత్వం యిచ్చే సబ్సిడీ నిర్మాత హీరోకో, హీరోయిన్‌కో యిచ్చే 'చీకటిసొమ్ము'మాత్రమైనా ఉండదు; గనుక అది వారినేమంత ఆకర్షించబోదని అప్పట్లోనే అనేక విమర్శలు వచ్చాయి. ఇప్పుడవి నిజమేననిపిస్తున్నాయి. కనుక సబ్సిడీలు, నంది అవార్డులువంటి 'ఆకర్షణ'ల ద్వారా కాక ఆచరణయోగ్యమైన ఒక సమగ్రపథకం తయారుచేసి సార్థకమైన, ప్రయోజనకరమైన కృషికి పూనుకోడం అవసరం దీనిని ప్రభుత్వం ఈ నాలుగేళ్ళ అనుభవం తర్వాత గుర్తించి వుండవలసింది. అలాటి నిర్మాణాత్మక కృషి జరుపకుండా ఈ సబ్సిడీలు, అవార్డులతో మాత్రమే లక్ష్యం సాధించగలమనుకోనడం, అందుకు ప్రయత్నించడం కొనసాగితే ఆ గుర్రం, బగ్గీకి వెనుకనే పూన్చిఉన్నదని గుర్తించడానికి ఏదో రోజు సిద్ధపడాలి, తప్పదు!"



"బంగారు గాజులు"లో విజయనిర్మల, నాగేశ్వరరావు

సబ్సిడీలు పొందిన చిత్రాలు

ఆంధ్రరాజధానిలో నిర్మించే చిత్రాలకు లభించే సబ్సిడీ ఇంతదాకా నాలుగు చిత్రాలకు లభించాయి. అవి - ఆత్మా ఆర్ట్స్ 'చిలకా గోరింక', జగపతివారి 'ఆస్తిపరులు', అన్నపూర్ణావారి 'ఆత్మగౌరవం' - ప్రసాద్ ఆర్ట్స్ పిక్చర్స్‌వారి కన్నడ చిత్రం 'మావన మగలు'.

హైదరాబాద్‌లో సదరన్ మూవీటోన్సులో నిర్మించబడ్డ మరో చిత్రం లలరామా పిక్చర్స్‌వారి

"బదుకు వదారి", క్రిష్ణసాయీ ఫిలిమ్స్ దిల్ - ఏక్ మందిర్ హిందీ చిత్రాన్ని తెలుగులో పునర్నిర్మించిన "మనసే మందిరం", నందనావారి ప్రయోగాత్మక చిత్రం "సాక్షి" కూడా ఈ సబ్సిడీకి అర్హమైనవిగా సిఫారసు చేయబడినట్లు తెలుస్తున్నది.

పద్మశ్రీవారి "ప్రాణమిత్రులు", శ్రీనిలయంవారి "శ్రీమతి" ఇంకా పరిశీలనలో వున్నాయట.

కాంతారావు చిత్రంలో

రాజశ్రీ కథానాయిక

సుప్రసిద్ధసినీనటుడు కాంతారావు హేమా ఫిలింస్ బ్యానరుక్రింద చలన చిత్ర కన్యలను సృష్టించ సంకల్పించారు. ఈ చలన చిత్ర పుత్రికల మాతృసంస్థకు శ్రీ కాంతారావు తమ సతీమణి పేరే పెట్టారు.

ఇందులో శ్రీ కాంతారావు, ఆయన కుమారుడు "రాజా" నటిస్తారు. వీరుకాక, ఇటీవల ఆరుమాసాల అత్యల్పకాలంలోనే శిక్షణ పొంది "కూచిపూడిలో"లో అరంగేట్రం యిచ్చిన బేబీ మహాలక్ష్మికి కూడా ఆయన తమ చిత్రంలో అవకాశం యిస్తున్నట్లు ప్రకటించారు. ఈ బేబీకి నృత్యశిక్షకురాలు శ్రీమతి సుమతీ కౌశల్.

అనేక చిత్రాలలో తన "నాయిక"గా భూమికలు నిర్వహించిన రాజశ్రీనే శ్రీ కాంతారావు ఈ చిత్రంలోకూడా తన కథానాయికగా ఎంచుకున్నారు. నాయక పాత్రను ఆయన స్వయంగా ధరిస్తున్నారు

శ్రీ టి. వి. రాజు సంగీతం అందిస్తున్న ఈచిత్రం పేరు "సప్తస్వరాలు" శ్రీ వేదాంతం రాఘవయ్య దర్శకత్వం నిర్వహిస్తారు.

యుగయుగాల ప్రేమగాథ....

ఒకనాటి గురు - శిష్య సంబంధాలలో, సాంఘిక కట్టుబాట్లలో, సామాజిక రీతి నీతులలో విప్లవం తెచ్చి, గురుపత్నినే స్త్రీయభోగ్యం గావించుకున్న శశికుమారుడు-చంద్రుడు-ఈ నాటికీ ఆ మచ్చను బాపుకోలేకున్నాడు. ఆ "ప్రియుని" ('కామాంధుడు'అంటారుకొందరు!) ప్రేమగాథను నాటి మునులు నడిబజారుకీడ్చి నగుబాటు చేయ ప్రయత్నిస్తే నేటి సామాజికులు-మరీ, తెలుగువారు - వీధి వీధినా నాటకాలాడి, సినిమాలుతీసి అమరగాథను చేస్తున్నారు. ఎన్ని తరాలు గడిచాయో, ఎన్ని యుగాల నాటిదో - నేటికీ వారిప్రేమకథ అమరగాథగానే వుండడం వింతకాదు. దాని నాదరించే "రసిక ప్రేక్షకుల"కు తెలుగు దేశాన కొదువలేదు!

ఈ ధైర్యంతోనే రామకృష్ణా పిక్చర్సువారు నిర్మిస్తున్న "తారా శశాంకం" ఇప్పటికి మూడొంతులు మించి పూర్తి అయింది. కథకు దీటుగా రసవత్తర ఘట్టాలతో "శృంగారలోకం"గా చిత్రించబడుతున్న ఈ చిత్రంలో బాల శశికుమారునిపై మరులుగొన్న మదవతి



"మన సంసారం"లో భారతి, శోభన్‌బాబు

గురుపత్నిగా దేవిక, జటాజూటధారి అయినా పసిడి యవ్వనం రాశి బోసినట్లున్న అందాల భరిణెను అర్ధాంగిగా స్వీకరించి ఆమె వయసును - మనసును అడవి - ఆశ్రమం పాలుచేయబూనిన మౌని కుల తిలకుడుగా శ్రీ గుమ్మడి, కాంతారావు, శోభన్‌బాబు, వాణిశ్రీ, పండరీబాయి, నాగయ్య, ధూళిపాళ, బాలకృష్ణ, అల్లు రామలింగయ్య మున్నగువారు నటిస్తున్నారు.

దర్శకత్వం - మానాపురం అప్పారావు.

నిర్మాత : కె. సత్యనారాయణ.

ఆంధ్ర - రాయలసీమల్లో గౌరీ పిక్చర్స్, నైజాంలో ఉషా ఫిలింస్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తాయి.

అందెల రవళి

తెలుగుచిత్ర సీమలో ఒక కొత్త నటి కాలిడుతోంది. ఆమె "అందెల రవళి" అదిగో అప్పుడే మధుర మంజులంగా, హృదయంగమంగా వినవస్తోంది — అన్నారి టీవల ఒక అభిజ్ఞుడు.

నిజమే. సుప్రసిద్ధ దర్శకుడు

శ్రీ ఎ. భీమ్‌సింగ్ నిర్మించతలపెట్టిన తెలుగుచిత్రం "అందెలరవళి" చిత్రంలో తెలుగు దేశానికి ఒక కొత్త హీరోయిన్‌ను పరిచయంచేయ తలపెట్టినట్లు తెలుస్తున్నది. త్వరలో సెట్స్‌కు వెళ్ళనున్న ఈ చిత్రంలో పాత కొత్త నటుల మేలికలయిక మన కగుపిస్తుందిట.

దర్శకులు : శ్రీ వేదాంతం రాఘవయ్య, సంస్థ : శ్రీ లక్ష్మీబాలాజీ కంబైన్స్.

ఖరీదయిన పద్మశ్రీ

ఇటీవల పద్మశ్రీ అవార్డు అందుకున్న ఒక ప్రముఖుడు తనకు లభించిన ఆ అఖండ గౌరవము, ఆ సందర్భంగా తాను, ఇతరులు ఏర్పాటు చేసిన విందులువేడుకల సందర్భంగా తీయించిన ఫొటో ప్రింట్లకుమాత్రమే కనీసం రు 40 వేలు ఖర్చుబెట్టినట్లు ఒక వార్త. ఒకో ఫొటో ప్రింటుకు రు 5/-లు చొప్పున లెక్కగట్టి చూసినా ఈ ఖర్చయిన మొత్తాన్ని బట్టిచూస్తే కనీసం ఆ "పద్మశ్రీ" ప్రముఖులు అమాంబాపతు 8 వేల ఫొటోలయినా తీయించుకుని వుండాలి.

ఒక్క ఫోటోలకే ఇంతయితే ఇతరఖర్చులు అన్నీ ఎంత అయి వుంటాయో అంచనా వేయడం కష్టమే.

ఏమైనా "పద్మశ్రీ" ఎంత ఖరీదైన బాధ!

జూలై విడుదలకు సిద్ధంగావున్న చిత్రాలు

లక్ష్మీనివాసం, భలే మొనగాడు, జీవితాలు, జీవితబంధం.

బహుశః భాగ్యచక్రం, స్వయంవరం, పంతాలు - పట్టింపులు.

సినిమా, సంగీతాల్లో అంతర్జాతీయత

దేశంలో, ఒక భాషా ప్రాంతపు చిత్రాలు పరోభాషా ప్రాంతంలోనే ప్రదర్శించరాదని ఆందోళనోద్యమాలు, దాడులు సాగుతూన్న ఈ కాలంలో సినీమా, సంగీతాల్లో అంతర్జాతీయత వెల్లివిరుస్తోందని గమనించినప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. ఉదాహరణకుపాశ్చాత్య సంగీతంపై మనం మోజు పెంచుకోడం లేదా? కొందరు యూరోపియన్ల (ముఖ్యంగా తూర్పు)లో మన హిందీ చిత్రాలయ్యాన్లమీద, వాయిద్యాల కూడా విపరీతమైన ఆసక్తి బయలు దేరుతోంది.

ప్రస్తుతం న్యూఢిల్లీలోవున్న రుమేనియన్ బాల నర్తకి ఈ దేశానికి రాకముందే బాగా ప్రచారంలో వున్న హిందీ సినిమా పాటలను పట్టి బట్టి సాధించేసింది. హిందీ సినిమా పాటలను ఆమె అచ్చు భారతీయ గాయనిలాగే పాడగలదు.

గత అక్టోబరులో బుఖారెస్టు వెళ్ళినప్పుడు ఆమె పాటలను విని ముగ్ధురాలైన ప్రధాని ఇందిర అందించిన ఆహ్వానాన్ని పురస్కరించుకుని యిప్పుడు భారత్‌కు వచ్చారు.



"కలిసొచ్చిన అదృష్టం"లో రామారావు



"నవ్వులు - పువ్వులు"లో శారద, చలం



'భలే మొనగాడు'లో
కృష్ణకుమారి

'భలే మొనగాడు'లో గీతాంజలి



సుప్రసిద్ధ భారతీయ సితార్ వాద్యకారుడు రవిశంకర్ అమెరికాలో ఈ వరకే మంచి "గిరాకీ" సంపాదించిన సంగతి అందరెరిగినదే. కాగా, ఆయనిప్పుడు తాను అమెరికాలో ఉన్న కాలంలో ఉపయోగానికని హాలీవుడ్‌లోనే ఒక భవనం కూడా నిర్మించుకున్నారు.

వాహినిలో రెండు పెళ్ళిళ్ళు

వాహినిలో ఇటీవల రెండు పెండ్లిండ్ల సన్నివేశం ఒకటి శోభస్కరంగా చిత్రించబడింది. ఈ పెండ్లిండ్లకు వధూవరులుగా రామారావు - భారతి ఒకజంట. కాకరాల - విజయలలితలు మరోజంట పెళ్ళిపీటలమీద కూర్చున్నారు. జానపద, సాహసిక చిత్ర నిర్మాణంతో చిత్ర సీమలోకి అడుగుపెట్టిన దర్శక నిర్మాత శ్రీ బి. వి. శ్రీనివాస్.

తమ తొలి సాంఘికం "సిన్నే పెళ్ళాడతా" కొరకు ఈ సన్నివేశాన్ని చిత్రీకరించారు,

ఈ షెడ్యూలులోనే రామారావు-భారతిమీద రెండు యుగళగీతాలు, భారతి ఒక్కతెమీదనే మరోపాట చిత్రీకరింపబడ్డాయి.

నారాయణరెడ్డి పాటలకు విజయా కృష్ణమూర్తి సంగీతం అందించారు. వేణు కెమెరా నడిపారు.

సూర్యకాంతం, ఛాయాదేవి, పద్మాంజలి, రమణారెడ్డి, బాలకృష్ణ, గణేశ్ మున్నగువారు నటిస్తున్న ఈ చిత్రం పూర్తి కావస్తోన్నట్లు తెలుస్తోంది.

బాగ్దాద్ దొంగ

పద్మ గారీ పిక్చర్సు వారి 'బాగ్దాద్ దొంగ' చిత్రం త్వరత్వరగా తయారవుతున్నది. రామారావు, జయలలిత, రేలంగి, రాజనాల, పద్మనాభం, ముక్కామల, గీతాంజలి, విజయలలిత మున్నగువారు నటిస్తున్నారు. సంగీతం శ్రీ టి. వి. రాజు నిర్వహిస్తున్నారు.

దర్శకుడు: యోగానంద్.

విడుదల: రాయల.

"మధువులో తేలిపో వలపులో సోలిపో!"

సుశీల గొంతులో సుధామధురిలా ప్రవహించిన ఈ పాటను అంబికా ఫిలింస్ వారి 'మాకూ మంచి రోజులొచ్చాయి' చిత్రానికి సంగీతదర్శకుడు శ్రీ ఎస్. హనుమంతరావు రికార్డు చేయించారు. ఈ పాట శ్రీ దాశరధిది. ఈ చిత్రాన్ని ఆంధ్రలో మోహన్ ఫిలింస్ వారు విడుదల చేస్తారు,

కాంతారావు, రాజనాల, ధూళిపాళ, సత్యనారాయణ, రమణారెడ్డి, కృష్ణకుమారి, సూర్యకాంతం, గీతాంజలి కాక కొత్తనటులు సలీమా, శ్రీధర్, సంతోష్‌కుమార్‌లు ఇందులో నటిస్తున్నారు.

కథ, నిర్మాణం - శ్రీ పి. ఆర్. కౌండిన్య, మాటలు: రాజశ్రీ, పాటలు: కొసరాజు, దాశరధి, రాజశ్రీ వ్రాశారు.



'మాకూ మంచిరోజులొచ్చాయి'లో గీతాంజలి

లండన్ లో డాక్టర్ ఝివాగో

లండన్ ఎంపైర్ థియేటర్‌లో "డాక్టర్ ఝివాగో" సినిమా ప్రదర్శన ఇటీవలనే మూడో సంవత్సరంలో పడింది. ఈ చిత్రం ఆ థియేటర్‌లో 1966 ఏప్రిల్ 26 న ప్రదర్శన ప్రారంభమయింది.

ఇంతవరకూ ఈ ఒక్క థియేటర్‌లోనూ ఈ చిత్రానికి వచ్చిన నికరాదాయం 2,64,000 డాలర్లు. (సుమారు రు 19 లక్షల 80 వేలు.)

గౌరీ ఆర్టు ఫిలిమ్స్ కొత్త చిత్రం

నిర్మాత శ్రీ యస్. భావనారాయణ 'గౌరీ ఆర్టు ఫిలిమ్స్' పతాక క్రింద నిర్మిస్తున్న కొత్త చిత్రానికి ఇటీవల సంగీత దర్శకుడు శ్రీ ఎ. ఎ. రాజు మరి రెండు పాటలు రికార్డు చేశారు.

జయలలిత, విజయనిర్మలపై చిత్రీకరించబడే ఈ పాటను జానకి, వసంత పాడారు.

ఆగస్టు విడుదల కలిసొచ్చిన అదృష్టం

యస్. వి. యస్. ఫిలిమ్స్‌వారి "కలిసొచ్చిన అదృష్టం" ఆగస్టు 10 న విడుదల చేయాలని నిర్మాతలు ఆశిస్తున్నారు.

ఈ చిత్రంలో రామారావు, కాంచన, రాజబాబు మరికొందరు జూనియర్ ఆర్టిస్టులపై చిత్రీకరించడానికి ఈ మధ్యనే వాసు స్టూడియోలో సంగీతదర్శకుడు శ్రీ టి వి. రాజు ఒక కోరస్ పాటను రికార్డు చేశారు.

సత్యనారాయణ, ధూళిపాళ, సంధ్యారాణి, తదితరులీ చిత్రంలో నటిస్తున్నారు. స్క్రిప్టు, దర్శకత్వ బాధ్యతలన్నీ నిర్మాత శ్రీ జగన్నాధరావు డైరెక్టర్ శ్రీ కె. విశ్వనాథ్ చేతుల్లోనే పెట్టారు.

మాటలు పినిశెట్టి, పాటలు కొసరాజు, నారాయణరెడ్డి సమకూర్చారు.

జయలలితకు మరో హిందీచిత్రం

పుష్పా పిక్చర్సు 'ఇజ్జల్' లో తన వర్కు పూర్తికావడంతో అప్పుడే తెలుగునటి జయలలిత ప్రసాద్ ఆర్టు ప్రొడక్షన్సువారు మదరాసులో నిర్మించనున్న మరో హిందీ చిత్రంలో నాయికపాత్రను స్వీకరించింది. ఈ చిత్రానికింకా పేరు లేదు.

ఇజ్జల్‌లో జయలలిత ధర్మేంద్రకు జోడీగా నటించింది.

జయలలిత ఇప్పుడు ఒక డజను తమిళచిత్రాలూ, అరడజను తెలుగు చిత్రాల్లో నటిస్తున్నది.

భారత్‌లో 182 కోట్ల 50 లక్షల సినీ ప్రేక్షకులు

1966 సంవత్సరం ప్రపంచంలోకెల్లా ఎక్కువ సినిమాలు నిర్మించిన



"చల్లనినీడ" లో జమున

దేశాలలో భారత్ రెండవ స్థానం ఆక్రమిస్తోంది. ఆ ఏడాదిలో 719 చిత్రాలు నిర్మించిన జపాన్ అగ్రతాంబూలం అందుకుంది. కాగా భారత్ 316 చిత్రాలు మాత్రం నిర్మించింది.

భారత్ తర్వాత 171 చిత్రాలు నిర్మించిన హాంకాంగ్ తృతీయ స్థానం సాధించింది. స్పెయిన్ 160, సోవియట్ యూనియన్ 59, అమెరికా 191 చిత్రాలు నిర్మించాయి.

అయితే చలన చిత్రాలను చూసిన ప్రేక్షక జనబాహుళ్యంలో భారత్‌కు నాల్గవ స్థానం మాత్రమే లభించింది. సాలుసరి ప్రేక్షకుల హాజరు 4,20,00 లక్షలమందితో సోవియట్, 4,00,00 లక్షల హాజరుతో చైనా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి.

ఈ హాజరు అమెరికాలో 2,28,80 లక్షలు, భారత్‌లో 1,82,50 లక్షలు, ఇటలీలో 64,00 లక్షలు, స్పెయిన్ 40.40 లక్షలు, జపాన్ 37.60 లక్షలు ఉంది.

వడమంత్రపు సిరి

నవజ్యోతివారి "వడమంత్రపుసిరి" షెడ్యూలు పూర్తి అయింది. విజయ-వాహినీ స్టూడియోలో ఇటీవలనే విజయలలితపై ఒక నృత్య గీతం చిత్రీకరించబడింది.

ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త (హరనాథ్) గౌరవార్థం జరిగిన ఒక విందు సందర్భంగా ఈ నృత్యం ఏర్పాటు చేయబడింది. ఈ చిత్రానికి కథానాయిక విజయనిర్మల.

రాజనాల, రాజబాబు, సూర్యకాంతం నటిస్తున్నారు.

సముద్రాల (జూ) మాటలు, కొసరాజు, దాశరథి, నారాయణరెడ్డి, ఆరుద్ర పాటలు వ్రాశారు. టి. చలపతిరావు సంగీతం.

ఇప్పటికి నాల్గు పాటల చిత్రీకరణ జరిగిందంటున్నారు.

హాస్యనటుడు పద్మనాభం డైరెక్షన్

నాయికా నాయకులు జయలలిత, హరనాథ్, సూర్యకాంతం, రేలంగి తదితర నటబృందం ఈ మధ్యనే రేఖా అండ్ మురళి ప్రొడక్షన్స్ పౌరాణికం "శ్రీరామ కథ"కై ప్రసాద్ స్టూడియోలో పదిరోజుల షూటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తొలిసారిగా ఈ చిత్రంతో దర్శకుడుగా పరిచయమవుతున్న హాస్యనటుడు పద్మనాభం ఈ షెడ్యూల్‌లో నాయికా నాయకులపై ఒక నృత్య గీతాన్ని, స్వప్న దృశ్యాన్ని కూడా చిత్రీకరించారు. ఈ సన్నివేశాలు రంగుల్లో చిత్రీకరించబడ్డాయి.

శారద, అంజలీదేవి, పద్మనాభం, రామ్మోహన్, నాగయ్య, ముక్కామల, సత్యనారాయణ, హేమలత, మాలతి, నిర్మల మున్నగు వారంతా ఈ చిత్రంలో అతిథి నటులుగా వస్తున్నారు.

కోదండపాణి సంగీత దర్శకత్వం వహించుతున్నారు. అక్టోబరు 1న రిలీజు చేయాలని సంకల్పం.

పసందైన పాటలు

ఇద్దరు మొనగాళ్ళు, జ్వాలాదీప రహస్యం, మంచి కుటుంబంలలో నిర్మాత శ్రీ పి. మల్లిఖార్జునరావుకు "హిట్ సాంగ్స్" సృష్టించి పెట్టిన శ్రీ కోదండపాణి ఈ నెల 12న విడుదల అవుతున్న "భలే మొనగాడు"లో కూడా శ్రీ మల్లిఖార్జునరావుకు మంచి చేయూత నిచ్చారంటున్నారు.

ఈ చిత్రానికి శ్రీ వేణు ఫోటోగ్రఫీ, విఠలాచార్య దర్శకత్వం నిర్వహిస్తున్నారు.

ఈ చిత్రంలో మొత్తం ఆరు పాటలున్నాయి. "ఇంద ఇంద తీసుకో!" అన్న ఆరుద్ర గీతానికి శ్రీ కోదండపాణి "సెక్సీ ట్యూన్" ఒకటి కూర్చారు. సుశీల పాడిన



"లక్ష్మీనివాసం"లో విజయలలిత, భారతి

ఈ పాటను గీతాంజలిమీద చిత్రీకరించారు.

శ్రీ ఆరుద్రే వ్రాసిన మరో పాట ప్రేమ బాణీలో సాగుతుంది. "ఏ వూరు నీ పయనం" అన్న ఈ పాట తప్పకుండా హిట్టయి తీరుతుందని విన్నవారు అంటున్నారు. దీనిని కూడా శ్రీమతి సుశీల, ఘంటసాలతో కలిసి పాడారు. తెరమీద ఇది కాంతారావు, కృష్ణకుమారి పాటగా చూపబడుతుంది.

శ్రీ నారాయణరెడ్డి వ్రాసిన "మనిషి తలచుకుంటే" అన్న పాట శాస్త్రీయబాణీలో వినిపిస్తుందట. దీనిని ఘంటసాల పాడారు.

నారాయణరెడ్డి వ్రాసిన మరో నృత్య గీతాన్ని సుశీల, జానకి కలిసి పాడారు.

"ఏలుకోను రాజా" అన్న దాశరథి గీతాన్ని సంధ్యారాణిపై చిత్రీకరించారు. దీనిని పాడిన కోరస్ బృందానికి సుశీల నాయకత్వం వహించారు.

ఆఖరిపాట—దీనిని కూడా సుశీల ఘంటసాలల యుగళగాత్రం విజయలలితకై గానం చేసింది.

ఈ పాటలన్నీ ఈ సరికే రికార్డుల రూపంలో బజారుకువచ్చాయి.

హిందీ చిత్ర వార్తలు

తొలిసారి సంజయ్, హేమామాలిని జోడీ

కేవల్ జిత్ ప్రొడక్షన్స్ 'మెహిల్' చిత్రంలో ఈసారి – మొదటిసారి – సంజయ్, హేమామాలిని జోడీ కట్టబోతున్నారు. ఈ చిత్రం ఈ నెలలోనే ప్రొడక్షన్ ప్రారంభమవుతుంది.

నిర్మాత కేవల్ కుమార్ ఈ చిత్ర దర్శకత్వ బాధ్యతను అమర్ కుమార్‌కు అప్పగించారు.

సంగీతం లక్ష్మీకాంత్, ప్యారేలాల్‌లు, పాటలు మజ్రూ సుల్తాన్‌పురి.

బొంబై నిర్మాతల బేబీ హాలీవుడ్

పంజాబ్ ప్రభుత్వం ఆహ్వానాన్ని అంగీకరించి 85 మంది బొంబాయి నిర్మాతలు తమ స్టూడియోలను "రూప్‌నగర్"కు తరలించ నిశ్చయించుకున్నారు.

పంజాబ్ ప్రభుత్వం "రూపార్" వద్ద రూప్ నగర్‌లో ఒక చిన్న సైజు హాలీవుడ్‌ను నిర్మించ నిశ్చయించుకుంది.

అనోఖీ రాత్

యల్. బి. ఫిలిమ్స్ 'అనోఖీ రాత్' షూటింగ్ పూర్తి అయి యిప్పుడు ఎడిటింగ్‌లో వుంది.

ఉమ్మడిగా నాశనమయే పరిస్థితులను ఎదుర్కొంటున్న ఇద్దరు విరుద్ధ వ్యక్తుల కథగా నడిచిన ఈ చిత్రం మానవ మనస్తత్వంలోని భిన్నరీతులను, నైజాలను ప్రతిభావంతంగా చిత్రిస్తుందట.

నూతననటి జహీదా – సంజీవ కుమార్ నాయికా నాయకులు. పరీక్షిత్ సాహ్నీ, అరుణా ఇరానీ, ముక్రీ, అన్వర్, తరుణ్ బోస్, విజయ ఖోటే నటిస్తున్నారు.

ఇందీవర్ పాటలకు కి॥ శే॥ రోషన్ బాణీలు కూర్చారు. నిర్మాత లచ్మన్, దర్శకుడు అసిత్ సేన్.

పత్ని

వి. ఆర్. నాయుడు దర్శకత్వంలో నిర్మించబడుతున్న "పత్ని"కి నీరజ్, ఇందీవర్, వాశిష్ఠ్‌లు పాటలు వ్రాశారు. విష్ణుఖన్నా సంగీతం.

దేవ్‌కుమార్, ఇంద్రాణిముఖర్జీ, కుమారి పద్మ, కుందన్, రమేష్ దేవ్ జగ్దేవ్, హరేందర్‌నాథ్ చటోపాధ్యాయ, లక్ష్మి ఆర్య నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ బి. ఎ. పర్దేశి, ఎ. ఆర్. నాయుడు సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

జన్మజన్మాంతరాల ప్రేమగాథ

కల్పనాలోక్ వారి ఈస్ట్మన్ "కలర్" నీల్‌కమల్ – సెన్సారు కత్తెరకి వారమే అందించబడుతున్నది. చిత్రంలో ధర్మేందర్ – వహీదా; డైరెక్టర్ రామ్‌మహేశ్వరి.

ఉత్తరాలు

తన భార్య ఎదుటి వారిని చూడ్డం గాని, నవ్వడం గాని చేస్తే చూడలేని మగవాళ్ళు ఎందరో వున్నారు. ఇలాంటి సంకుచిత వ్యక్తులకు ఎదటి వారి హృదయ బాధతో పనుండదు. ఈ వాస్తవాన్ని 'పురుషలక్షణం'లో శ్రీ రామకోటి గారు చక్కగా చూపేరు.

"పరివర్తన" ఇతి వృత్తం పాతదే అయినా మరి కొంచెం రంగులు పులిమేరు.

"ఎర్రగులాబి" మాత్రం పూర్తిగా పాత కథ. బాహ్యసౌందర్యాన్ని, ఆత్మ సౌందర్యాన్ని ఆరాధించడంలో వివిధ ప్రవృత్తులు గల ఇద్దరు వ్యక్తుల్ని గూర్చి చెప్పేరు. ఇదేమీ క్రొత్త కథ కాదు.

ఎస్. సత్యనారాయణ,
ఖర్గపూర్.

ఈ నెలలో ప్రచురించిన కథలు ఒకటి కంటె ఒకటి చాలా బాగున్నవి. రోహిణి రచించిన "పరివర్తన" జ్యోతికికొకవన్నె తెచ్చినది. 'గోమతి' కథ ఉత్తేజకరముగా యున్నది. క్రొత్త సీరియల్ "దేవతి మనుషులు" కథకు ఎదురుచూచు చున్నాము.

వి. ఎస్. కృష్ణయ్య,
కోలార్.

జ్యోతి సర్వాంగ సుందరంగా ఉంది. ముఖ్యంగా "ఎర్ర గులాబి" కథ చాలా బాగుంది. "పరివర్తన" కూడ బాగుంది. రచయితలకు హృదయపూర్వక ధన్యవాదాలు.

ద్వివేదుల విశాలాక్షిగారి "గోమతి" సీరియల్ జ్యోతికి వన్నె తెచ్చిందనుటలో అతిశయోక్తి లేదు.

భూపతి రామచంద్రరావు,
విజయవాడ.

శ్రీమతి ద్వివేదుల విశాలాక్షి గారి 'గోమతి' సీరియల్ మంచి రసవంతంగా నడుస్తోంది. ఈ నెల కథ ఒక క్రొత్తమలుపు త్రొక్కింది. కథా గమనానికి తగిన రచనాశిల్పం పూవుకు తావిలా సరిపోయింది. రచయిత్రికి అభినందనలు.

డి. శ్రీధరాచార్య,
జైనద్.

జూన్ నెల 'పనికిరాని పరిజ్ఞానం' లో తిమింగలము ఇరవై నిమిషాల కంటె ఎక్కువగా నీటి అడుగున ఉండలేదు అని బాబ్జీగారు వ్రాశారు. కాని "వైల్డ్ లైఫ్" అనే పుస్తకములో ఎఫ్. మార్టిన్ డంకన్ వ్రాసిన ప్రకారము తిమింగిలము నీటి అడుగున గంట, ఇంకా ఎక్కువసేపు కూడా వుండగలదు.

కుమారి మీనా,
విశాఖపట్టణం.

[తిమింగలాలపై స్వయంగా పరిశోధన చేసిన వాణ్ణి కాదు కనుక అవి నీటి అడుగున ఒక్కొక్కసారికి ఎంత సేపు వుండగలవనేది నాకు బాగా తెలియదు. ఈ విషయంలో అభిప్రాయ భేదాలున్నట్టున్నాయి. 'బుక్ ఆఫ్ నాలెజ్' అనే పుస్తకంలో తిమింగలం ఇరవై నిమిషాల కంటె నీటి అడుగున వుండలేదని వ్రాయబడి వుంది.]

"బాబ్జీ"

ఈ నెల 'జ్యోతి' లో ప్రచురితమయిన హిమబిందుగారి 'ఎర్ర గులాబి' అను కథ నన్ను ఆకర్షించింది. బాలగంగాధర్‌గారి 'జీవితం' గురించి వేరే వ్రాయనక్కర్లేదనుకుంటాను. తెలుగు చలనచిత్ర రాజకీయాలు గురించి వ్రాసిన మీ వ్యాసం చాలా బాగుంది. రాజకీయాలు అను శీర్షికలో అతి సహజంగా నిశితంగా వుండే అటువంటి వ్యాసాల్ని ప్రచురిస్తేనే అవి పాఠకుల ఆదరాభిమానాలు చూరగొంటాయి అని అనటంలో తప్పేంలేదు.

హరికిషన్ ప్రసాద్,
స్తంభంపల్లి.

'పరివర్తన' బాగుంది. ఇందులో ఆధునిక యువతీ యువకుల ప్రేమ ఎటువంటిదో రోహిణిగారు చిత్రీకరించారు. ఈ నెల 'రాగరంజని' శీర్షికలో మీరు పరిచయం చేసిన 'జూతికారాయ్' గురించి ఇంత వరకూ నాకు ఏమీ తెలియ కాని ఈ వ్యాసం వలన ఆమె గురి ఎంతో తెలుసుకోగలిగాను. ఇ వంటి క్రొత్త క్రొత్త విషయా కనిపెట్టి పాఠకులకు అందించడం మీకు మీరే సాటి.

కొమురవెల్లి ప్రభాక
కరింనగ

'ఎర్ర గులాబి' కథలో పన్ని కల్పన సహజ సుందరంగా వు హిమబిందుగారికి నా అభివ నములు.

జి. లీలా కుమా
గుడ్లవల్లె

'ఎర్ర గులాబి' కథ చాలా బాగుంది. హిమబిందుగారికి అభివందనములు.

జె. ఇందుమ
కొండప

కథా రచనలో, కథాగమన క్రొత్తదనమేమీ లేకపోయి కాను, ఎల్లప్పుడు జంట జడ ఒంటిగా ధరించే 'ఎర్ర గులాబి ఆధారంగా చక్కని కథగా దిద్దిన హిమబిందుగారి ఎర్ర గు నేటి యువతీమణులకు చక్కని పాఠం కాగలదు.

యస్. గోపాలర
హైద్రాబా

Edited and Published by V. V. Raghavaiah, and Printed by him at Jyothi Printers, Machavaram, Vijayawada-4.

JYOTI JULY68 REGD. NO. H. 368

